

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 309

శుక్రవారం | 23-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 |

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి మ. 3.35 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: ఆశ్లేష రా. 7.26 తదుపరి మఖ; వర్జ్యం: ఉ. 6.58-8.45; దుర్ముహూర్తం: ఉ. 9.01-9.47, మ. 12.52-1.39; అమృతఘడియలు: సా. 5.39-7.26; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 6.17

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సిగ్గు.. సిగ్గు!

నిస్సిగ్గుగా జగన్ సర్కారు అడ్డగోలు పనులు


(ఫైల్)

మైకు పట్టుకుంటే చాలు... సూక్తి ముక్తావళి వినిపిస్తారు. పారదర్శక పాలన, బాధ్యతాయుత పాలన, జన రంజక పాలన... అంటూ మాటలు చెబుతారు. చేతల్లోకి వచ్చేసరికి అంతా రివర్స్! జనం ఏమనుకుంటారనే వెరపు, సిగ్గు, మొహమాటం ఏమీ లేకుండా బరితెగించేస్తున్నారు. 'సిద్ధం' అంటూ సభలు పెట్టి, కార్యకర్తలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు వాడుకుంటూ... సామాన్య ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్న సంగతి తెలిసిందే! పోనీ... ఆర్టీసీకైనా వైసీపీ పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లిస్తోందా అంటే అదీ లేదు. ఇదో సిగ్గుమాలిన పని! ఇక... సీఎం సభల ఏర్పాట్లకే డబ్బుల్లేవని, కాస్త సర్ది పెట్టాలని చిత్తూరు కలెక్టర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీకి లేఖ రాశారు! దీంతో సర్కారు పరువు పాయె! ఇప్పటికే అవసరమైనప్పుడల్లా ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లలో తిరుగుతున్న జగన్.. మరికొన్ని రోజుల్లో ఎన్నికల షెడ్యూలు వస్తుందనగా ఏకంగా 2 హెలికాప్టర్లు లీజుకు తీసుకుంటున్నారు. అవి ఎందుకో, ఎప్పుడు వాడతారో! ఇక.. వైద్య ఆరోగ్య మంత్రి విడదల రజిని యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూ కోసం ప్రభుత్వ వైద్యులు, సిబ్బందిని గంటల తరబడి ప్రేక్షకుల్లా కూర్చోబెట్టారు! ఇదీ.. 'బాధ్యతాయుతం'గా సాగుతున్న జగన్ సర్కారు పాలన!

ఆర్టీసీకి విలాపం... హెలికాప్టర్లతో విలాసం

వైద్య నారాయణులతో పరిహాసం

ఇదేనా బాధ్యతాయుత పాలన?

జగనన్న 'సిద్ధం'తో ఆర్టీసీకి నష్టం

3 సభలకు కలిపి ఎగ్గొట్టింది 5 కోట్ల పైనే

ఒక్క రాప్తాడు సభకే 3 వేల బస్సులు

ఆర్టీసీకి చెల్లించాల్సిన అద్దె 8.79 కోట్లు

వైసీపీ ఇచ్చింది 5 కోట్లు మాత్రమే

భీమిలి, దెందులూరులో కోటిన్నర ఉఫ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మొన్నటిదాకా జగన్ సభలంటే చెట్లను అడ్డదిడ్డంగా నరికేసి.. ఇళ్లకు అడ్డుగా రోడ్లపై పరదాలు కట్టి.. జనం బయటకు రాకుండా ఆంక్షలు పెట్టి.. బారికేడ్లు ఏర్పాటు చేసి.. స్కూళ్లు, కాలేజీలకు అనధికారిక సెలవులు ప్రకటించి.. ప్రయాణికులకు బస్సులు లేకుండా రకరకాలుగా ఇబ్బందులకు గురి చేసేవారు. ఇప్పుడు వీటికి అదనంగా ఆర్టీసీకి భారీ నష్టం చేకూరుస్తున్నారు. ఇటీవల

మిగతా 12వ పేజీలో...


గుంటూరు మెడికల్ కాలేజీలోని జింఖానా మీటింగ్ హాల్‌లో యూ ట్యూబ్ చానల్‌కు మంత్రి రజిని ఇంటర్వ్యూ, ప్రేక్షకుల్లా హాజరైన వైద్య సిబ్బంది

లైట్.. కెమెరా.. ఓవరాక్షన్!

యూట్యూబ్ చానల్‌కు మంత్రి రజిని ఇంటర్వ్యూ

ప్రేక్షకుల అవతారంలో డాక్టర్లు, సీహెచ్‌వోలు

ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కూడా అక్కడే

అంతా సివిల్ డ్రస్‌లోనే రావాలని ఉత్తర్వులు

ముందే అంతా సెటప్ చేసి జగన్ భజన

12

సీఎం వస్తున్నారు.. ఖర్చులకు డబ్బులివ్వండి!

ఖాళీ చేతులు చూపిన చిత్తూరు కలెక్టర్

రూ.2 కోట్లు ఇవ్వాలని హౌసింగ్ ఎండీకి విన్నపం

జనం సొమ్మేగా తిరిగేద్దాం! | **జగన్ కోసం 2 హెలికాప్టర్లు అద్దెకు**


సమన్వయ భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన నేతలు

28న గూడెంలో ఉమ్మడి భేరి

టీడీపీ-జనసేన సమన్వయ కమిటీ నిర్ణయం

చంద్రబాబు, పవన్ కల్యాణ్ హాజరు

ప్రత్తిపాడులో సభా ప్రాంగణం

6 లక్షల మందితో ఘనంగా నిర్వహిస్తాం

బీజేపీతో చర్చలు జరుగుతున్నాయి

త్వరలో విషయం చెబుతాం: అచ్చెన్న

ఈ సభతోనే ఎన్నికల శంఖం పూరిస్తాం

వైసీపీ విముక్త ఆంధ్రకు నాంది: నాదెండ్ల

మార్చిలో జరిగే భారీ సభకు మోదీ?

బీజేపీ కూడా కూటమిలో చేరాక సంయుక్తంగా మేనిఫెస్టో విడుదల

సీట్లపై ఎవరూ మాట్లాడకుండా కట్టడి

నాయకత్వాలకు వదిలేయాలని ఆదేశం!

మీడియాపై దాడులు రాక్షసత్వమని విమర్శ

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కార్యాచరణకు టీడీపీ-జనసేన నడుం బిగించాయి. ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించాయి. గురువారం విజయవాడ నోవాటెల్ హోటల్లో ఈ రెండు పార్టీల రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీ సమావేశం

మిగతా 11వ పేజీలో...

27న ఏలూరులో బీజేపీ సభ



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరు

పొత్తు ఎలా ఉన్నా పోటీకి సిద్ధం

జగన్ వైఫల్యాలపై నిలదీస్తాం: పురందేశ్వరి

11

టీడీపీలోకి వేమిరెడ్డి.. కలిసి ఆహ్వానించిన పార్టీ నేతలు


2

అరాచక మంత్రి అవసరమా?

జయరాంను ఎలా చేర్చుకుంటారు?

టీడీపీలో చేరతారన్న ప్రచారంపై ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి


12

వైసీపీకి ఎంపీ మాగుంట గుడ్‌బై!

సీఎం సభకు గైర్హాజరు కావాలని నిర్ణయం

అదే దారిలో అనుచరులు కూడా..

ఢిల్లీలో ఆప్- కాంగ్రెస్ పొత్తు ఖరారు

4 చోట్ల ఆప్, మూడుచోట్ల కాంగ్రెస్ పోటీ

గుజరాత్, గోవా, హరియాణా, చండీగఢ్ సీట్ల పంపకాలు దాదాపు పూర్తి

2

యూపీ అమేథీ నుంచి రాహుల్ పోటీ?



గదిలో వ్యక్తి నిద్రిస్తుండగా భవనం కూల్చివేత

శిథిలాలు మీద పడి అక్కడికక్కడే మృతి

హైదరాబాద్‌లో ఘటన

మృతుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాజు

2

గంజాయి కేసులో యూట్యూబర్

షణ్ముఖ్ అరెస్ట్

షర్మిల అరెస్ట్

దగా డీఎస్సీకి వ్యతిరేకంగా 'చలో సెక్రటేరియట్'

ఆంధ్రరత్న భవన్ చుట్టూ పోలీసుల మోహరింపు

ఆమె బయటకు వస్తే అరెస్టు చేయాలని యత్నం

ఆవరణలోనే ధర్నాకు దిగిన పీసీసీ సారథి

తర్వాత పోలీసు కంట్రోల్ రూం వరకు ర్యాలీ

వాహనాల్లో అమరావతి సచివాలయానికి పయనం

ఉండవల్లి కరకట్టపై అడ్డగించిన పోలీసులు

షర్మిలనూ ఈడ్చుకుంటూ వాహనంలో పడేసిన వైనం

చేతికి గాయం.. మధ్యాహ్నం విడుదల

11


షర్మిలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు.(ఇన్‌సెట్) చేతికి తగిలిన గాయాన్ని చూపుతున్న షర్మిల

ఆడపిల్లపై ఇంత నిర్దయా?

నాన్న ఆత్మ క్షోభిస్తుంది అమ్మ ఎంతో బాధపడుతుంది

దగా సీఎం.. తాడేపల్లినీ త్వరలో టచ్ చేస్తాం: షర్మిల


అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

గర్జించిన కలం

నిర్బంధాలను దాటుకుని 'చలో అనంత'కు వెల్లువెత్తిన జర్నలిస్టులు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడిపై ఆగ్రహం.. నినాదాల హోరు

దాడులు ఆగకపోతే తాడేపల్లి ప్యాలెస్ ముట్టడి.. జర్నలిస్టుల హెచ్చరిక

దాడులపై స్పందించే తీరిక జగన్‌కు, డీజీపీకి లేదా అంటూ మండిపాటు

12

వాటీజ్ దిస్ వెంకటరెడ్డీ?

ఇసుక అక్రమాలకు అండదండలు

తొలి ముద్దాయి గనుల శాఖే!

ఎన్జీటీ ఆదేశాలపై 'సియా' 8 లేఖలు

అక్రమాలు ఆపాలని పదేపదే సూచన

అయినా పట్టించుకోని గనుల డైరెక్టర్

తవ్వకాలు జరగలేదంటూ అబద్ధాలు

ఇప్పుడు కేంద్ర కమిటీతో నిగ్గుతేలిన నిజం

అడ్డంగా ఇరుక్కుపోయిన వెంకటరెడ్డి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కంచే చేను మేసినట్లు.. కాపలాదారే దొంగలతో కుమ్మక్కయినట్లు... రక్షకుడే భక్షకుడిగా మారినట్లు రాష్ట్ర గనుల శాఖే ఇసుక దోపిడీకి పూర్తిస్థాయిలో సహకరించింది. ఇసుక అక్రమ తవ్వకాలు, పర్యావరణ విధ్వంసం, ఖజానాకు

మిగతా 11వ పేజీలో...



అవును.. అది కొవిడ్ వ్యాక్సిన్ల ఫలితమే!

గుండె, మెదడు, రక్త సంబంధిత వ్యాధులకు కారణమదే

8 దేశాల్లో 9.9 కోట్ల మందిపై స్టడీ

వారిలో 13 రకాల ఆరోగ్య సమస్యలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కంటికి కనిపించని కరోనా వైరస్ మానవాళిపై పంజా విసిరిన వేళ.. ఆ ప్రాణాంతక వైరస్‌పై పోరాటంలో కొవిడ్-19 వ్యాక్సిన్ ఆశాదీపంలా కనిపించింది. వైరస్ స్వైరవిహారానికి అడ్డుకట్ట వేసింది. ఇంతవరకూ బాగానే ఉంది కానీ.. కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వారిలో గుండె, రక్త సంబంధిత వ్యాధులు

మిగతా 2వ పేజీలో...



పాము విషానికి సింథటిక్ హ్యూమన్ యాంటీబాడీ

» అభివృద్ధి చేసిన ఇండో-అమెరికా పరిశోధకులు




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పాము కాటు వల్ల ఏటా వేలాది మరణాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా భారత్, ఆఫ్రికా దేశాల్లో ఎక్కువ మంది పాముకాటుకు గురవుతున్నారు. అయితే.. ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా అంతటా కనిపించే నాగుపాటు, కింగ్ కోబ్రా, బ్లాక్ మాంబాతో సహా అత్యంత విషపూరిత పాములు ఉత్పత్తి చేసే శక్తివంతమైన న్యూరోటాక్సిన్లను నిర్వీర్యం చేయగల సింథటిక్ హ్యూమన్ యాంటీబాడీల (ప్రతిరోధకాలు)ను బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ), అమెరికాలోని స్క్రిప్స్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా అభివృద్ధి చేసింది. దీని కోసం పరిశోధకులు.. హెచ్ఐవీ, కొవిడ్-19కు వ్యతిరేకంగా ప్రతిరోధకాలను పరీక్షించడానికి గతంలో ఉపయోగించిన విధానాన్ని అనుసరించారు. గతంలోగుర్రాలు, గాడిదలకు ముందుగా పాము విషం ఎక్కించి.. ఆ తర్వాత వాటి రక్తాన్ని సేకరించి యాంటీబాడీలు అభివృద్ధి చేసేవారు. సైన్స్ ట్రాన్స్‌ప్లాంటేషనల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనంలో.. పరిశోధకులు అభివృద్ధి చేసిన సింథటిక్ హ్యూమన్ యాంటీబాడీలు వివిధ రకాల పాము విషాల నుంచి రక్షణ అందించగల సార్వత్రిక యాంటీబాడీ ద్రావణాల తయారీకి మరో ముందడుగు అని పరిశోధకులు తెలిపారు.

చైనాలో వంతెనను ఢీకొన్న భారీ నౌక

» రెండుగా చీలిన బ్రిడ్జి.. ఐదుగురి మృతి



బీజింగ్, ఫిబ్రవరి 22: చైనాలోని గ్వాంగ్జూ నగరంలో ఓ భారీ వాణిజ్య నౌక వంతెనను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. గురువారం తెల్లవారుజామున ఫోషమన్ నుంచి గ్వాంగ్జూ వైపు పెరల్ నదిలో ప్రయాణిస్తున్న నౌక మార్గమధ్యలో ఉన్న లిజింగ్జా వంతెనను బలంగా ఢీకొంది. దాని ధాటికి వంతెన రెండు ముక్కలుగా చీలిపోవడంతో ఒక బస్సు, మోటారుసైకిల్ సహా పలు వాహనాలు నదిలో పడ్డాయి. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్ ఒకడే ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాద స్థలానికి రెస్క్యూ దళాలు చేరుకున్నాయని, గాలింపు పూర్తయని తర్వాతే మృతుల సంఖ్య తేలే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. కాగా, ప్రమాదానికి కారణమైన నౌక కెప్టెన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.





గదిలో వ్యక్తి నిద్రిస్తుండగా భవనం కూల్చివేత

» శిథిలాలు మీద పడి అక్కడికక్కడే వ్యక్తి మృతి

» మృతుడు శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాజు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఓ పాత భవనాన్ని కూల్చివేసే క్రమంలో దారుణం జరిగింది. భవనంలోని ఓ గదిలో వ్యక్తి నిద్రిస్తున్న సంగతి తెలియక జేసీబీలతో భవనాన్ని కూల్చివేశారు. దీంతో, ఆ వ్యక్తి శిథిలాల చిక్కుకొని అక్కడికక్కడే చనిపోయాడు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన స్వామిరెడ్డి రాజు(45) మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్‌కు చెందిన పాత భవనంలో అద్దెకుంటున్నాడు. భార్యతో మనస్పర్ధలు రావడంతో ఒంటరిగా ఉంటున్న రాజు మద్యానికి బానిసయ్యాడు. ఇదిలా ఉండగా, తన పాత ఇంటిని కూల్చివేసి కొత్త భవనం నిర్మించాలని శ్రావణ్‌కుమార్ నిర్ణయించుకొన్నాడు. మంగళవారమే రాజుతోపాటు మిగతా గదుల్లో నివాసముండే వారందరిని ఖాళీ చేయించాడు. భవన కూల్చివేత పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించాడు. సదరు కాంట్రాక్టరు బుధవారం సాయంత్రం కూల్చివేత పని పూర్తి చేశాడు. రాత్రి 2 గంటల సమయంలో భవన వ్యర్థాలను తొలగిస్తుండగా శిథిలాల కింద మృతదేహం కనిపించింది. అది స్వామిరెడ్డి రాజుదేనని గుర్తించారు. రాజు తాగిన మత్తులో వచ్చి గదిలో నిద్రపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాంట్రాక్టర్ రాజు, జేసీబీ డ్రైవర్ అంజన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు స్వామిరెడ్డి రాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఢిల్లీలో ఆప్- కాంగ్రెస్ పొత్తు ఖరారు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ- కాంగ్రెస్ పొత్తు ఖరారైన మరునాడే ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)- కాంగ్రెస్ పొత్తు ఖరారైంది. ఢిల్లీలో 4 సీట్లలో ఆప్, మూడు సీట్లలో కాంగ్రెస్ పోటీ చేసేందుకు ఇరు పార్టీల మధ్య ఒప్పందం కుదిరింది. అలాగే గుజరాత్, గోవా, చండీగఢ్, హరియాణాలలో సీట్ల పంపకాలపై కూడా కాంగ్రెస్- ఆప్ మధ్య అవగాహన ఏర్పడింది. గుజరాత్‌లో రెండు చోట్ల ఆప్, చండీగఢ్‌లోని ఏకైక స్థానానికి కాంగ్రెస్, గోవాలోని రెండు సీట్లలో చెరోచోట పోటీకి అవకాశాలున్నాయని ఇరు పార్టీల వర్గాలు తెలిపాయి. కాగా, రాహుల్ గాంధీ గతంలో పోటీ చేసి ఓడిపోయిన యూపీలోని అమేథీ నుంచే మరోసారి పోటీ చేయనున్నారని, ప్రియాంక కూడా రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్ నా కులాన్ని తిట్టింది: ప్రధాని మోదీ

నవ్‌సారి, మోహసానా, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ తన కులాన్ని తిట్టిందని.. తనను దూషించడం తప్ప ఆ పార్టీకి మరో ఎజెండా లేదని ప్రధాని మోదీ అన్నారు. వారి ఈ ధోరణి.. ఎన్డీఏ కూటమి 400కు పైగా సీట్లు సాధించాలన్న తమ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఎంత ఎక్కువ బురదజల్లితే.. అంతగా 370 కమలాలు (బీజేపీ గుర్తు) వికసిస్తాయని పేర్కొన్నారు. గుజరాత్‌లోని నవ్‌సారి, మోహసానా జిల్లాల్లో గురువారం మోదీ విస్తృతంగా పర్యటించారు. రూ.8,350 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడుతూ కాంగ్రెస్‌పై మండిపడ్డారు. అమూల్ పాల ఉత్పత్తుల తయారీ సంస్థ గుజరాత్ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్)ను ప్రపంచ నంబర్‌వన్ చేయాలని రైతులు, వాటాదారులకు మోదీ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో గురువారం లక్షమందిపైగా రైతులు హాజరైన సభలో ప్రధాని మాట్లాడారు.

ఆయుర్వేదంతో కొవిడ్ తగ్గిపోయింది: సీజేఐ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: తాను ఆయుర్వేద వైద్య సమర్థకుడ్ని అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. గురువారం సుప్రీంకోర్టు ఆవరణలో అత్యాధునిక ఆయుష్ హోలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "నాకు మొదటి సారి కరోనా సోకినప్పుడు ప్రధాని మోదీ ఫోన్ చేసి కుశలప్రశ్నలు అడిగారు. ఆయుష్ విభాగం కార్యదర్శి, వైద్యుడూ అయిన వ్యక్తితో మాట్లాడిస్తా.. ఆయన మందులు పంపిస్తారని చెప్పారు. ఆయన ఇచ్చిన మందులు వాడాక తగ్గింది. తరువాత రెండు సార్లు కరోనా సోకినా అల్లోపతి జోలికి పోలేదు. ఆయుర్వేదమే వాడాను" అంటూ వివరించారు.

సింహాలకు సీత, అక్బర్ పేర్లు మార్చండి

కోల్‌కతా, ఫిబ్రవరి 22: పెంపుడు కుక్కలకు ఎవరైనా దేవుడి పేర్లు పెట్టుకుంటారా అని గురువారం కలకత్తా హైకోర్టు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సిలిగురిలో ఉన్న బెంగాల్ సఫారీ పార్కులోని సింహాలకు పెట్టిన సీత, అక్బర్ అన్న పేర్లను మార్చాలని ఆదేశించింది. ఆడ సింహానికి సీత అన్న పేరును పెట్టడాన్ని సవాలు చేస్తూ వీహెచ్‌పీ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ సుగత భట్టాచార్య ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ దేబ్‌జ్యోతి చౌదరిని ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడుతూ "మీ పెంపుడు కుక్కకు దేవుడు పేరో, ముస్లిం ప్రవక్త పేరో పెడుతారా? మనమయితే సీత, అక్బర్ పేరు పెట్టం. రవీంద్రనాథ్ టాగూర్ పేరు పెట్టాలని ఆలోచిస్తామా? సీతను దేశమంతటా ఆరాధిస్తారు. అక్బర్ సమర్థుడైన సెక్యులర్ చక్రవర్తి. ఆ పేర్లను తొలగించండి. బిజలీ వంటి పేర్లను పెట్టుకోండి" అని సూచించారు.

'నువ్వే రూ.5 వేలు భర్తకు భరణం ఇవ్వు'

» ఓ మహిళకు షాకిచ్చిన ఇండోర్ ఫ్యామిలీ కోర్టు

ఇండోర్, ఫిబ్రవరి 22: వరకట్న వేధింపులపై తప్పుడు కేసులు పెరిగిపోతున్న వేళ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఫ్యామిలీ కోర్టు ఓ ఆసక్తికర తీర్పు ఇచ్చింది. భర్తకు ప్రతి నెలా రూ.5వేల చొప్పున భరణం చెల్లించాలని భార్యను ఆదేశించింది. భర్తపై ఓ మహిళ పోలీసులకు చేసిన ఫిర్యాదుకు, న్యాయస్థానంలో చెప్పిన విషయాలకు పొంతన లేకపోవడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఉజ్జయినికి చెందిన అమన్ 2020లో తొలిసారి సదరు యువతిని కలిసి ఆమెతో ప్రేమలో పడ్డాడు. అప్పుడతడు 12వ తరగతి చదువుతున్నారు. యువతి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో 2021 జూలైలో ఆమెను పెళ్లాడాడు. అయితే, ఆమె పెడుతున్న హింసను తట్టుకోలేక రెండు నెలలకే అమన్ తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లిపోయాడు. దీంతో తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి.. తర్వాత గృహహింస కేసు పెట్టి కోర్టుకు వెళ్లింది. తనకు భరణం ఇప్పించాలని కోరింది. తొలుత ఫిర్యాదుకు, తర్వాత ఆమె కోర్టులో చేసిన వాదనలకు పొంతన లేకపోవడంతో కోర్టు.. ఆ యువతే భరణం చెల్లించాల్సిందిగా ఆదేశించింది.

ప్రయోగాత్మకంగా సీబీఎస్ఈ ఓపెన్‌బుక్ పరీక్షలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఓపెన్‌బుక్ పరీక్ష (ఓబీఈ) విధానంపై కేంద్ర సెకండరీ విద్యాబోర్డు(సీబీఎస్ఈ) దృష్టి సారించింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతుల వరకు ఈ విధానాన్ని ఈ ఏడాది ఆఖరులో ప్రయోగాత్మకంగా అమలులోకి తేవాలని యోచిస్తోంది. గతేడాది డిసెంబరులో జరిగిన బోర్డు పాలకవర్గం ఆఖరు సమావేశంలోనే ఈ విధానంపై చర్చ జరిగింది. ఎంపిక చేసిన కొన్ని పాఠశాలల్లో 9- 10 తరగతుల్లో ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్సు సబ్జెక్టుల్లో.. 11- 12 తరగతుల్లో ఇంగ్లీషు, మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టుల్లో ఈ పరీక్షా విధానాన్ని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలనుకొంటున్నట్లు అధికారులు తెలిపారు. ఓపెన్‌బుక్ పరీక్ష విధానంలో భాగంగా నోట్సు, టెక్స్ట్‌బుక్కు, ఇతర స్టడీమెటీరియల్‌ను తమవెంట పరీక్ష హాలులోకి తీసుకెళ్లడానికి, పరీక్ష సందర్భంగా వాటిని రిఫర్ చేయడానికి విద్యార్థులకు అనుమతిస్తారు. విద్యార్థుల ఆలోచన శక్తి, సృజన- విశ్లేషణ, సమస్యాపూరణ సామర్థ్యాలను మదింపు చేయడానికి ఈ ప్రయోగాత్మక పరీక్ష విధానంలో ప్రాధాన్యం ఇస్తారు.

ప్రభుత్వం చెప్పిందని చేశాం!

రైతుల ఉద్యమంతో సంబంధం ఉన్న ఖాతాల సస్పెన్షన్‌పై 'ఎక్స్'.. భారత్‌లోనే బ్లాక్ చేసినట్లు వెల్లడి

» ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన మోదీ

» ప్రజలు గుణపాఠం చెబుతారు: రాహుల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రైతుల నిరసనలతో ముడిపడి ఉన్న అనేక ఖాతాలను ఎలాన్ మస్క్ నేతృత్వంలోని సోషల్ మీడియా కంపెనీ 'ఎక్స్' గురువారం సస్పెండ్ చేసింది. ఇందులో పలువురు ప్రముఖ రైతు నాయకులు, వారి మద్దతుదారుల ఖాతాలు ఉన్నాయి. రైతుల ఉద్యమానికి సంబంధించిన ఖాతాలు, పోస్టులను నిలిపివేయాలని భారత ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఆదేశించింది. అయితే సర్కారు ఉత్తర్వులు పాటించిన 'ఎక్స్'... ఈ చర్య తీసుకోవడంలో తన అసమ్మతిని వ్యక్తం చేసింది. భావప్రకటనా స్వేచ్ఛకు తాము కట్టుబడి ఉన్నామని నొక్కిచెప్పింది. ప్రభుత్వ సూచనలను అనుసరించి చర్యలు తీసుకున్నామని, దీనిపై ఖాతాదారులకు సమాచారం కూడా ఇచ్చినట్లు తెలిపింది. కేంద్రం ఆదేశాల ప్రకారం భారత్‌లో మాత్రమే ఈ ఖాతాలు, పోస్టులను బ్లాక్ చేస్తున్నామని స్పష్టం చేసింది. రైతుల 'చలో ఢిల్లీ' నిరసనకు సంబంధించి శాంతి భద్రతలను కాపాడటంలో భాగంగా కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు మొత్తం 177 సోషల్ మీడియా ఖాతాలను, వెబ్‌లింక్‌లను తాత్కాలికంగా సస్పెండ్ చేయాలంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, స్నాప్ చాట్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను ఆదేశిస్తూ ఫిబ్రవరి 14న ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మండిపడ్డ కాంగ్రెస్

రైతుల నిరసనలకు సంబంధించి 177 ఖాతాలను తాత్కాలికంగా నిలిపివేయాలని కేంద్రప్రభుత్వం 'ఎక్స్'ను ఆదేశించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు. 'మోదీ జీ.. మీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ఈ విషయం ప్రజలకు తెలుసు. ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు' అని పేర్కొన్నారు. 'రైతులు కనీస మద్దతు ధర అడిగితే కాల్పులు జరపడం, యువత ఉద్యోగాలు అడిగితే వారి మాటైనా వినకపోవడం, మాజీ గవర్నర్ ఒకరు నిజం చెబితే.. ఆయన ఇంటికి సీబీఐని పంపడం, ప్రతిపక్ష పార్టీ బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడం... ఇదేనా ప్రజాస్వామ్యానికి భారతదేశం తల్లిలాంటిదని చెప్పడంలో అర్థం?" అని ప్రశ్నించారు. అది మీడియా కావచ్చు, సోషల్ మీడియా కావచ్చు.. మోదీ ప్రభుత్వం నిజం మాట్లాడే గొంతుకలను నొక్కేస్తోందని మండిపడ్డారు. కాగా, దేశానికి వెన్నెముకలాంటి రైతుల సమస్యలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్‌పై ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడుతోందని ఆరోపించారు.



తమపై ప్రయోగించిన టియర్ గ్యాస్ డబ్బాలతో ఓ రైతు

మాజీ గవర్నర్ సత్యపాల్‌పై సీబీఐ దాడులు

అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై జమ్మూ-కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ నివాసాల్లో గురువారం సీబీఐ సోదాలు చేసింది. పలు నగరాల్లో 30 చోట్ల ఈ దాడులు జరిగాయి. సుమారు వంద మంది అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. ఆ కేంద్ర పాలిత ప్రాంతంలో రూ.2,200 కోట్లతో చేపట్టిన కిరు జలవిద్యుత్తు కేంద్రం సివిల్ పనుల్లో అక్రమాలు జరిగినట్టు 2022 ఏప్రిల్‌లో ఆయనతో పాటు, మరికొందరిపై సీబీఐ కేసు నమోదు చేసింది. అందులో భాగంగానే ఈ సోదాలు జరిగాయి. సత్యపాల్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సీబీఐ దాడులపై ఆయన స్పందిస్తూ "అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో నియంతృత్వ శక్తులు నా నివాసాల్లో దాడులు చేశాయి. సోదాల పేరుతో నా డ్రైవరు, సహాయకుడ్ని కూడా అనవసరంగా వేధించారు. ఈ దాడులకు భయపడను. ఉద్యమం చేస్తున్న రైతులకు మద్దతుగా ఉంటా. ఇలాంటి చర్యలు నాకు ఆందోళన కలిగించవు" అని ఆయన వ్యాఖ్యానించారు.

రైతు మృతి బాధాకరం: వెంకయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సరిహద్దుల్లో కొనసాగుతున్న అన్నదాతల నిరసనల్లో ఓ రైతు మృతి చెందడం పట్ల మాజీ రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు మృతి బాధాకరమని ఆయన గురువారం ఎక్స్(ట్విటర్)లో పేర్కొన్నారు. అందరికీ సంతృప్తికరమైన ఫలితం వచ్చేలా ప్రభుత్వం, రైతులు చర్చలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంచి వాతావరణంలో చర్చలు జరగాలని, శాంతిని కాపాడేందుకు ఇరువురు కృషి చేయాలని వెంకయ్య నాయుడు కోరారు. కాగా, పంజాబ్-హరియాణా సరిహద్దులో యువ రైతు శుభకరణ్ సింగ్ మృతిపై హత్య కేసు నమోదు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) డిమాండ్ చేసింది. రైతుల నిరసనోద్యమంలో పాల్గొన్న శుభకరణ్ బుధవారం పోలీసు కాల్పుల్లో మరణించాడు. అతని మృతికి సంతాపంగా 'బాక్ డే' పాటించాలని, ట్రాక్టర్ల మార్చ్ నిర్వహించాలని ఎస్కేఎం పిలుపునిచ్చింది.

రష్యా సైన్యంలో సహాయకులుగా 100కు పైగా భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: అధిక వేతనాలు ఆశ చూపి ఏజెంట్లు చేసిన మోసానికి కొంతమంది భారతీయులు రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో చిక్కుకుపోయారు. యుద్ధానికి దూరంగా ఉంచుతామనే హామీతో రష్యా వెళ్లిన వారంతా అక్కడి సైన్యంలో చేరి ఉక్రెయిన్ సరిహద్దులో బలవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇలా ఇరుక్కుపోయిన భారతీయులు వంద మందికి పైగానే ఉన్నారు. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి ఈ విషయాన్ని మీడియాకు బహిర్గతం చేశారు. సైనిక భద్రతా సహాయకులు(ఆర్మీ సెక్యూరిటీ హెల్పర్)గా వీళ్లను తీసుకున్నామని, దాదాపు ఏడాదిన్నరగా ఈ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌తోపాటు పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్థాన్ తదితర దేశాలకు చెందిన యువతను నియమించుకున్నామని పేర్కొన్నారు. వీళ్లంతా ఓ ఏడాది పాటు కచ్చితంగా ఉద్యోగంలో ఉండేలా ఒప్పందం చేసుకుని పనిలో చేరారు. ఇలా రష్యాలో చిక్కుకుపోయిన ఇద్దరు తెలంగాణ వాసులు సహా 12 మంది భారతీయులను స్వదేశానికి రప్పించాలని అసదుద్దీన్ ఒవైసీ కేంద్రానికి జనవరి 25న ఓ లేఖ రాశారు.

నేటి నుంచి కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొద్దిరోజుల నుంచి ఎండ తీవ్రంగా ఉండడం, ఇదే సమయంలో బంగాళాఖాతంలో గల అధిక పీడనం కారణంగా తేమగాలులు కోస్తాపైకి వీస్తుండడంతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. ఈ రెండింటి ప్రభావంతో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కోస్తాలో, ఈనెల 24వ తేదీ నుంచి మూడు రోజులపాటు రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

తగిన ఆధారాల్లేవ్!

అమెరికాలో కందుల జాహ్నవి యాక్సిడెంట్ కేసులో నిందితుడైన అధికారికి విముక్తి



జాహ్నవి (ఫైల్)

వాషింగ్టన్, ఫిబ్రవరి 22: భారతీయ విద్యార్థిని జాహ్నవి కందుల(23) మరణానికి కారణమైన సియాటెల్ పోలీసు అధికారి కెవిన్ దేవ్ నేర అభియోగాలను ఎదుర్కోబోరని అధికారులు వెల్లడించారు. తగిన ఆధారాలు లేకపోవడమే కారణంగా పేర్కొన్నారు. 'జాహ్నవి మరణం హృదయ విదారకంగా ఉంది. కింగ్ కౌంటీతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులను ఆ ఘటన ప్రభావితం చేసింది' అని కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ అటార్నీ లీసా మానియన్ బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నారు. అయితే, ఈ కేసులో సహేతుకమైన సందేహానికి మించి క్రిమినల్ కేసుగా నిరూపించదగిన ఆధారాలు లేవన్నారు. గతేడాది జనవరి 23న సియాటెల్‌లో రోడ్డు దాటుతున్న జాహ్నవిని కెవిన్ దేవ్ నడుపుతున్న పోలీసు గస్తీ వాహనం గంటకు 119 కిలోమీటర్ల వేగంతో ఢీకొంది. దీంతో జాహ్నవి 100 అడుగుల దూరం ఎగిరిపడి అక్కడికక్కడే మరణించారు.

అది కొవిడ్ వ్యాక్సిన్ల ఫలితమే!

(మొదటి పేజీ తరువాయి)

పెరుగుతున్నాయనే వార్తలు కలవరపెట్టాయి! వాటికి బలం చేకూర్చేలా ఈ మధ్యకాలంలో పెరుగుతున్న గుండె, మెదడు, రక్త సంబంధిత వ్యాధులకు కరోనా వ్యాక్సిన్లే కారణమని తాజా అధ్యయనం గుర్తించింది. వివిధ దేశాల్లో కరోనా వ్యాక్సిన్ తీసుకున్న వారిలో గుండె సమస్యలు, మెదడు, రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వంటి దుష్ప్రభావాలు కనిపిస్తున్నాయని ఈ అధ్యయనం పేర్కొంది. ఆ వివరాలను వ్యాక్సిన్ అనే సైన్స్ జర్నల్‌లో నివేదించారు.

ఎనిమిది దేశాల్లో పరిశోధనలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పరిశోధనా విభాగమైన గ్లోబల్ వ్యాక్సిన్ డేటా నెట్‌వర్క్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ క్రమంలో కొవిడ్-19 వ్యాక్సిన్లు 13 రకాల ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేశాయని వారు వెల్లడించారు. భారత్ మినహా... అర్జెంటీనా, ఆస్ట్రేలియా, కెనడా, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, స్కాట్లాండ్ వంటి దేశాల్లో కరోనా వ్యాక్సిన్ తీసుకున్న 9.9 కోట్ల మందిపై వారు అధ్యయనం నిర్వహించారు. ఈ క్రమంలో కొన్ని రకాల ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లు తీసుకున్న వారిలో గుండె కండరాల వాపునకు కారణమయ్యే మయోకార్డిటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని గుర్తించారు. దీనితోపాటు గులియన్ బారె సిండ్రోమ్, పెర్కిర్డిటిస్, సెరిబ్రల్ వీనస్ సైనస్ థ్రాంబోసిస్ వంటి కేసులు 1.5 రెట్లు పెరిగాయని పేర్కొన్నారు.



మోడెర్నా, ఫైజర్, ఆస్ట్రాజెనెకా తీసుకున్నవారిలో..

ఫైజర్-బయోఎన్‌టెక్, మోడెర్నాకు చెందిన ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల మొదటి మూడు దశల మోతాదులు తీసుకున్న వారిలో మయోకార్డిటిస్ కేసులను ఎక్కువగా గుర్తించారు. మోడెర్నా రెండో డోసు తీసుకున్న తర్వాత ఈ కేసులు అధికంగా పెరిగాయని పేర్కొన్నారు. అలాగే ఆస్ట్రాజెనెకా టీకాలు మూడు డోసులు తీసుకున్న వారిలో పెరికార్డిటిస్ అనే గుండెజబ్బులు వచ్చే ప్రమాదం 6.9 శాతం పెరిగిందని చెప్పారు. మోడెర్నా టీకాల నాలుగో డోసు తీసుకున్న వారిలో ఈ ప్రమాదం 2.6% పెరిగినట్టు గుర్తించారు. ఆస్ట్రాజెనెకా టీకాలు తీసుకున్నవారిలో రక్తం గడ్డకట్టే వ్యాధిబారిన పడే ప్రమాదం 3.2 రెట్లు ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అలాగే రోగనిరోధక వ్యవస్థ, నరాలపై దాడి చేసే గులియన్ బారె సిండ్రోమ్‌ను కూడా గుర్తించినట్టు చెప్పారు.

కొవిడ్ టీకాతో ప్రయోజనాలే అధికం

కొవిడ్-19 టీకాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాల కంటే ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని పరిశోధకులు స్పష్టం చేశారు. కాబట్టి కొవిడ్ వ్యాక్సిన్ తీసుకోవడం ఇప్పటికీ సురక్షితమైన మార్గమని వారు వెల్లడించారు. కాగా, కొవిడ్-19 సోకిన ఏడాదిలోనే చాలామంది కోలుకోగా.. మరికొందరికి ఊపిరితిత్తులు శాశ్వతంగా దెబ్బతిన్నాయని తాజా అధ్యయనంలో గుర్తించినట్టు పరిశోధకులు తెలిపారు.

అరాచక మంత్రి అవసరమా?

» జయరాంను ఎలా చేర్చుకుంటారు?

» టీడీపీలో చేరతారన్న ప్రచారంపై ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి

(కర్నూలు/అమరావతి-ఆంధ్రజ్యోతి)

కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం టీడీపీలో చేరబోతున్నారా..? ఆయన చేరికకు ఆ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా..? టీడీపీ కండువా వేసుకుంటే అనంతపురం జిల్లా గుంతకల్ నుంచి పోటీ చేస్తారా..? కర్నూలు జిల్లాలో ఏ ఇద్దరు కలిసినా ఇదే ప్రధాన చర్చ. అయితే ఆయన చేరికను స్థానిక టీడీపీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. నియోజకవర్గంలో ఆయన, ఆయన సోదరులు సాగిస్తున్న అరాచకాలే దీనికి కారణం. జయరాం కర్నూలు జిల్లా ఆలూరు నుంచి 2014, 19 ఎన్నికల్లో వైసీపీ తరఫున వరుసగా గెలుపొందారు. జగన్ మంత్రివర్గంలో మంత్రి పదవి దక్కించుకున్నారు. అయితే.. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తీవ్ర అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆయన సోదరులు ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, వైసీపీ సీనియర్ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి.. అన్న పదవిని అడ్డం పెట్టుకుని నియోజకవర్గంలో చెలరేగిపోయారు. షాడో మంత్రులుగా పెత్తనం చెలాయించడమే కాకుండా అవినీతి అక్రమాలకు రెడ్ కార్పెట్ వేశారనే విమర్శలు బలంగా ఉన్నాయి. వారి అరాచకాల కారణంగా జయరాంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఆయనకు మళ్లీ టికెట్ ఇస్తే గెలవలేరని ఐప్యాక్ సర్వేలు, నిఘా నివేదికలు చెప్పాయంటూ జగన్ కూడా టికెట్ ఇవ్వలేనని చెప్పారు. అయితే కర్నూలు ఎంపీగా పోటీ చేయాలని సూచించారు. ఆలూరు వైసీపీ ఇన్‌చార్జి (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి)గా చిప్పగిరి జడ్పీటీసీ బి.విరూపాక్షిని ఎంపిక చేశారు. ఇది జీర్ణించుకోలేని జయరాం వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీ అధిష్ఠానం కూడా సానుకూలంగా ఉందని, అనంతపురం జిల్లా గుంతకల్ టికెట్ ఇచ్చేందుకు అంగీకరించిందనే ప్రచారం సాగుతోంది.

మంత్రి అక్రమాలపై లోకేశ్ సవాల్

యువగళం పాదయాత్రలో భాగంగా గత ఏడాది ఏప్రిల్ 18న ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలం వలకొండ క్రాస్ వద్ద జరిగిన బహిరంగ సభలో మంత్రి జయరాం, ఆయన సోదరులపై నారా లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. బెంజ్ మంత్రి జయరాం సోదరులు భూ కబ్జాలు, భూ సెటిల్‌మెంట్లతో మునిగి తేలుతున్నారని.. కర్ణాటక నుంచి రోజూ లారీ అక్రమ మద్యం తెస్తున్నారని.. అదే లారీలలో పేదల బియ్యం తరలిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తిని టీడీపీలో ఎలా చేర్చుకుంటారని నియోజకవర్గ నాయకులు మండిపడుతున్నారు.

పోలీసులు.. జర్నలిస్టులపై దాడులు

జయరాం స్వగ్రామం గుమ్మనూరులో పెద్దఎత్తున అంతర్రాష్ట్ర పేకాట జూదం క్లబ్ నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో 2020 ఆగస్టు 27న నాటి సెబ్ అదనపు ఎస్పీ గౌతమిశాలి నేతృత్వంలో స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు (మంత్రి సోదరుడే ఈ క్లబ్ నిర్వహిస్తున్నాడనే ఆరోపణలు బలంగా ఉన్నాయి). వారిపై జయరాం సోదరుడు, ఆయన అనుచరులు దాడిచేశారు. అలాగే.. నియోజకవర్గంలో అక్రమ మద్యం, మట్కా రోజుగా సాగుతోందని వార్త రాసిన విలేకరి చంద్రపైనా దాడులకు దిగారు. గత డిసెంబరు 21న సీఎం జగన్ పుట్టిన రోజున విరూపాక్షి పెట్టిన జగన్ ఫ్లెక్సీలను జయరాం అనుచరులు చించివేస్తుండగా ఫొటోలు తీస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఆస్పరి విలేకరి శివకేశవ్‌పై మంత్రి అనుచరులు, వైసీపీ మూకలు దాడికి దిగారు. వైసీపీ జెండా కర్రలు, రాళ్లతో ఇష్టానుసారంగా కొట్టారు. ఈ దాడిలో శివకేశవ్ మోకాలు విరిగింది.. చెవి వినికిడి కోల్పోయారు. ఈ రోజుకు కూడా మంచానికే పరిమితమయ్యారు.

25 తర్వాత చేరతారని ప్రచారం?

టీడీపీ అధిష్ఠానంతో జయరాం చర్చలు పూర్తయ్యాయని, ఈ నెల 25వ తేదీ తర్వాత ఎప్పుడైనా వైసీపీని వీడి ఆ పార్టీలో చేరవచ్చని జోరుగా ప్రచారం సాగుతోంది. ఆయన ఆలూరు టికెట్ ఆశిస్తుండగా.. ఆ నియోజకవర్గానికి పక్కనే ఉన్న అనంతపురం జిల్లా గుంతకల్ టికెట్‌ను ఆయనకు లేదంటే ఆయన కుమారుడు ఈశ్వర్‌కు ఇచ్చేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారని జయరాం అనుచరులు, సోదరులు ప్రచారం చేసుకుంటున్నారు. అంతే కాదు.. గుంతకల్ నియోజకవర్గంలోని పామిడిలో మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ బుధవారం స్థానిక టీడీపీ యువతతో కలసి ఫొటోలు దిగారు. టీడీపీ స్థానిక నేతలు, శ్రేణులు మాత్రం జయరాం చేరికను స్వాగతించడం లేదు.

గంజాయి కేసులో బిగ్‌బాస్ ఫేమ్ షణ్ముఖ్ అరెస్టు

అత్యాచారం కేసులో సోదరుడు సంపత్ మోసం




హైదరాబాద్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అన్న కోసం వెళితే.. గంజాయి కేసులో తమ్ముడు చిక్కాడు. బిగ్‌బాస్ ఫేమ్ షణ్ముఖ్‌ను పోలీసులు గంజాయి కేసులో అరెస్టు చేశారు. షణ్ముఖ్ అన్న సంపత్ వినయ్ ఓ కంపెనీకి కో ఫౌండర్‌గా ఉన్నాడు. ఇతడు తరచూ ఫ్రెండ్స్‌తో కలిసి లాంగ్ ట్రిప్‌లు వేస్తుంటాడు. మోడలింగ్‌లో కూడా టచ్ ఉంది. సీరియల్, సినిమా మోజులో యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్‌తో విశాఖకు చెందిన వైద్యురాలు హారిక (పేరు మార్చాం) పరిచయమైంది అతని ద్వారా అతని సోదరుడు సంపత్ వినయ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వావత సంపత్ ఆమెపై మనసు పడ్డాడని.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి... మభ్యపెట్టిన షణ్ముఖ్ వైద్యురాలిని తన సోదరుడి వద్దకు చేర్చాడు. అంతా అతనే (షణ్ముఖ్ సోదరుడు సంపత్) అని నమ్మిన ఆ యువతి అతను చెప్పినట్లు ఫ్రెండ్‌షిప్ మాత్రమే కాకుండా 8ఏళ్లకు పైగా రిలేషన్ షిప్ కొనసాగించింది. రేపు మాపు అంటూ పెళ్లి చేసుకోకుండానే ఆమెను హోటల్ గదులకు తీసుకెళ్లడం... లాంగ్ ట్రిప్పుల పేరిట ఆమెతో గడపడం... నగరంలో పలు చోట్ల ఇళ్లు మారుస్తూ ఆమెతో రిలేషన్‌షిప్ సాగించాడు. ఆ యువతి గర్భం దాల్చినప్పుడల్లా మాత్రలు మింగి అబార్షన్ చేసుకునేలా ఒత్తిడి తీసుకొచ్చినా భరించింది. రెండు సార్లు పెళ్లి తేదీలు ఖరారు చేసి వాయిదా వేసినా ఓర్పుతో వేచి చూసింది. ఆమెను మాయమాటల్లోనే ఉంచిన సంపత్ ఆమె విశాఖలో ఉండగానే జనవరి 27మరో యువతితో పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం ఈ నెల 21న తెలుసుకున్న బాధితురాలు ఆగమేఘాల మీద విశాఖ నుంచి నగరానికి విమానంలో వచ్చి అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి... తనకు న్యాయం చేయాలని వేడుకుంది. పోలీసులు తీసుకున్న చర్యల్లో భాగంగా రేప్ కేసులో సంపత్‌ను రిమాండ్‌కు తరలించగా.. గంజాయి కేసులో షణ్ముఖ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసులో సంపత్ ఇంటిలో సోదాలు చేయగా అక్కడ 18 గ్రాముల గంజాయి దొరికింది. దాంతో పోలీసులు సోదరులిద్దరినీ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ తెలిపారు. షణ్ముఖ్‌పై కూడా ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విజయభేరి


డైరెక్టర్ మట్టుపల్లి మోహన్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 22: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో జాతీయ స్థాయిలో బోయినపల్లి ప్రీతమ్‌రెడ్డి 5వ ర్యాంకు. సిల్లా రాజేష్, కర్రి చంద్రికరేవతి, బోయిన ఏసురాజు 7వ ర్యాంకు, బంగారు లక్ష్మీ ప్రసన్న 8వ ర్యాంకు, ఉల్లా తనూజ్ 9, మోతుకూరి బాలాజీ 10 ర్యాంకుతోపాటు మరో 43 మంది 50 లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. అదేవిధంగా సీఎంఏ ఫైనల్‌లో జాతీయ స్థాయిలో 2వ ర్యాంకుతో పాటు మరో 34 మంది 50లోపు ర్యాంకులు సాధించారన్నారు. సీఎంఏ ఇంటర్, ఫైనల్‌లో 50లోపు 83 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు.

దేశాభివృద్ధిలో ఐఐటీలు కీలకం: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్


సజ్జన్ జిందాల్, కేఎస్ సత్యనారాయణ చేతుల మీదుగా ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్ అందుకుంటున్న సామిత్రో వ్యాపారి

తిరుపతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలిచేందుకు ఐఐటీ వంటి ఉన్నత విద్యా సంస్థలు కీలకంగా వ్యవహరించి, తోడ్పాటునందించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆకాంక్షించారు. తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో గురువారం 4, 5వ స్నాతకోత్సవాల్లో ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ రాబోయే ఏళ్ల కోసం యువతను సన్నద్ధం చేయడానికి ఐఐటీ వంటి ఉన్నత విద్యా సంస్థలు స్పష్టమైన లక్ష్యాలతో రోడ్ మ్యాప్‌తో సిద్ధం కావాల్సి ఉందన్నారు. కాగా, 575మంది విద్యార్థులకు ఐఐటీల బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్.. పట్టాలు అందజేశారు.

సాగర్ డ్యాం పనులను పరిశీలించిన కేఆర్ఎంబీ బృందం


నాగార్జున సాగర్ డ్యాంపై కేఆర్ఎంబీ బృందం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 22: నాగార్జున సాగర్ డ్యాంను గురువారం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) బృందం సందర్శించింది. సాగర్ డ్యాంపై బీటీ రోడ్డు వేయడంతో పాటు సీజనల్‌గా డ్యాం మేయింటెనెన్స్, రేడియల్ క్రస్ట్‌గేట్లకు రబ్బర్ సీల్స్, గ్యాలరీలలో సీపేజ్ నీరు లేకుండా మరమ్మతులు, స్టార్టప్‌లలో ప్యానల్ బోర్డులు, మోటార్ల మరమ్మతులు నిర్వహించాల్సి ఉంది. ఈ నెల 16న తెలంగాణ ఇంజనీర్లు పనులు ప్రారంభించారు. అయితే ఆంధ్ర వైపున్న సీఆర్‌పీఎఫ్ దళాలు ఈ పనులపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. వారి మాటలను తెలంగాణ అధికారులు బేఖాతరు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి లేఖ రాసింది. దీంతో స్పందించిన కేఆర్ఎంబీ బృందం గురువారం సాగర్ డ్యాంను సందర్శించింది. పనులు ఆపవద్దని సూచించారు. శుక్రవారం కూడా డ్యాంతోపాటు కుడి, ఎడమ కాలువల హెడ్ రెగ్యులేటర్‌ను సందర్శించనున్నట్లు సమాచారం.

టీడీపీ కార్యకర్తలు నా బిడ్డలు

- వారు కష్టాల్లో ఉంటే ఎంత దూరమైనా వెళ్తా
- వైసీపీ నేతలకు మహిళలంటే గౌరవం లేదు
- ఏపీకి పూర్వవైభవం తెచ్చేది చంద్రబాబే: నారా భువనేశ్వరి
- 'చిత్తూరు'లో ఐదు కుటుంబాలకు పరామర్శ


కమ్మపల్లిలో వెంకటపతి నాయుడు కుటుంబసభ్యులను పరామర్శించి చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి

చిత్తూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ కార్యకర్తలు నా బిడ్డలు. వారు కష్టాల్లో ఉంటే ఎంత దూరమైనా వెళ్తా. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో మనస్తాపంతో గురైన కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాలని నా భర్త నన్ను కోరారు. వెంటనే నా బిడ్డల కుటుంబాలకు వెళ్లాలని నిశ్చయించుకున్నా. పార్టీ బిడ్డలు ముందు, వెనుక ఉండి నన్ను నడిపిస్తున్నారు. ఇక నాకు భయమేంటీ?' అని నారా భువనేశ్వరి అన్నారు. చిత్తూరు జిల్లాలో మూడో రోజు గురువారం 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు మనస్తాపంతో మృతిచెందిన ఐదుగురి కుటుంబాలను ఆమె పరామర్శించారు. ఆయా చోట్ల కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. చంద్రబాబు పాలనలో అన్నపూర్ణాంధ్రప్రదేశ్‌గా వెలుగొందిన రాష్ట్రం.. వైసీపీ పాలనలో అరాచకాంధ్రప్రదేశ్‌గా మారిందని ఆరోపించారు. 'వైసీపీ పాలనలో మహిళల మాన, ప్రాణాలకు రక్షణ కరువైంది. గంజాయి, మత్తు పదార్థాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఏపీకి పూర్వ వైభవం తీసుకురావాలంటే ఆ సామర్థ్యం చంద్రబాబుకు మాత్రమే ఉంది. భావితరాలు బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా వచ్చే ఎన్నికల్లో పోరాడి గెలవాలి' అని ఆమె పిలుపునిచ్చారు. చంద్రబాబు అరెస్టు సమయంలో దీక్షలు చేసిన మహిళల్ని పోలీసులు అరెస్టు చేసి రాత్రిళ్లు స్టేషన్లలో ఉంచారని ఆవేదన చెందారు. 'రాజధాని రైతుల పోరాటంలో పాల్గొన్న మహిళలపై వైసీపీ ప్రభుత్వం పోలీసులతో దాడి చేయించింది. ఈ దాడుల్లో ఓ మహిళ గర్భంలోని శిశువు మృతిచెందింది. ఇన్ని దాడులు చేసినా 1,500 రోజులకు పైగా అమరావతి మహిళా రైతులు పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు' అంటూ అభినందించారు. పులిచెర్ల మండలం కమ్మపల్లెలో వెంకటపతి నాయుడు, పడగలవారిపల్లెలో దొరస్వామి, ఐరాల మండలం చింతగుంపాలపల్లెలో జయప్రకాశ్, బంగారుపాళ్యం మండలం టేకుమందలో వరిగంటి గోవిందయ్య, చిత్తూరు 50వ వార్డు కోకలూరులో సుజాతమ్మ కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. వారికి ధైర్యం చెబుతూ, ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. పాకాల, పూతలపట్టు, చిత్తూరు ప్రాంతాల్లో నాయకులు, అభిమానులు ఆమెకు గజమాలలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. శుక్రవారం ఎస్ఆర్‌పురం, నారాయణవనం మండలాల్లో బాధిత కుటుంబాల పరామర్శతో భువనేశ్వరి నాలుగు రోజుల జిల్లా పర్యటన పూర్తవుతుంది. కాగా, బంగారుపాళ్యం మండలం టేకుమందలో వైసీపీ సానుభూతిపరుల ఇళ్లలోని మహిళల దాడిలో కంటి చూపు కోల్పోయిన హంసవేణిని భువనేశ్వరి పరామర్శించి ధైర్యం చెప్పారు.

గుర్తింపు కోసమే రమణదీక్షితుల ఆరోపణలు

- శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు


మీడియా సమావేశంలో వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు

తిరుమల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): టీటీడీపై, అధికారులపై రమణ దీక్షితులు చేసిన వ్యాఖ్యలను అర్చకులమందరం ఖండిస్తున్నామని, శ్రీవారి ఆలయంలో క్రమం తప్పకుండా అన్ని కైంకర్యాలు ఆగమోక్తంగానే జరుగుతున్నాయని తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు స్పష్టం చేశారు. టీటీడీ పరిపాలన అంశాలపై, అధికారులపై రమణదీక్షితులు మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈక్రమంలో తిరుమలలోని అర్చక నిలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు గురువారం మీడియాతో మాట్లాడారు. శ్రీవారి ఆలయంలోకి స్తంభాలు తీసుకువచ్చారని, తవ్వకాలు జరిగాయంటూ రమణదీక్షితులు చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు. ఆగమ సలహాదారులు, ప్రధాన అర్చకుల సూచనల మేరకు ఆలయంలో కైంకర్యాలన్నీ యథావిధిగా జరుగుతున్నాయన్నారు. రమణదీక్షితులు ఆగమ సలహా మండలి సభ్యుడిగా, ప్రధాన అర్చకుడిగా ఉన్న సమయంలోనే ఆలయంలోని తిరుమలరాయమండపం, రంగమండపం ప్రాంతాల్లో కుంగిపోయిన పైకప్పును, బలహీనపడిన స్తంభాలను పటిష్టపరిచారన్నారు. రమణదీక్షితులును సీఎం జగన్ గౌరవ ప్రధాన అర్చకుడిగా నియమించినప్పటికీ నాలుగేళ్లుగా దేవాలయానికి రాకుండా ప్రతి నెలా రూ.80 వేల జీతాన్ని తీసుకుంటున్నారన్నారు. రమణదీక్షితులతో పాటు ఆయన కుమారుడు కూడా ఆలయానికి రావడం లేదని తెలిపారు. ఏడాదిలో రెండు మూడు సార్లు వచ్చి రెన్యువల్ చేసుకుని స్వామి కైంకర్యాల్లో పాల్గొనకుండా బయట తిరుగుతున్నారన్నారు. వ్యక్తిగత కారణాలతో రెండో కుమారుడు కూడా అర్చకత్వాన్ని విడిచిపెట్టారన్నారు. రమణదీక్షితులు గతంలో కూడా టీటీడీపై పింక్ డైమండ్ అని, గుప్త నిధుల కోసం తవ్వకాలని ఆరోపణలు చేశారన్నారు. గుర్తింపు కోసం, ఇతర ప్రయోజనాల కోసమే ఇలాంటి అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. శ్రీవారి కైంకర్యాల విషయంలో టీటీడీ ఛైర్మన్, ఈవో, ఆలయ సిబ్బంది ఎట్టిపరిస్థితుల్లో జోక్యం చేసుకోరని స్పష్టం చేశారు. ఆలయ వ్యవస్థపై, అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసిన రమణదీక్షితులే కొద్ది సేపటికే వీడియోలో ఉన్నది తన వాయిస్ కాందటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్‌లో పాతకథే!

పాకిస్థాన్‌లో వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. ప్రభుత్వ ఏర్పాటు విషయంలో భుట్టోలూ, షరీఫ్‌ల మధ్య అవగాహన కుదిరిందని వారం క్రితమే వార్తలు వచ్చినా ఏ కారణంగానో ఇప్పటి వరకూ అది ఒక నిర్దిష్టరూపాన్ని సంతరించుకోలేదు. పాకిస్థాన్ ముస్లిం లీగ్–పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ మధ్య ఇప్పుడు కుదిరిన ఒప్పందం ప్రకారం రెండు పార్టీలూ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాయి. అంటే, ఎన్నికలకు ముందు, ఏడునెలల క్రితం వరకూ షాబాజ్ షరీఫ్ ప్రధానిగా అధికారంలో ఉన్న కూటమే తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది. బెనజీర్ భుట్టో భర్త ఆసిఫ్ అలీ జర్దారీని ఈ రెండుపార్టీలూ దేశాధ్యక్షపదవికి ప్రతిపాదిస్తాయి. షరీఫ్ పార్టీకి చెందిన వ్యక్తి స్పీకర్ అవుతారు, సెనేట్ చైర్మన్, రెండు ప్రావిన్సుల గవర్నర్ల పదవులు భుట్టోలకు దక్కుతాయి. బలూచిస్థాన్‌లో రెండు పార్టీలూ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. సుదీర్ఘజాప్యం తరువాత ఈ తరహా ఇచ్చిపుచ్చుకోవడాలన్నింటినీ చక్కగా తేల్చుకున్నప్పటికీ, ప్రభుత్వంలో పీపీపీ చేరదు, మంత్రిపదవులు స్వీకరించదు, షరీఫ్‌లకు భుట్టోల మద్దతు ఏకపక్షం కాదు. ఈ అంశాలవారీ మద్దతుకు జడిసే, ఎన్నికల తరువాత ప్రధాని అవుదామనుకున్న నవాజ్ షరీఫ్ వెనక్కుపోయి, సోదరుడిని తిరిగి ముందుకు నెట్టినట్టు ఉంది.

ఇమ్రాన్‌ఖాన్ పార్టీ ఇప్పుడు పార్లమెంటు దిగువసభలో ఓ కొత్త అవతారంలో విపక్షంలో కూచోబోతున్నది. పీటీఐ మద్దతుతో గెలిచిన స్వతంత్ర అభ్యర్థులంతా 'సున్నీ ఇత్తేహాద్ కౌన్సిల్‌'లో చేరుతున్నట్టుగా ఎన్నికల సంఘానికి బుధవారం అఫిడవిట్లు ఇచ్చారు. 94 స్థానాలు గెలుచుకున్నామని ఇమ్రాన్ పార్టీ చేస్తున్న వాదనకు అనుగుణంగా ఇప్పుడు ఓ నలుగురు మినహా 89మంది స్వతంత్రులు ఈ అఫిడవిట్లు సమర్పించడం విశేషం. తద్వారా అత్యధిక స్థానాలున్న ఇమ్రాన్ పార్టీ మారువేషంలో విపక్షనేత హోదాను సైతం అందుకోబోతోంది. గతంలో విపక్షమన్నదే లేకుండా దేశాన్ని ఏలిన భుట్టోలు, షరీఫ్‌లకు ఇప్పుడు అసలు పరీక్ష ఎదురవుతోంది.

పార్లమెంటులో బలాబలాలను అటుంచితే, ఇమ్రాన్ పార్టీ వాదిస్తున్నట్టుగా ఈ కొత్త ప్రభుత్వం ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా అడ్డ తోవలో అధికారంలోకి వచ్చిందన్న భావన ప్రజలకు సైతం ఉండకపోదు. ఈ రెండుపార్టీలూ కలసికట్టుగా ఇమ్రాన్‌ను పదవీచ్యుతుడిని చేసి, సైన్యం ఆశీస్సులతో, సమస్త వ్యవస్థల సహకారంతో ఆయన పార్టీని ఎన్నికల్లో పోటీచేయనివ్వకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. ఎంతో కాలంగా జైల్లో ఉన్న ఇమ్రాన్‌మీద ఎన్నికలకు కొద్దిరోజుల ముందు కూడా మూడు కీలకమైన తీర్పులు వెలువడి తీవ్రమైన శిక్షలు పడ్డాయి. ఆ కేసుల్లో న్యాయాన్యాయాల కంటే సైన్యం ఇమ్రాన్ మీద కక్షకట్టిందన్న భావనే ప్రజలమీద ఎక్కువగా పనిచేసిందని ఫలితాలు చెబుతున్నాయి. పార్టీ దెబ్బతిన్నా, ప్రధానమీడియా సహకారం లేకున్నా, సామాజిక మాధ్యమాల ద్వారా పీటీఐ ప్రజలకు చేరువకాగలిగింది. నవాజ్ షరీఫ్ వెనక్కురాగానే ఆయనమీద కేసులన్నీ తొలగిపోయి, వీరోచితంగా బరిలోకి దిగినప్పటికీ సైన్యం ఆశించిన రీతిలో ఫలితాలు లేవు. స్వయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగల సత్తా ఏ ఒక్కపార్టీకీ దక్కని త్రిశంకుసభ ఏర్పడితే, ఎంత వేటాడివేధించినా ఈ ఎన్నికల్లో పీటీఐదే అగ్రస్థానం. పార్లమెంటులో గుర్తింపు ఉన్న ఒక చిన్న పార్టీలో తన స్వతంత్రులనంతా చేర్చిన ఇమ్రాన్ తిరిగి సైన్యం మీదా, ప్రభుత్వం మీదా యుద్ధాన్ని కొనసాగించబోతున్నారు.

భవిష్యత్తు అర్థమై, నిత్యం బతుకుపోరాటం తప్పదని తెలిసిన నవాజ్ షరీఫ్ తాను తప్పుకొని, సైన్యానికి వీరవిధేయుడిగా ముద్ర పడిన సోదరుడినే తిరిగి ప్రధానమంత్రి పదవిలో కూచోబెట్టారు. ఇమ్రాన్–సైన్యం యుద్ధం మరింత బలంగా సాగుతూంటే, ముప్పై ఐదుశాతం ద్రవ్యోల్బణంతో, ఆహార కొరతతో, భారీ అప్పులతో సతమతమవుతున్న పాకిస్థాన్‌ను గాడినపెట్టడం అయ్యేపనికాదని ఆయనకు అర్థమైవుంటుంది. భారీ అప్పు ఇస్తూ ఐఎంఎఫ్ విధించిన ఆంక్షలను అమలుచేయాలంటే, ప్రభుత్వ విమానయానసంస్థ సహా చాలా ప్రభుత్వ సంస్థలను అమ్మివేయాలి, ప్రభుత్వ వ్యయాన్ని బాగా తగ్గించుకొని, ప్రజలమీద భారీగా పన్నులు వేయాలి. షాబాజ్ షరీఫ్ ఈ చర్యలకు ఉపక్రమించకతప్పదు, రాజకీయమనుగడకోసం భుట్టోలు వాటిని అడ్డుకోకాతప్పదు. ప్రభుత్వంలో చేరకుండా బిలావల్ భుట్టో జర్దారీ తెలివిగానే జాగ్రత్తపడ్డాడు. పాకిస్థాన్‌ను రక్షించడానికే మళ్ళీ ప్రధాని అవుతున్నానంటున్న షాబాజ్ షరీఫ్ ఆ మాటమీద ఎంతకాలం నిలబడతాడో చూడాలి.

బీచ్ శాండ్ మైనింగ్... అదానీకి గేట్లు బార్లా!

రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల సముద్రతీరంలోని అత్యంత విలువైన బీచ్ శాండ్ మైనింగ్‌ను కార్పొరేట్ దిగ్గజం అదానీ సంస్థలకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నించడం దారుణం. టైటానియమ్ డై ఆక్సైడ్, ఇల్మినైట్, రూటైల్, గార్నెట్, సిలిమనైట్, ల్యూకోజిన్ వంటి అరుదైన మూలకాలు బీచ్ శాండ్‌లో ఉంటాయి. పెయింట్లు, రంగుల పరిశ్రమలో ఉపయోగించే టైటానియం డయాక్సైడ్ వీటిలో చాలా ముఖ్యమైనది. ఇవి అణుధార్మిక స్వభావాన్ని కలిగివుండేవి, దేశ భద్రతకు కూడా కీలకమైనవి. ఆ కారణంగానే ఆఫ్‌షోర్ మినరల్ మైనింగ్‌లో ప్రైవేటు రంగాన్ని నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం 2019 ఫిబ్రవరిలో చట్ట సవరణ చేసింది. కాని, అదే మోదీ సర్కారు నాలుగేళ్ల తిరగ్గానే యూ టర్న్ తీసుకుని మైనింగ్‌కు ప్రైవేటు రంగాన్ని అనుమతించాలంటూ 2023 మే 25న ముసాయిదా విడుదల చేయడం, చకచకా చట్ట సవరణకు బిల్లు ప్రతిపాదించడం వెనుక బడా కార్పొరేట్ల సేవ తప్ప వేరే ప్రయోజనమేదీ లేదు. ప్రతిపక్ష సభ్యులంతా మణిపూర్ దారుణాలపై చర్చ జరగాలని పట్టుబడుతున్న సమయంలో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టి పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడం కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ సేవా తత్పరతకు నిదర్శనం.

కార్పొరేట్లు అందునా అదానీ ఆదేశాలను కేంద్రం ఎంతలా శిరసావహిస్తోందో అర్థం చేసుకోవడానికి ఈ చట్ట సవరణ తతంగం ఓ మచ్చుతునక. బీచ్ శాండ్ మైనింగ్ కోసం రెండు సంస్థలను (ఒకటి ఏపీలో 'అలువైల్' పేరుతో, మరొకటి ఒడిశాలో 'పూరి నేచురల్ రిసోర్సెస్ లిమిటెడ్' పేరుతో) ఏర్పాటు చేస్తున్నట్లు గత ఏడాది ఏప్రిల్ 14, 27 తేదీల్లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజికి అదానీ గ్రూపు లేఖ రాసిన నెల రోజులకు కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ ముసాయిదా విడుదల చేయడం గమనార్హం. అంతేగాక బీచ్ శాండ్ నిర్వచనాన్ని మార్చడం ద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ ఖనిజాలను 'అణు మూలకాల' జాబితా నుంచి తొలగించడానికి కసరత్తు చేస్తోంది. ఆఫ్‌షోర్ మైనింగ్ పరిధిలోకి 12 రకాల ఖనిజాలను తీసుకురావడంతో పాటు గతంలో ఉన్న నాలుగేళ్ల గడువును 50 సంవత్సరాలకు పెంచి లీజుకు ఇవ్వడానికి కేంద్రం ప్రతిపాదించడం కార్పొరేట్లకు సాష్టాంగపడడమే!



బీచ్‌శాండ్ మైనింగ్ వల్ల సముద్ర పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. ఈ కారణంగానే బీచ్‌శాండ్ మైనింగ్ ఇంతకాలం ప్రభుత్వ అధీనంలోనే కొనసాగింది. ఇప్పుడు చట్టాలను మార్చి అదానీ చేతుల్లో పెట్టబోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలను జనం ప్రతిఘటించాలి.

మైన్స్ అండ్ మినరల్స్ చట్టం ఖనిజాలను ఎ–బి–సి అనే మూడు రకాలుగా విభజిస్తోంది. పార్ట్–బిలో ఆటమిక్ మినరల్స్ ఉంటాయి. తాజాగా మోదీ ప్రభుత్వం పార్ట్–బి నుంచి కొన్ని ఖనిజాలతో డి గ్రూపును ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. 'క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్స్' పేరిట ఏర్పాటు చేయనున్న ఈ గ్రూపులో మొత్తం ఎనిమిది ఖనిజాలూ అదానీ గ్రూపు ఆసక్తి చూపినవే కావడం మరో నిదర్శనం. ఆఫ్‌షోర్ మైనింగ్ చట్ట సవరణలు రాష్ట్రాల హక్కులను తీవ్రంగా దెబ్బ తీస్తాయి. దేశ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించే ఇటువంటి బిల్లులను వ్యతిరేకించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. గతంలో మన రాష్ట్రానికి అటువంటి గొప్ప చరిత్ర ఉంది. కాని, వైసీపీ ప్రభుత్వం ఆ బిల్లుకు మద్దతు తెలపడం మన రాష్ట్ర ప్రయోజనాలకు హానికరం.

సాధారణ పారిశ్రామికవేత్తలు కలిస్తేనే రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ వచ్చేస్తోందన్నట్లు ప్రకటనలు జారీ చేసే సీఎం కార్యాలయం... గత సంవత్సరం గౌతమ్ అదానీ ఏపీ ముఖ్యమంత్రితో భేటీ అయిన సంగతి మాట మాత్రంగానైనా వెల్లడించకపోవడంపై అప్పుడే పలు అనుమానాలు వ్యక్తమైనాయి. ఆ భేటీలో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్రంలోని బీచ్ శాండ్ మైన్స్‌లో 'ప్రాజెక్టు డెవలపర్ కమ్ ఆపరేటర్' పేరిట 92 శాతం వాటాను ఆఫర్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల టెండర్లు కూడా పిలిచింది.

ఏపీలో చోటుచేసుకోబోతున్న మరో భారీ దోపిడీకి హైకోర్టు చెక్‌పెట్టింది. ప్రభుత్వ పెద్దలకు అస్మదీయుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి బీచ్‌శాండ్ కాంట్రాక్ట్ ఇవ్వడానికి సంకల్పించిన వ్యూహాన్ని న్యాయస్థానం ప్రస్తుతానికి అడ్డుకుంది. బీచ్‌శాండ్ టెండర్ల ఖరారును నిలిపివేస్తూ హైకోర్టు జనవరి 10న ఉత్తర్వులు ఇచ్చింది. ఏకంగా రూ.లక్ష కోట్లకు పైగా విలువైన బీచ్‌శాండ్ మినరల్స్ తవ్వకం పనులను అదానీకి దొడ్డిదారిన కట్టబెట్టే జగన్ ప్రభుత్వ పథకం బట్టబయలైంది.

ఇప్పటికే రాష్ట్రంలోని కృష్ణపట్నం, గంగవరం పోర్టులు అదానీ పరమైనాయి. విశాఖ నగరంలో విలువైన స్థలాలను ఐటి అభివృద్ధి పేరిట అప్పగించారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ అంటూ రాయలసీమ జిల్లాల్లోను, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను తుంగలో తొక్కి వేల ఎకరాలు కట్టబెడుతున్నారు. బీచ్ శాండ్ మైనింగ్‌తో బంగాళాఖాతం తీరం నుంచి తూర్పు కనుమల వరకు అదానీ సామ్రాజ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గేట్లు బార్లా తెరిచాయి. బీచ్‌శాండ్ మైనింగ్ వల్ల సముద్ర పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. ఈ కారణంగానే బీచ్‌శాండ్ మైనింగ్ ఇంతకాలం ప్రభుత్వ అధీనంలోనే కొనసాగింది. ఇప్పుడు చట్టాలను మార్చి అదానీ చేతుల్లో పెట్టబోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలను జనం ప్రతిఘటించాలి. ప్రజల సంపదను ప్రజలే కాపాడుకోవాలి.


● ముప్పాళ్ళ భార్గవ శ్రీ
సిపిఐ ఎంఎల్ నాయకులు

ఇంటర్ సిటీకి ఏసీ బోగీలెందుకు?

ఈ రోజుల్లో రైల్లో ప్రయాణం చెయ్యాలంటే ముందుగా రిజర్వేషన్ చేసుకుని వెళ్ళాల్సిందే. అప్పటికప్పుడు అనుకొని రైళ్లలో ప్రయాణం చెయ్యటానికి కుదరదు. ఎందుకంటే ప్రతి రైల్లోనూ జనరల్ బోగీలు తక్కువ, రిజర్వేషన్–ఏసీ బోగీలు ఎక్కువ ఉంటున్నాయి. జనాలను మోసపుచ్చేందుకు పేరుకి వందేమాతరం రైలు, వందే భారత్ రైలు... ఎక్కువ రైళ్లు ఏసీ రైళ్ళు. పేద దేశంలో ఏసీ రైళ్ళు అవసరమా? పాసింజర్ రైళ్ళు చాలా తక్కువ. ఉన్నవాటికి కూడా ఏసీ పెట్టెలూ, రిజర్వేషన్ పెట్టెలూ. గూడూరు నుంచి విజయవాడ ఇంటర్ సిటీ రైలు నంబరు 12743. ప్రయాణం 4.30 గంటలు. దీనికి ఏసీ పెట్టెలు అవసరమా! అన్నీ జనరల్ బోగీలు వెయ్యాలి. రెండో మూడో జనరల్ బోగీలు వేస్తారు. అవన్నీ జనంతో కిటకిటలాడుతూ ఉంటాయి. బోగీలో పైన పట్టుకోడానికి హ్యాండిల్స్ ఉండవు. ఊగినపుడు వెళ్ళి పక్కవాళ్ళమీద పడిపోతారు. జనరల్ బోగీలు ఎక్కువ వేసి, సౌకర్యాలు కల్పిస్తే సామాన్య జనానికి ఉపయోగకరంగా ఉంటుంది.

– నార్నె వెంకటసుబ్బయ్య

2024: కాంగ్రెస్‌కు అంతిమ పరీక్ష



కాంగ్రెస్ పునరుజ్జీవన మార్గమేమిటి? 'కొత్త' బీజేపీ వలే మరింత నిరంకుశత్వ పార్టీగా వ్యవహరించడం కాకుండా, 'పాత' కాంగ్రెస్ వలే అందరినీ కలుపుకుని పోవాలి. మరింత సమ్మిళిత పార్టీగా రూపొందడమే కాంగ్రెస్‌కు పాత వైభవాన్ని పునరుద్ధరించగలదు. ఇందుకు కొత్తతరం నాయకుల ప్రతిభాపాటవాలను గుర్తించి తీరాలి. వృద్ధ నాయకులపై ఆధారపడకుండా యువ నేతలను మరింతగా ప్రోత్సహించాలి. ఇటువంటి మార్పుతో సత్ఫలితాలు సమకూరుతాయనడానికి తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వమే ఉదాహరణ.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

న్యూఢిల్లీ అధికార నడవాలలో ఇప్పుడు ఒక ఆసక్తికరమైన పిచ్చాపాటీ జరుగుతోంది. కాంగ్రెస్ మయమవుతున్న (కాంగ్రెస్ –యుక్త్) బీజేపీలోకి, కాంగ్రెస్‌ను విడనాడి వెళ్లనున్న తదుపరి నాయకుడు ఎవరు? నిజంగా ఉత్కంఠభరితమైన ఊహాగానం, అవునా? 2024 లోక్‌సభ ఎన్నికలలో తాము 400కి పైగా సీట్లు గెలుచుకుని తీరతామని బీజేపీ నిశ్చిత స్వరంతో, తిరుగులేని రీతిలో చెబుతుండగా నీరసపడిన కాంగ్రెస్ ఒక మహా ఇబ్బందికరమైన ప్రశ్నను ఎదుర్కొంటున్నది: భారత పురాతన రాజకీయపక్షం రాబోయే సార్వత్రక ఎన్నికలలో కనీసం 50కి పైగా సీట్లనైనా కైవసం చేసుకోగలదా?

2014 లోక్‌సభ ఎన్నికలను గుర్తు చేసుకోండి. కేవలం 44 సీట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి. భారత జాతీయ కాంగ్రెస్ స్వతంత్ర భారత సార్వత్రక ఎన్నికలలో ఇంత తక్కువ సీట్లను మాత్రమే గెలుచుకోవడం అదే మొదటి సారి. మరి 2019 సార్వత్రక ఎన్నికలలోనైనా కాంగ్రెస్ పరిస్థితి మెరుగుపడిందా? ఊహూ! 2014లో కంటే కేవలం 8 సీట్లు మాత్రమే అదనంగా గెలుచుకోగలిగింది. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలతో పొత్తు పెట్టుకుని పోటీ చేయడం వల్లే 2019లో 52 సీట్లను కాంగ్రెస్ గెలుచుకోగలిగింది. 2024 సార్వత్రక ఎన్నికలలో సైతం కేరళ, బహుశా తెలంగాణ మినహా మరే రాష్ట్రంలోనైనా కాంగ్రెస్ గెలుచుకోగల సీట్ల సంఖ్య రెండంకెలలో ఉండటమనేది కనాకష్టమని ఒపీనియన్ పోల్స్ దాదాపుగా అన్నీ ముక్త కంఠంతో ఘోషిస్తున్నాయి. 2014లోనూ, 2019లోనూ కేంద్రంలో బీజేపీ అధికారానికి రావడానికి ఒక బలమైన కారణం 'వాయవ్య భారత' రాష్ట్రాల సంపూర్ణ మద్దతే అని చెప్పి తీరాలి. మరి ఈసారీ భారతదేశ పశ్చిమ తీర ప్రాంతాల నుంచి హిందీ భాషా రాష్ట్రాల దాకా ఎల్లెడలా ఓటర్లు బీజేపీ వైపే ఉన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించినందునే కాంగ్రెస్ ప్రస్థానం మరింత కష్టభరితంగా సాగుతోంది. 2019లో వాయవ్య భారత్‌లోని పది రాష్ట్రాలలోని మొత్తం 243 సీట్లలో కేవలం 6 సీట్లను మాత్రమే కాంగ్రెస్ గెలుచుకోగలిగింది.

ఎన్నికల పోరాటాలలో కాంగ్రెస్ పరాజయాలు 2014లో నరేంద్ర మోదీ ఉత్థానంతోనే ప్రారంభమవలేదు. 1984లో ఇందిర హత్యానంతరం ప్రచండంగా వీచిన కాంగ్రెస్ అనుకూల సానుభూతి పవనాలలో లభించిన చరిత్రాత్మక విజయం తరువాత మరే సార్వత్రక ఎన్నికలలోనూ సాధారణ మెజారిటీ సీట్లను గెలుచుకోవడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమయింది. 1984 అనంతరం నాలుగు దశాబ్దాల కాలంలో 200కి పైగా సీట్లను కాంగ్రెస్ గెలుచుకోవడమనేది కేవలం రెండుసార్లు మాత్రమే సంభవించింది. 1991 సార్వత్రక ఎన్నికలలో మొదటి దశ పోలింగ్ అనంతరం రాజీవ్ గాంధీ దుర్మరణం కారణంగా మారిన రాజకీయ పరిస్థితులలోనూ, ఆ తరువాత 2009లో డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వానికి విస్తృత ప్రజామోదం లభించినప్పుడు మాత్రమే భారత జాతీయ కాంగ్రెస్ 200కి పైగా సీట్లను గెలుచుకోగలిగింది.

లోక్‌సభలో కాంగ్రెస్ సంఖ్యాబలం అంతకంతకూ తగ్గిపోతోంది. అయితే ఈ దుస్థితిని నివారించుకుని తన బలాన్ని మెరుగుపరుచుకొనేందుకు గత దశకంలో కాంగ్రెస్ ఏమి చేసింది? రాజ్యాంగ సంస్థ– ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐతో పాటు న్యాయవ్యవస్థ, మీడియాపై అధికారపక్షం సంపూర్ణ నియంత్రణ సాధించడం వల్లే పరిస్థితులు పూర్తిగా తమకు ప్రతికూలంగా మారాయని, సమ స్థాయిలో పోటీ పడే అవకాశాలు మృగ్యమయ్యాయని కాంగ్రెస్ నాయకులు తరచు ఆక్రోశిస్తున్నారు. ఇందులో నిజం లేదని ఎవరైనా ఎలా అనగలరు? నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగానికి పాల్పడి, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలగొడుతుండడం వల్లే బీజేపీ తన రాజకీయ ప్రత్యర్థులపై అన్ని విధాల ఆధిక్యత సాధించింది.

అయితే బీజేపీకి ప్రత్యామ్నాయంగా తనను తాను పునర్వ్యవస్థీకరించుకోలేని కాంగ్రెస్ అశక్తత ఆ పార్టీ పతనానికి ఏ మేరకు దోహదం చేసింది? రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలు ప్రజలతో పటిష్ఠ, ఆత్మీయ సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో కాంగ్రెస్‌కు విశేషంగా తోడ్పడుతున్నాయనడంలో సందేహం లేదు. అయితే దశాబ్దాల తరబడి ప్రజలతో సంస్థాగతంగా మమేకమవడాన్ని కాంగ్రెస్ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇదొక ఘోర తప్పిదం. అప్పుడప్పుడు జోడో యాత్ర లాంటి విన్యాసాలు ఆ నిర్లక్ష్యంతో వాటిల్లిన నష్టాన్ని పూరించ లేవు. రాహుల్ ఒక సాహసోపేతుడైన నాయకుడుగా కన్పిస్తున్న మాట వాస్తవం. అయితే ఆయన తుఫానులో చిక్కుకున్న నౌకకు కెప్టెన్ లాంటి వాడని చెప్పక తప్పదు. నౌకను ముందుకు తీసుకువెళ్లడానికి కెప్టెన్ కృతనిశ్చయంతో ఉన్నాడు, సందేహం లేదు. అయితే ధ్వంసమవుతున్న నౌకతో ఆయన చేయగలిగేదేమిటి? నౌకను ఒడిదుడుకులు లేకుండా ముందుకు నడపడం ఎలా సాధ్యమవుతుంది? అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కూడా చూడండి. మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలతో కూడా సంబంధాలు పెట్టుకోవడానికి ఆయన చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారు. అయితే బలమైన ప్రత్యర్థిపై సుదీర్ఘ పోరాటం చేయగల దృఢ సంకల్పం, ధైర్యం, సామర్థ్యం ఆయనకు ఉన్నాయా?

ఇప్పుడు ఎనిమిది రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలకు సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రులు ఒకప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నవారే. గత ఒక దశాబ్ద కాలంలోనే కనీసం 13 మంది మాజీ ముఖ్యమంత్రులు కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. అధికార లాలసే ఇందుకు కారణమని చెప్పక తప్పదు. సదా అధికార పక్షంలో ఉండడమే అన్ని విధాల శ్రేయస్కరమని ఆ ఫిరాయింపుదారులలో కొంత మంది భావించివుంటారు. సరే, తమపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ దాడులు జరగవచ్చనే భయంతోనే మరికొందరు కాంగ్రెస్‌ను విడనాడి అధికార పక్షం గూటికి చేరారు. మరీ ముఖ్యంగా పార్టీ కేంద్ర నాయకత్వ ధోరణులకు విసిగిపోయిన ఇంకొందరు తిరుగుబాటుకు పూనుకున్నారు. సీనియర్ నాయకులు కొత్త తరం నేతలకు నాయకత్వ బాధ్యతలు అప్పగించడానికి ససేమిరా అనడం వల్లే మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా, అసోంలో హిమంత బిశ్వశర్మ కాంగ్రెస్ నుంచి నిష్క్రమించారు. ఇప్పుడు వారు తమకు ఒక ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు గతంలో కాంగ్రెస్‌లో సర్దుబాటు వైఖరితో వ్యవహరించే ఆచరణాత్మక నాయకత్వ విధానాలు వర్ధిల్లాయి. ప్రతీ ఒక్కరి ప్రయోజనాలు నెరవేరేవి. తత్కారణంగా అందరూ పార్టీ శ్రేయస్సును కోరుకునేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. 'వారు', 'మనమూ' అన్న వైఖరితో వ్యవహరించడం సాధారణమైపోయింది.

2013లో జైపూర్ ప్లీనరీలో 'అధికారం విషతుల్యమైనది' అని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. అధికార సాధనే ప్రధాన అస్తిత్వ సూత్రంగా ఉన్న పార్టీ నాయకుల, కార్యకర్తల నుద్దేశించి తాను మాట్లాడుతున్నానన్న విషయాన్ని ఆయన మరచిపోయారు. కాంగ్రెస్‌కు భిన్నంగా బీజేపీ, సంఘ్ పరివార్ అనే ఒక సైద్ధాంతిక మహాశక్తి రాజకీయ విభాగం. కార్యకర్తలలో భావజాల సౌభ్రాతృత్వమే బీజేపీని కష్ట కాలంలో సైతం సమైక్యంగా ఉంచింది. 1984లో కేవలం రెండు సీట్లు మాత్రమే సాధించిన సందర్భంలో కూడా కార్యకర్తలు కానీ, నాయకులు గానీ ఎవరూ బీజేపీని వీడ లేదు. పార్టీ పురోగతికే అందరూ అంకితమయ్యారు. ఇప్పుడు ఆ పార్టీ వ్యవహారాలలో నరేంద్ర మోదీ మాటకే తొలి, మలి ప్రాధాన్యం. ఆ మాటే తుది నిర్ణయం. ప్రతి ఒక్కరూ ఆయన నిర్దేశించిన దాన్ని ఔదల దాల్చాల్సిందే అధికార కేంద్రీకరణ పట్ల ఎంతగా అసంతృప్తి ఉన్నప్పటికీ అధినేత ఆదేశాలను ధిక్కరించేందుకు ఎవరూ సాహసించడం లేదు. సాహసించలేరు కూడా. ఆ ఆదేశాలను విధిగా పాటిస్తున్నారు.

కాంగ్రెస్ పునరుజ్జీవన మార్గమేమిటి? 'కొత్త' బీజేపీ వలే మరింత నిరంకుశత్వ పార్టీగా వ్యవహరించడం కాకుండా, 'పాత' కాంగ్రెస్ వలే అందరినీ కలుపుకుని పోవాలి. మరింత సమ్మిళిత పార్టీగా రూపొందడమే కాంగ్రెస్‌కు పాత వైభవాన్ని పునరుద్ధరించగలదు. ఇందుకు కొత్తతరం నాయకుల ప్రతిభాపాటవాలను గుర్తించి తీరాలి. పార్టీ వ్యవహారాలలో వారికి కీలక బాధ్యతలు అప్పగించాలి. రాష్ట్ర స్థాయిలోనూ వృద్ధ నాయకులపై ఆధారపడకుండా యువ నేతలను మరింతగా ప్రోత్సహించాలి. ఇటువంటి మార్పుతో సత్ఫలితాలు సమకూరుతాయనడానికి తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వమే ఒక ఉదాహరణ. ఈ 54 ఏళ్ల నాయకుడు కొత్త ఆలోచనలు, వినూత్న కార్యాచరణ, జవాబుదారీతనంతో పార్టీని మళ్లీ అధికార పీఠానికి చేర్చాడు. రాజస్థాన్‌లో సచిన్ పైలట్‌ను, కేరళలో శశిథరూర్‌ను, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో యువనేతలకు కీలక ప్రాధాన్యమిస్తే... తెలంగాణలో రేవంత్ రెడ్డి వలే సత్ఫలితాలను సాధించలేరని ఎవరనగలరు?

ఇక రాహుల్ గాంధీ, గాంధీ పరివార్ విషయానికి వస్తే గాంధీ కుటుంబనామం, కీర్తి ప్రతిష్ఠలు సంప్రదాయ కాంగ్రెస్ శ్రేణుల వెలుపల వారిని ఉత్తేజపరచడమనేది అంతకంతకూ తగ్గిపోతోంది. లోక్‌సభ ఎన్నికలలో వరుసగా మూడోసారి పరాజయం కాంగ్రెస్ పాలిట మహా విపత్తు అవుతుందనడంలో సందేహం లేదు. దేశ రాజకీయాలలో ఒక ప్రభావ శక్తిగా ఆ పార్టీ మరింత శీఘ్రగతిన కృశించిపోవడం ఖాయం. కాంగ్రెస్‌ను గాంధీలు మాత్రమే సమైక్యంగా నిలబెట్టగలరనే విశ్వాసాన్ని కాంగ్రెస్‌వాదులు ఎంత త్వరగా విడనాడితే అంత మంచిది. ఇంకెంత మాత్రం ఓటర్లను ఆకర్షించలేకపోతున్న ఒక కుటుంబంపై ఆధారపడడమా లేక ఆ కుటుంబంతో పార్టీ బొడ్డు తాడును అంతిమంగా తెంచివేయడమా అనే విషయమై కాంగ్రెస్ వెన్వెంటనే నిర్ణయం తీసుకోవలసి ఉన్నది. కాంగ్రెస్ తక్షణ భవిష్యత్తును నిర్ణయించడంలో 2024 లోక్‌సభ ఎన్నికలు ఆ పార్టీకి ఒక అంతిమ పరీక్ష లాంటివి. కాంగ్రెస్ వాదులారా, ఇప్పటికైనా మేల్కొంటారా?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మళ్లీ మందిర్... మండల్ మార్గమేనా?



■ రాహుల్ కుమార్

నిశితంగా చూస్తే రెండు బీసీ (కాకా కలేల్కర్, మండల్) కమిషన్లు అనేక పరిమితులతో కూడిన సమాచారంతో కులాల వర్గీకరణను చేపట్టాయి. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితుల్లో గణనీయ మార్పులు వచ్చాయి. వెనుకబాటుతనాన్ని తాజాగా నిర్వచించాల్సిన అవసరం కనపడుతోంది. ఆర్థిక, విద్యాస్థాయిలను పరిగణనలోకి తీసుకుంటే రిజర్వేషన్లలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, వర్గీకరణలు కచ్చితంగా అవసరమవుతాయి. బిహార్ కుల సర్వే ఫలితాలను చూస్తే ఇదే అర్థం అవుతుంది.



మూడు పరిణామాల ప్రస్తావన లేకుండా సమకాలీన భారత చరిత్రను సమగ్రంగా చెప్పుకోలేం. ప్రైవేటు రంగానికి పెద్దపీట వేసే ఆర్థిక సంస్కరణలు వాటిల్లో మొదటిది. రెండోది అయోధ్యలో రామజన్మభూమి– బాబ్రీ మసీదు చుట్టూ తిరిగిన రాజకీయం. మూడోది.. వెనుకబడిన వర్గాలకు (బీసీలు) రిజర్వేషన్లు ప్రతిపాదించిన మండల్ కమిషన్ సిఫార్సులు. మొదటిదానిపై రాజకీయ పార్టీల మధ్య భేదాభిప్రాయాల్లేవు. మందిర్–మండల్ విధానాలను అలా భావించలేం. అవి ఇంకా విభేదాలను రగుల్చుతూనే ఉన్నాయి. రామాలయం చుట్టూ నెలకొల్పిన ఉద్వేగాలను ఆధారం చేసుకుని వచ్చే ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలవాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కులాలు కలిగించిన అసమానతలు, విభేదాలను నిర్వీర్యం చేయగలిగిన శక్తి హిందూ జాతీయవాదానికి ఉందనే నమ్మకం బీజేపీ రాజకీయాలకు కీలకం. మత ధర్మాన్ని, సంస్కృతిని మహోన్నతంగా భావించే జాతీయవాదానికి ఎన్ని సుభాష్యాలు చెప్పినా ఇతర మతాల ప్రజలకు సమానస్థాయిని ఇవ్వకపోవటం అందులో ప్రముఖంగా ఉంటుంది. చాలా దేశాల్లో అదే జరిగింది. హిందూ మతాన్ని ఒక జీవన విధానంగా భావించాలనే వాదన మనందరికీ తెలిసిందే. దాంతో విభేదించాల్సిన పనిలేదు. ఏ మతమైనా జీవన విధానమే. పాపపుణ్యాలూ, మంచీచెడూ, మనుషుల్లో తక్కువా ఎక్కువలు, ఇహపరలోక పరమార్థాలు, రాజ్యాధికారానికి అర్హతలు లాంటి వాటిని నిర్దేశించటం అన్ని మతాల్లోనూ ఉంటాయి.

హిందూ సంస్కృతిలోని మంచిచెడుల లోతుల్లోకి వెళ్లకుండా కులాల పరంగా అధికారం, పదవుల పంపకాలపై దృష్టిపెట్టటం ఇప్పటి మండల్ రాజకీయాల్లో కీలకం. అంబేడ్కర్‌లాగా కులాల అసమానతలకు ఆధారంగా ఉన్న మతభావాలపై పోరాటం సాగించటానికి మండల్ వాదులు సుముఖంగా లేరు. మందిర్ రాజకీయాలతో బాగా నష్టపోయిన కాంగ్రెస్ ఇప్పుడు మండల్ అజెండాపై ఆశలు పెట్టుకుని బలం పుంజుకోవాలని చూస్తోంది. దీన్నే అస్త్రంగా చేసుకుని ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల బరిలోకి దిగినా తెలంగాణలో తప్ప ఎక్కడా గెలవలేదు. కులగణనకు హామీ ఇచ్చినా ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతే కాంగ్రెస్‌ను గెలిపించింది. కులగణన, కుల న్యాయాలు ప్రభావం చూపలేదు. అయినా మండల్ రాజకీయాలపై కాంగ్రెస్ ఆశలు అణగారలేదు. తెలంగాణ అసెంబ్లీలో కులగణనకు తీర్మానాన్ని ప్రవేశపెట్టటమే ఇందుకు నిదర్శనం.

సామాజిక న్యాయ రాజకీయాలకు ప్రధాన ఆధారం మండల్ కమిషన్ సిఫార్సులు. దానికంటే ముందు 1953లో కాకా కలేల్కర్ (తొలి బీసీ) కమిషన్ ఏర్పాటైంది. కులాలు, వాటి వెనుకబాటు, వాటికి కల్పించాల్సిన రిజర్వేషన్ల గురించి ఆ రెండు కమిషన్లు ఏం చెప్పాయో పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి. పరిమితులూ అర్థమవుతాయి. ఇప్పటికి అవి ఎంతమేరకు పనికొస్తాయో అంచనానూ వేయవచ్చు. కలేల్కర్ కమిషన్ 1955 మార్చి 30న నివేదికను ఇచ్చింది. మండల్ కమిషన్ 1978 డిసెంబర్ 20న ఏర్పాటై 1980 డిసెంబర్ 31న నివేదికను సమర్పించింది. 20 ఏళ్ల తర్వాత రిజర్వేషన్లను సమీక్షించాలని మండల్ కమిషన్ చెప్పినప్పటికీ అందుకు ఏ పార్టీ ఇప్పటికీ సిద్ధంగా లేదు. బీసీల జనాభా ఎంతో తేలాలన్న డిమాండు 1980లకు ముందూ ఉంది. ఆ వర్గాల జనాభా 52 శాతం ఉంటుందని మండల్ కమిషన్ అంచనా వేసినా అది శాస్త్రీయంగా వేసిన లెక్కకాదు. చాలా పరిమితులతో వేసిన అంచనాగానే కమిషనే పేర్కొంది. కులాల లెక్కలను సేకరించటం 1881 మొదలై 1931తో ఆగిపోయింది. ఆ అర్ధ శతాబ్దిలో ప్రతి పదేళ్లకొకసారి పెరిగిన ఆయా కులాల జనాభా పెరుగుదల రేటును మండల కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. ఆ తర్వాతి అర్ధ శతాబ్దికి (1931–1981) ఆ రేటుని అన్వయించి బీసీల సంఖ్య విషయంలో నిర్ధారణకు వచ్చింది. హిందూ బీసీల సంఖ్య 43.70 శాతంగా పేర్కొంది. ముస్లింలు, ఇతర మతాల్లో బీసీలు 8.40 శాతంగా ఉంటారని లెక్కించింది.

వేల కులాల్లో బీసీలుగా ఎవరిని పరిగణించాలన్నది అప్పటికీ ఇప్పటికీ పెద్ద సవాలే. ఇందుకోసం సామాజిక, విద్య, ఆర్థిక అంశాలకు సంబంధించి 11 సూచికలను కమిషన్ గుర్తించింది. సామాజిక అంశాలకు సంబంధించి నాలుగు సూచికలను గుర్తించి ఒక్కొక్క దానికి మూడు పాయింట్లు ఇచ్చింది. విద్యకు సంబంధించి మూడు సూచికలకు ఒక్కో దానికి 2 పాయింట్లను కేటాయించింది. ఆర్థిక అంశాలకు నాలుగు సూచికలను గుర్తించి ఒక్కో పాయింటును ఇచ్చింది. ఈ పాయింట్ల వ్యవహారాన్ని చూస్తే కులం సామాజిక స్థాయికే (12 పాయింట్లు) మండల్ కమిషన్ ప్రాధాన్యం ఇచ్చింది. ఒక కులానికి 11 గానీ అంతకు మించి గానీ పాయింట్లు వస్తే దాన్ని బీసీ కులంగా పరిగణించింది. ఏదైనా కులాన్ని వెనుకబడిన కులంగా మిగతా కులాలు భావిస్తే మూడు పాయింట్లు ఇచ్చారు. శారీరక శ్రమపైనే జీవిస్తే మరో మూడు పాయింట్లు వేశారు. రాష్ట్ర సగటు వివాహ వయస్సు కంటే తక్కువగా.. 17 ఏళ్లకు లోపల పెళ్లి చేసుకునే మహిళల సంఖ్య 25శాతం, పురుషుల సంఖ్య 10శాతం ఏదైనా కులంలో అధికంగా ఉంటే ఆ కులానికి మూడు పాయింట్లు ఇచ్చారు. పట్టణాల విషయంలో ఈ శాతాలు 10, 5 ఉంటే సరిపోతుంది. ఏదైనా కులంలో రాష్ట్ర సగటుకు మించి 25 శాతం అధికంగా మహిళలు బయట పనులకు వెళితే మరో 3 పాయింట్లు కేటాయించారు.

చదువు విషయంలోనూ ఇలాగే పాయింట్లు ఇచ్చారు. ఏదైనా కులంలోని పిల్లలు (5–15 ఏళ్లు) రాష్ట్ర సగటుకు మించి 25 శాతం అధికంగా పాఠశాలకు వెళ్లని పరిస్థితి ఉంటే విద్యా వెనుకబాటుకు ఒక సూచిక అయింది. పాఠశాలను పూర్తిగా మానివేసే పిల్లల సంఖ్య రాష్ట్ర సగటును మించి ఇదే శాతంలో ఉంటే మరో సూచికగా తీసుకున్నారు. రాష్ట్ర సగటు కంటే 25 శాతం తక్కువగా మెట్రిక్యులేట్స్ ఉంటే ఆ అంశాన్నీ సూచికగా పరిగణించారు.

ఆర్థిక విషయాలకు వస్తే... రాష్ట్ర సగటు కంటే 25 శాతం తక్కువ ఆస్తులున్న కుటుంబాలు, 25 శాతం ఎక్కువగా కచ్చా గృహాల్లో ఉండేవారు, మంచి నీళ్ల కోసం అర కిలోమీటరు వెళ్లాల్సిన కుటుంబాలు 50 శాతానికి మించితేనూ.. అప్పులు చేసే కుటుంబాలు 25 శాతం ఎక్కువ ఉంటే.. బీసీల్లో చేర్చటానికి ప్రాతిపదికగా తీసుకున్నారు.

దేశ వ్యాప్తంగా (405 జిల్లాల్లో) మొత్తం మీద 910 గ్రామాలను, 405 పట్టణ ప్రాంతాలను ఎంపిక చేసుకుని బీసీ కులాలు ఇవీ అని నిర్ధారించటంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. ఎంతో వైవిధ్యం, సంక్లిష్టతలు ఉన్న సమాజంలో ఇలా నిర్ధారించటం అసమగ్రమని వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఫలానా కులాలను బీసీలుగా పేర్కొన్న తర్వాత వాటి జనాభాని తేల్చటం కూడా పెద్ద సవాలే. అందుకే కులాలవారీ లెక్కలను సేకరించాలని రెండు కమిషన్లు సిఫార్సు చేశాయి.

కేంద్ర ఉద్యోగాల్లో (15,71,638) బీసీల ప్రాతినిధ్యం 12.55 శాతం మాత్రమేనని మండల్ కమిషన్ నిర్ధారించింది. ఎస్సీ–ఎస్టీల ఉద్యోగుల (18.72 శాతం) కంటే కూడా బీసీలు తక్కువగా ఉన్నారని పేర్కొంది. నిజానికి ఆనాడు కేంద్రం దగ్గర బీసీ ఉద్యోగుల లెక్కల్లేవు. అందుకని కమిషనే ఒక ప్రశ్నావళి లాంటిది పంపి సమాధానాలు రాబట్టింది. అవి సంపూర్ణమని చెప్పలేం. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు (ద్విజులు) చెందని వారిని బీసీలుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అలాగే ఆ ఉద్యోగి తండ్రి, తాత విద్య ప్రాథమిక స్థాయి దాటని వారై ఉండాలని కూడా స్పష్టం చేసింది. ఈ రెండు కొలమానాలకు తూగిన వారే బీసీ ఉద్యోగులు అవుతారని పేర్కొంది. కమిషన్ సైతం ఈ కొలమానాలను సమగ్రమైనవిగా భావించ లేదు. ఉద్యోగులు కూడా అరకొర సమాధానాలనే ఇచ్చారు.

మండల్ కమిషన్ లెక్కమేరకు 1980 నాటికి బీసీ ఉద్యోగులు 12.55 శాతమే ఉన్నారని అంగీకరించినా వాళ్లందరూ ఓపెన్ కేటగిరిలోనే ఎంపికయ్యారని భావించొచ్చు. 1992 నుంచి బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. ఈ 30 ఏళ్లలో పెరిగిన విద్యావకాశాలను, మెరుగైన ఆర్థిక స్థితిని పరిగణనలోకి తీసుకుంటే బీసీ ఉద్యోగుల సంఖ్య 40–50 శాతం కచ్చితంగా ఉండే అవకాశం ఉంది. తాజా సర్వే ప్రకారం బిహార్‌లో 39.19 శాతం బీసీ ఉద్యోగులు ఉన్నారు. ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిన బీసీ ఉద్యోగస్థులు ఎక్కువే ఉంటారు. 1970ల నుంచి బీసీ రిజర్వేషన్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అమలయ్యాయి. తాజా లెక్కలను తీస్తే తెలుగు రాష్ట్రాల్లో బీసీ ఉద్యోగులు 50 శాతానికి దగ్గరలోనే ఉండే అవకాశం ఉంటుంది.

కలేల్కర్ కమిషన్ 2,399 కులాలను బీసీలుగా పరిగణిస్తే మండల్ కమిషన్ ఆ సంఖ్యను 3,733కు పెంచింది. కొలమానాలను బట్టి కులాల సంఖ్య విపరీతంగా పెరిగింది. రిజర్వేషన్లకు కులాన్ని ప్రధాన ప్రాతిపదికగా తీసుకోవాలనే విషయంపై మండల్ కమిషన్‌లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. కానీ కలేల్కర్ కమిషన్‌లో 5గురు సభ్యులు రిజర్వేషన్ ప్రాతిపదికపైనే అసమ్మతిని వ్యక్తం చేశారు. కలేల్కరే స్వయంగా వెనుకబాటుని నిర్ధారించటానికి కులాన్ని ఏకైక ప్రాతిపదికగా తీసుకోటాన్ని వ్యతిరేకించారు. ఇక ఉద్యోగాలకు సంబంధించి ఒక్కో కేటగిరీకి ఒక్కో విధంగా రిజర్వేషన్లను కలేల్కర్ కమిషన్ ప్రతిపాదించింది. సాంకేతిక, వృత్తి విద్యా సంస్థల్లో ఏకంగా 70 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. శీఘ్ర ఆర్థికాభివృద్ధితో అన్ని అసమానతలు సర్దుకుంటాయని విశ్వసించిన ఆనాటి నెహ్రూ ప్రభుత్వం వైరుధ్యాలతో కూడిన కలేల్కర్ కమిషన్ నివేదికను తిరస్కరించింది. మండల్ కమిషన్ నివేదికలో కొన్ని విచిత్రాలు కనపడతాయి. బీసీ కులాలు (333) అత్యధికంగా ఉన్న రాష్ట్రం కర్ణాటక. 292 కులాలతో ఉమ్మడి ఏపీ రెండో స్థానంలోనూ, 288 కులాలతో తమిళనాడు మూడో స్థానంలోనూ ఉన్నాయి. యూపీలో 116, బిహార్‌లో 168 బీసీ కులాలే లెక్కతేలాయి.

నిశితంగా చూస్తే రెండు బీసీ కమిషన్లు అనేక పరిమితులతో కూడిన సమాచారంతో కులాల వర్గీకరణను చేపట్టాయి. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితుల్లో గణనీయ మార్పులు వచ్చాయి. వెనుకబాటుతనాన్ని తాజాగా నిర్వచించాల్సిన అవసరం కనపడుతోంది. ఆర్థిక, విద్యాస్థాయిలను పరిగణనలోకి తీసుకుంటే రిజర్వేషన్లలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, వర్గీకరణలు కచ్చితంగా అవసరమవుతాయి. బిహార్ కుల సర్వే ఫలితాలను చూస్తే ఇదే అర్థం అవుతుంది. అక్కడి ప్రభుత్వ ఉద్యోగాల్లో యాదవులకే అగ్రస్థానం ఉందని వెల్లడైంది. వ్యవసాయ భూములు, యంత్రాలు, వాహనాల యాజమాన్యంలో సైతం ఆధిక్యత వారిదే. ఎమ్మెల్యేల్లో నాలుగో వంతు యాదవులదే. అగ్రకులాలను చాలా కొలమానాల్లో దాటేసింది.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)



టెన్షన్.. టెన్షన్..

ఉద్రిక్తంగా కాంగ్రెస్ 'ఛలో సచివాలయం'



మాచవరంలో కాంగ్రెస్ నాయకుల అరెస్టు

- ఆంధ్రరత్న భవన్‌లో షర్మిల ధర్నా
- భారీగా మోహరించిన పోలీసులు
- స్థానిక హోటళ్లు, షాపులకు ఆంక్షలు
- కంట్రోల్ రూం వరకూ షర్మిల ర్యాలీ
- తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- మెగా డీఎస్సీ కావాలంటూ నినాదాల హోరు

షర్మిల సహా ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతల అరెస్టు

మినీ డీఎస్సీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చిన 'ఛలో సచివాలయం' గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు గస్తీ ముమ్మరం చేసినా.. భారీగా బందోబస్తును ఏర్పాటుచేసినా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల తన నిరసనను కొనసాగించారు. ఆంధ్రరత్న భవన్ నుంచి పోలీసు కంట్రోల్ రూం వరకు ర్యాలీ చేయడంతో ఒక దశలో నగరంలో టెన్షన్ వాతావరణం కనిపించింది.

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రరత్న భవన్‌ను పోలీసులు బుధవారం రాత్రి నుంచే తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అటు ఏలూరు రోడ్డు వైపు, ఇటు కాళేశ్వరరావు రోడ్డు వైపు మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. రెండువైపులా మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఆంధ్రరత్న భవన్ ఉన్న వీధిలో వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, హోటళ్లు ఉన్నాయి. వాటిలోకి వెళ్లేవారిని గుర్తింపు కార్డులు పరిశీలించాకే అనుమతించారు. కొంతమంది వ్యాపారులు 9 గంటల సమయంలో షెట్టర్లు ఎత్తడానికి వచ్చారు. 10 గంటల తర్వాతే వాటిని తెరవాలని పోలీసులు నిలుపుదల చేశారు. ఈ వీధిలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోకి వెళ్లే ఉద్యోగులను గుర్తింపు కార్డులు పరిశీలించి వదిలారు. ఆంధ్రరత్న భవన్‌కు చెంతనే ఒక హోటల్‌లో ఉంది. ఇందులో వివాహ వేడుక జరుగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారిని వీధి చివరన ఆపేశారు. వేడుక నిర్వాహకులకు సంబంధించిన వారు వచ్చాకే వారిని హోటల్‌లోకి పంపారు. అయినప్పటికీ పోలీసుల కన్నుగప్పి కార్యకర్తలు వివిధ మార్గాల్లో భవన్‌లోకి అడుగుపెట్టారు. వైఎస్ షర్మిల తన చాంబర్ నుంచి బయటకు వచ్చి ధర్నాలో కూర్చోగానే, వారూ కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సుంకర పద్మశ్రీ, నరహరశెట్టి నరసింహారావు, కొలనుకొండ శివాజీ, బొర్రా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





సీనియర్ నేత తులసీరెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ఏలూరురోడ్డులో షర్మిల ర్యాలీ (ఇన్‌సెట్‌లో) షర్మిల అరెస్టు

అనుమతిపై అనుమానాలు

జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో ఎలాంటి నిరసనలకు, ర్యాలీలకు అనుమతి ఇవ్వలేదు. విజయవాడలో ప్రతిపక్షాలు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేసిన ఛలో కార్యక్రమాలను పోలీసులు అడ్డుకున్నారు. ఆయా సంఘాల నేతలు గడప దాటకుండా బ్రేకులు వేశారు. మెగా డీఎస్సీని ప్రకటించాలని వైఎస్ షర్మిల చేపట్టిన 'ఛలో సచివాలయం' పిలుపులో మాత్రం పోలీసుల తీరు భిన్నంగా కనిపించింది. ఇప్పటి వరకు జరిగిన పోరాటాలను, నిరసన కార్యక్రమాలను ఉక్కుపాదంతో తొక్కేసిన పోలీసులు షర్మిల చేపట్టిన పాదయాత్రకు మాత్రం మార్గం ఇచ్చారు. పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తును చూసి ఆమె కాంగ్రెస్ కార్యాలయం నుంచి బయటకు వస్తే అరెస్టు చేస్తారని అంతా భావించారు. ఈ అరెస్టు నుంచి తప్పించుకోవడానికి షర్మిల కాంగ్రెస్ కార్యాలయ ఆవరణలోనే ధర్నా చేశారు. తర్వాత ఆమె ర్యాలీ చేసుకుంటూ బయల్దేరారు. దీనికి పోలీసులు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. షర్మిల ఏలూరు రోడ్డు నుంచి పోలీసు కంట్రోల్ రూం వరకు ర్యాలీ చేశారు. చల్లపల్లి బంగ్లా, పోలీసు కంట్రోల్ రూం వద్ద బైఠాయించారు.

మాఫియా గుప్పెట్లో..

భారత్ రైస్

- భారత్ దాల్ కూడా రీ స్టిక్కరింగ్
- ఉత్తర భారతదేశం నుంచి దిగుమతి
- నగరంలోని ట్రేడర్లు, హోల్‌సేల్ వ్యాపారుల చేతుల్లోకి ఉత్పత్తులు
- బెజవాడ కేంద్రంగా రీ ప్యాకింగ్
- రూ.60 భారత్ దాల్ బ్యాగ్‌కు రూ.85 లేబుల్
- నేరుగా పోర్టులకు చేరి అటు నుంచి ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కు..



మధ్య తరగతి వర్గాలను ఆకట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ రైస్, భారత్ దాల్ అక్రమార్కులకు వరంగా మారాయి. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఇప్పటి వరకు ఈ పథకం అమలు కాకపోయినా ఉత్తర భారతదేశం నుంచి వైజాగ్‌కు, అక్కడి నుంచి విజయవాడకు అక్రమార్కులు దిగుమతి చేస్తున్నారు. భారత్ దాల్‌ను గోడౌన్‌లో రీ ప్యాకింగ్ చేసి ఒక్కో బ్యాగ్‌కు రూ.25 అదనంగా కలిపి లేబుల్ అంటిస్తున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు వీటిని పట్టుకోవడంతో అక్రమం వెలుగులోకి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారత్ రైస్ త్వరలో ప్రారంభమవుతుందని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఎంపిక చేసిన రేషన్ దుకాణాల్లో సెల్ఫీ పాయింట్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లోని బియ్యం తినటానికి పనికిరావటం లేదని అమ్ముకుంటున్న ప్రజలు బయట రూ.1,300 ఖర్చు చేసి 25 కేజీల బియ్యం బస్తాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కిలో బియ్యం రూ.29కే అంటే బస్తా రూ.725కే భారత్ రైస్ బ్యాగ్ వస్తుందని కార్డుదారులు భావించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ స్కీమ్ కేవలం ఉత్తర భారతదేశానికే పరిమితమైంది. దక్షిణ భారతదేశానికి అతి స్వల్పంగానే ఈ బియ్యం కేటాయించారు. కేంద్ర ప్రభుత్వ సహకార కేంద్రాల్లోనూ, ఈ కామర్స్ సైట్లలోనూ భారత్ రైస్ అందుబాటులో ఉంటాయని కూడా ప్రకటించారు. ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. భారత్ రైస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసిన తర్వాత భారత్ దాల్‌ను కూడా విడుదల చేశారు. ఈ రెండూ ఉమ్మడి కృష్ణాజిల్లాలో కనీసం ఒక్క కేంద్ర ప్రభుత్వ సహకార కేంద్రం దగ్గరకు కూడా చేరలేదు.

అక్రమార్కుల చేతుల్లోకి..

జిల్లాలో పథకం ప్రారంభం కాకపోయినా బెజవాడలోని అక్రమార్కుల చేతుల్లోకి భారత్ రైస్ వచ్చేసింది. బడా ట్రేడర్లు ఉత్తర భారతదేశం నుంచి భారత్ రైస్, భారత్ దాల్‌ను దిగుమతి చేసుకున్నారు. రైళ్ల ద్వారా ముందుగా వైజాగ్‌కు దిగుమతి చేసి అక్కడి నుంచి రోడ్డు మార్గాన విజయవాడకు తీసుకొచ్చారు. విజయవాడలో బడా ట్రేడర్లు ఉన్నారు. వీరంతా నిత్యావసరాలను దిగుమతి చేసుకుని వాటిని లూజుగా రీ ప్యాకింగ్ చేస్తారు. వాటిని బయటి మార్కెట్‌కు తరలిస్తారు. ఇలా అక్రమ వ్యాపారం చేసే వారికి గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో దుకాణాలు ఉన్నాయి. ఈ వ్యవహారం విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులకు తెలిసింది.

సివిల్ సప్లయిస్ అధికారులకు చిక్కిన భారత్ దాల్

భారత్ దాల్ బ్యాగ్‌లు బెజవాడ చేరకుండానే అక్రమార్కుల చేతికి చిక్కాయి. ఈ బ్యాగ్‌లను కొద్దిరోజుల కిందట సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. భారత్ దాల్‌ను రీ ప్యాకింగ్ చేస్తున్న వైనాన్ని గుర్తించారు. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో దుకాణాలు కలిగిన 'కాసుల' బ్రదర్స్ భవానీపురంలోని శైలజ దాల్ మిల్‌లో నిల్వ చేసి రీ ప్యాకింగ్ చేయడాన్ని గుర్తించారు.

రీ ప్యాకింగ్‌లో భారీ ధర

భారత్ దాల్ కేజీ రూ.58 కాగా, రూ.2 మార్జిన్ వేసుకున్నా రూ.60కు విక్రయించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ రీ ప్యాకింగ్ చేసి రూ.85 లేబుల్స్ వేయటాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు గుర్తించారు. బ్యాగ్‌కు రూ.25 చొప్పున వ్యాపారులు అధిక లబ్ధి పొందుతున్నారు. రైస్ బ్యాగులు కూడా ఉత్తర భారతదేశం నుంచి రైళ్లలో దిగుమతి జరిగాయన్న విమర్శలు వస్తున్నాయి. రైళ్ల ద్వారా నేరుగా పోర్టులకు చేరి, అక్కడి నుంచి ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కు పంపుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

అంతన్నారు.. ఇంతన్నారు.. వారంలో ఇళ్లు ఇచ్చేస్తామన్నారు.. పట్టాలు తాకట్టుపెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలంటూ నవిమ్మించారు.. గూడు కూడా లేని పేదల పేరిట రూ.లక్షల్లో రుణాలు తీసుకుని సొంత ఖజానా నింపుకొన్నారు.. ఇళ్లొస్తాయన్న ఆశతో పేదలు ప్రతిచోటా సంతకాలు పెట్టారు.. డబ్బు చేతికందాక ఇళ్లు కాదు కదా.. ఇటుక ముక్క కూడా ఇవ్వలేదు.. ఇప్పుడేమో బ్యాంకులు ఈఎంఐలు కట్టాలంటూ మెడపై కత్తిపెట్టాయి.. డబ్బు చెల్లించకపోతే సిబిల్ స్కోర్ తగ్గుతుందని బెదిరిస్తున్నాయి.. ఈ మొత్తం వ్యవహారంలో లబ్ధి పొంది డబ్బు దోచుకుంది రాష్ట్ర ప్రభుత్వమైతే, నష్టపోయి బ్యాంకుల నుంచి వస్తున్న బెదిరింపు ఫోన్లకు భయపడుతున్నది జక్కంపూడిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు.

జక్కంపూడిలో అసంపూర్తిగా మిగిలిపోయిన టిడ్కో ఇళ్లు



టిడ్కో ఇళ్ల పేరిట దారుణాలు

ఇళ్లు ఇవ్వలేదు.. ఈఎంఐలు కట్టాలట..!

- లేదంటే సిబిల్ స్కోర్ తగ్గిపోతుందట..!
- టిడ్కో ఇళ్ల లబ్ధిదారులపై బ్యాంకర్ల అస్త్రాలు
- వారం, పదిరోజులుగా బెదిరింపు కాల్స్
- రుణాలు కట్టొద్దంటున్న సచివాలయ ఉద్యోగులు
- చోద్యం చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రాయితీ రిఫండ్ కూడా ఉత్తమాటే..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : టిడ్కో ఇళ్లు ఇంకా లబ్ధిదారులకు అందనే లేదు. రుణాలు కట్టాలంటూ బ్యాంకుల నుంచి డిమాండ్ నోటీసులు వస్తున్నాయి. ఇళ్లే చేతికి రాకుండా బ్యాంకులకు రుణాలు ఎలా కడతామంటూ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇళ్లు చేతికొచ్చే వరకూ ఆగాలని ప్రాధేయపడుతున్నా బ్యాంకులు వినట్లేదు. రుణాలు కట్టకపోతే సిబిల్ స్కోర్ తగ్గుతుందంటూ బెదిరిస్తున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూపులే..

జక్కంపూడి ఎకనమిక్ టౌన్‌షిప్ (జెట్) సిటీలో భాగంగా పేద, మధ్య తరగతి వర్గాలకు కిందటి టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన బహుళ అంతస్థుల సముదాయాలతో కూడిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం వచ్చాక పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో ఐదేళ్లుగా లబ్ధిదారులు ఇళ్ల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇళ్ల రూపం కనిపిస్తున్నా అందులో నివాసయోగ్యమైన సదుపాయాలు మాత్రం లేవు. ఇక రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, మంచినీటి వసతులు వంటివేం లేవు. 'బ్యాంకుల్లో రుణాలిప్పిస్తాం.. తామిచ్చిన పట్టాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకోండి.. ఆ డబ్బు మాకు అప్పగించండి.. నెల రోజుల్లో అన్ని సదుపాయాలు కల్పించి ఇళ్లు మీకు అందజేస్తాం..' అంటూ లబ్ధిదారుల పేరిట రుణాలు తీసుకుంది. తీసుకున్న రుణాలకు ఈఎంఐలు ఇళ్లు స్వాధీనమయ్యాక చెల్లిస్తే సరిపోతుందని నమ్మబలికారు. ఇది జరిగి రెండు, మూడేళ్లు అవుతున్నా ఇంటి పట్టాలైతే బ్యాంకుల చేతికి వెళ్లాయి కానీ, ఇళ్లు మాత్రం ఇంతవరకు అందలేదు. ఇంతలోనే పిడుగుపాటులా బ్యాంకులు రుణాలు చెల్లించాలంటూ డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నాయి.. ఈ నోటీసులతో లబ్ధిదారులు భయపడిపోతున్నారు.

లబ్ధిదారుడి వాటా రిఫండ్ ఏదీ..?

లబ్ధిదారుల వాటాకు సంబంధించి వైసీపీ ప్రభుత్వం సగానికి సగం తగ్గించినట్టుగా ప్రకటించింది. వాస్తవానికి వైసీపీ ప్రభుత్వం ఈ రాయితీని ప్రకటించక ముందే సింహభాగం లబ్ధిదారులు తమ వాటాను చెల్లించేశారు. రాయితీల ప్రకారం 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన వారికి కొంత మొత్తం, 360 చదరపు అడుగుల విస్తీర్ణానికి సంబంధించి రూ.25,000, అలాగే, 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి సంబంధించి రూ.50,000 చొప్పున రిఫండ్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు అలాంటిదేమీ జరగలేదు. లబ్ధిదారులు టిడ్కో అధికారులు, స్థానిక సంస్థ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది.

గోడు వినని బ్యాంకర్లు

లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి ఫోన్లు, మెసేజ్‌లు వస్తున్నాయి. ఇళ్లు చేతికి అందకుండా రుణాలు కట్టడమేంటని లబ్ధిదారులు బ్యాంకర్లను ప్రశ్నిస్తున్నారు. ఇళ్లలోకి వెళ్లిన 24 నెలల తర్వాత బ్యాంకులకు వాయిదాలు చెల్లిస్తారని చెప్పిన మేరకు, తమ గడువు ప్రకారమే నోటీసులు ఇస్తున్నామని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇళ్లు ఇంకా పూర్తి కాలేదని, మాకు అందలేదని లబ్ధిదారులు చెబుతున్నా.. సమయం ఎప్పుడో దాటిపోయిందని, రుణాలు చెల్లించాల్సిందేనని బ్యాంకర్లు తెగేసి చెబుతున్నారు. ఇదే విషయాన్ని స్థానికంగా సచివాలయాల దృష్టికి తీసుకెళ్తే బ్యాంకులకు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. కానీ, బ్యాంకర్లు మాత్రం వినటం లేదు. పదేపదే ఫోన్లు చేసి లబ్ధిదారులను భయాందోళనకు గురిచేస్తున్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఫోన్లు చేస్తున్న బ్యాంకర్లు సిబిల్ స్కోర్ తగ్గుతుందని బెదిరిస్తున్నారు.

ఐదేళ్లుగా అగమ్యగోచరమే..

విజయవాడ నగరానికి చెందిన వారందరికీ జక్కంపూడిలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తొలి విడతలో గత ప్రభుత్వం పిలిచిన 15 వేల ఇళ్లకు గానూ 6,576 ఇళ్ల నిర్మాణ పనులు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే తలపెట్టారు. దాదాపు 5 వేలకుపైగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని తుది మెరుగులు దిద్దుకోవటానికి సిద్ధమయ్యాయి. వైసీపీ వచ్చాక అన్నీ మూలన పడ్డాయి. పూర్తయిన టైల్స్ పనులు, కొన్ని ఇళ్ల నిర్మాణ పనులు తలపెట్టినా పురోగతిలో లేవు. ఇక మౌలిక సదుపాయాల సంగతి సరేసరి. టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు వైసీపీ ప్రభుత్వం బ్యాంకుల వద్ద డబ్బు తెచ్చి గల్లాపెట్టెలో వేసుకుంది. కానీ, ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోవటంతో తీసుకున్న రుణాలను కట్టాల్సిందిగా బ్యాంకులు లబ్ధిదారులపై పడుతున్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్
- రాయనపాడు సమీపంలో..
- పలు రైళ్ల దారి మళ్లింపు

-6లో..

వీరమ్మ తిరునాళ్లకు భక్తుల తాకిడి



విద్యుద్దీపాల వెలుగులతో మెరిసిపోతున్న తిరుపతమ్మ ఆలయం

నేటి నుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

- నాలుగు రోజులు పెనుగంచిప్రోలులో ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

-6లో..

దుర్గగుడిలో అవినీతిపై సీఎంవో ఆరా

వన్‌టౌన్, ఫిబ్రవరి 22 : శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో పలువురు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. దేవస్థానంలో పలువురు అధికారులు, పాలకమండలిలో కీలకంగా ఉన్న వ్యక్తి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో గురువారం 'దుర్గమ్మ సన్నిధిలో దోపిడీ, బియ్యాన్ని భోంచేశారు' కథనాలు ప్రచురితం కావడంతో ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఉన్నతాధికారులు స్పందించారు. అసలు దుర్గగుడిలో ఏం జరుగుతుందన్న విషయాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఎన్నికల నేపథ్యంలో దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు వైసీపీకి వ్యతిరేకంగా మారుతాయనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. సీఎంవో నుంచి ఓ ఉన్నతాధికారి సదరు పాలకమండలిలోని కీలక వ్యక్తి నుంచి పలు విషయాల గురించి అడిగి తెలుసుకుని, ఆగ్రహం వ్యక్తపరిచినట్లు సమాచారం.



వీరమ్మ తిరునాళ్లలో ఆలయం వద్ద భక్తులు

వీరమ్మ తిరునాళ్లకు భక్తుల తాకిడి



ఉయ్యూరు, ఫిబ్రవరి 22 : వీరమ్మ తిరునాళ్లకు భక్తుల తాకిడి పెరిగింది. తిరునాళ్లలో నాల్గవ రోజైన గురువారం అమ్మవారిని దర్శించి మొక్కుబడి తీర్చుకునేందుకు భక్తులు తరలివచ్చారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. డప్పువాయిద్యాల నడుమ సందడిగా మొక్కు తీర్చుకునేందుకు చీర, సారె, పసుపు కుంకుమ సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం వద్ద భక్తుల సందడి కన్పించింది.



పూర్ణాహుతిలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు

నేటినుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 22 : తిరుపతమ్మ పెద తిరునాళ్ల శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శుక్రవారం రాత్రి కల్యాణం, 24న జలబిందెల మహోత్సవం, 25 పాల పొంగళ్లు, అంక సేవ, 26న దీవెన బండారు, 27న పూర్ణాహుతితో తిరునాళ్ల ముగుస్తాయని ఇవో కె.రమేష్‌నాయుడు చెప్పారు. అమ్మవారి కల్యాణోత్సవ వేదికను భారీగా రూపొందిస్తున్నారు. మునేటిలో నీరు లేకపోవటంతో జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేశారు. దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట సీఐ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు ఎస్సై రాంబాబు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గురువారం గణపతి హోమం, వాస్తుపూజ, గోపూజ, పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవారి దీక్షా స్వాముల తిరుముడి సమర్పణకు శివాలయంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, వని తా క్లబ్‌లు సంయుక్త ఆధ్వర్యంలో తిరుముడి సమర్పణకు వచ్చే దీక్షా స్వాములకు అల్పాహారం పంపిణీ చేశారు.



ఆసుపత్రి నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ సహకారంతో ఆంధ్రా ఆసుపత్రిలో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 22 : రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సహకారంతో నిరుపేద కుటుంబాలకు చెందిన 76 మంది చిన్నారులకు ఆంధ్రహాస్పిటల్స్ వైద్యులు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో గురువారం విలేకర్ల సమావేశంలో శస్త్ర చికిత్సల నిమిత్తం రూ.65,22,873 చెక్కును ఆసుపత్రి యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా ఆసుపత్రి ఎండీ, పిడియాట్రిక్ చీఫ్ పీవీ రామారావు మాట్లాడుతూ, గత ఎనిమిదేళ్లుగా తమ ఆసుపత్రిలో సుమారు 4000 మంది చిన్నారులకు గుండె సర్జరీలు, ఇంటర్వెన్షన్స్ చేసినట్టు చెప్పారు. అతి క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతమయ్యాయన్నారు. పిల్లల కార్డియాక్ టీమ్, ఇన్టెన్సివ్ కేర్ సిబ్బందిని అభినందించారు. రోటరీ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు(దత్తా) మాట్లాడుతూ, రోటరీ సంస్థ వైద్యసేవలకు నిధులు సమకూర్చడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ జీవీ మోహన్ ప్రసాద్ మాట్లాడుతూ, పేద వారికి వైద్యం రోటరీ అంతర్జాతీయ ప్రమాణాలలో ఒకటన్నారు. ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడంలో ప్రధాన పాత్ర పోషించిన రోటరీ విజయవాడ సభ్యుడు కరిణి చంటిరాజు ఈ మధ్య కాలంలో మృతి చెందారని, రోటరీ ద్వారా సమాజానికి చంటి రాజు చేసిన సేవలను సభ్యులు కొనియాడారు. ప్రాజెక్ట్‌కు కరిణి హోలి (కరిణి చంటిరాజు కుమారుడు) ప్రైమరీ కాంట్రాక్ట్ పర్సన్‌గా, జి.భానుప్రకాశ్ సెంకడరీ కాంట్రాక్ట్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి డాక్టర్లు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కొనకళ్ల, మండలి

బాబుతోనే అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ

- కొనకళ్ల నారాయణ

చల్లపల్లి, ఫిబ్రవరి 22 : చంద్రబాబుతోనే అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. చల్లపల్లిలో పార్టీ కార్యాలయాన్ని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కొనకళ్ల మాట్లాడుతూ, టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో నవ్యాంధ్రను అభివృద్ధిబాట పట్టించారని తెలిపారు. చంద్రబాబు హయాంలో పనులు ప్రారంభిస్తే, జగన్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకంగా బందరు పోర్టును నిర్మిస్తున్నారని విమర్శించారు. అవనిగడ్డలో అభ్యర్థిగా బుద్ధప్రసాద్‌ను గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల్లో కార్యకర్తలే కీలకపాత్ర అనీ, కార్యకర్తలు లేనిదే పార్టీ లేదన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ఉత్సాహంగా పనిచేసే కార్యకర్తలు అవనిగడ్డలో టీడీపీ జెండాను రెపరెపలాడించాలన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు అంటూ వైసీపీ శ్రేణులు వారిపై దాడులకు పాల్పడుతుంటే ముఖ్యమంత్రి పెత్తందారుల పక్షాన నిలుస్తున్నరని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక విధానాలు, అవినీతి.. దోపిడీలపై ప్రజల్ని చైతన్యం చేయటం ప్రధాన కర్తవ్యంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. చల్లపల్లి మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్, తెలుగుమహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్ తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- పదో తరగతి, ఇంటర్, డీఎస్సీ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలి
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు



పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం/విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్, డీఎస్సీ పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్, ఇంటర్ విద్యా కమిషనర్ సౌరబ్ గౌర్ తదితరులతో కలిసి పరీక్షల నిర్వహణపై జిల్లాల కలెక్టర్లతో గురు



పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లు అధికారులతో మాట్లాడుతూ, పదోతరగతి ప్రశ్నాపత్రాల్లో క్యూఆర్ కోడ్ నిక్షిప్తమై ఉంటుందన్నారు. ఎవరైనా ప్రశ్నాపత్రాన్ని లీక్‌చేస్తే ఏ విద్యార్థినుంచి ఈ ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందో వెంటనే తెలిసిపోతుందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులకు ముందస్తుగానే తెలియజేయాలన్నారు. పది పరీక్షలకు కృష్ణాజిల్లానుంచి 26507మంది, 33007 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మార్చి 2 నుంచి ఇంటర్ పరీక్షలు, మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు, మార్చి 15న డీఎస్సీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని, ప్రశ్నాపత్రాలు తరలించే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జవాబు పత్రాలను భద్రం చేసేందుకు పోస్టల్ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో కృష్ణాజిల్లా జేసీ గీతాంజలి శర్మ, ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఈవో తాహెరా సుల్తానా, జిల్లాపరీక్షల నియంత్రాణాధికారి డేవిడ్ రాజు, రవాణాశాఖ అధికారి వాణిశ్రీ, ఆర్ఐవో రవికుమార్, పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ సుధాకర్, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, విద్యాశాఖ అధికారులు, ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇంటర్మీడియట్ విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి, డీఎస్ఈవో యూవీ సుబ్బారావు, ఏడీ కేఎస్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాడ్‌బ్యాండ్ సేవలను వారంలోగా ఏర్పాటు చేయండి : రాజాబాబు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెల్‌టవర్ సిగ్నల్స్, బ్రాడ్‌బ్యాండ్ సేవలను పూర్తిస్థాయిలో జిల్లావ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ రాజాబాబు సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించారు. బీఎస్ఎన్ఎల్, జియో ఫైబర్‌నెట్ వోడాఫోన్, ఎయిర్‌టెల్, ఆక్ట్ సర్వీస్ ప్రొవైడర్లతో గురువారం తన చాంబరులో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో సమాచారం ఇచ్చిపుచ్చుకునేందుకు ఇంటర్‌నెట్ సేవలు అత్యంత అవసరమన్నారు. పోలింగ్ కేంద్రాలవారీగా ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు త్వరలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అందుకు అవసరమైన బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచార ప్రకటనలు, ఎస్ఎంఎస్‌లు ఓటర్లకు పంపేందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు.

జాబు కావాలంటే బాబు రావాలి

- నిరుద్యోగరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక
- జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో నిరుద్యోగులకు జాబు రావాలంటే బాబు రావాలని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, సీనియర్ టీడీపీ నేత కేశినేని చిన్ని, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యలు పేర్కొన్నారు. పట్టణంలో శుభమస్తు కల్యాణమండపంలో గురువారం జాబ్‌మేళా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లుగా యువత ఉద్యోగాలు రాక నిరాశ నిస్పృహలతో మత్తుకు బానిసగా మారారని, యువశక్తి నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులను రూ.5 వేలుతో వలంటీర్లగా నియమించి ఉద్యోగాలు ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో 20లక్షలు ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. జాబులు కావాలంటే బాబు రావాల్సిందేనని అన్నారు.



అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

కేశినేని చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళకు నిరుద్యోగుల నుంచి అనూహ్య స్పందన లభించింది. 1567 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్లు చేసుకోగా 822 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, 322 మందికి ఆఫర్ లెటర్స్ ఇచ్చారన్నారు. టీఎన్ఎస్ఎఫ్ సహకారంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల నిరుద్యోగుల కోసం మేళా ఏర్పాటు చేయగా.. రూ.15వేలు నుంచి గరిష్టంగా రూ.45వేలు వరకు ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పోరాట సమితి నేతలు

కాలుష్యం.. కాటేస్తోంది!

- ప్రాణ సంకటంగా వీటీపీఎస్ వ్యర్థాలు
- కాలుష్య నియంత్రణ పోరాట సమితి నేతల ఆవేదన

ధర్నాచౌక్, ఫిబ్రవరి 22 : ఇబ్రహీంపట్నంలో వీటీపీఎస్ ప్లాంట్ నుంచి వెలువడే వాయు కాలుష్యం, వందలాది వాహనాల నుంచి వచ్చే బూడిద కాలుష్యం నుంచి స్థానిక ప్రజల ప్రాణాలు కాపాడాలని వీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వీటీపీఎస్ సంస్థ నుంచి అధిక మొత్తంలో విడుదలవుతున్న కాలుష్య కారకాల వల్ల సుమారు 15 గ్రామాల్లో ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ ఏర్పాటుకు గతంలో పొలాలు ఇచ్చి.. ఇప్పుడు ప్రాణాలు కోల్పోవాలా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి గత 15 రోజులుగా రోడ్లపైకి వచ్చి పోరాడుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఏపీ కాలుష్య మండలి అవినీతి మండలిగా మారిందని ఆరోపించారు. గతంలో ఇక్కడ అన్ని రకాల పంటలు పండేవని.. ఇప్పుడు కేవలం వరి, చెరుకు మాత్రమే పండుతున్నాయన్నారు. పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయన్నారు. పాత ప్లాంట్‌లను 2017లోనే మూసివేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆదేశాలిచ్చినప్పటికి వాటిని 2024 వరకు నడపాలని ప్రయత్నిస్తున్నారన్నారు. 30 ఏళ్ల పైబడిన 1, 2 యూనిట్లను తక్షణమే మూసివేయాలని, స్థానికంగా మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రి ఏర్పాటు చేసి కాలుష్య బాధితులకు ఉచితంగా వైద్యం అందించాలన్నారు. నిత్యం యథేచ్ఛగా తరలిస్తున్న బూడిద రవాణాను అరికట్టాలన్నారు. సమావేశంలో కమిటీ అధ్యక్షుడు చెరుకుపల్లి సురేష్, ప్రధానకార్యదర్శి షేక్ కరిముల్లా, చెరుకూరి వేణుగోపాలరావు, కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీనామీ పేర్లతో భూముల దోపిడీ కుట్ర!

- అసైన్డ్ భూముల పేరుతో పేర్ని నాని రాజకీయం : కొల్లు రవీంద్ర ధ్వజం



సర్వే నెంబర్లు లేకుండా ఉన్న పట్టాను మీడియాకు చూపుతున్న కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 22 : సర్వే నెంబర్లు లేకుండా స్ట్రీట్ సైడ్ అంటూ దొంగ పట్టాలు సృష్టిస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. గురువారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ కాలేజీ వద్ద స్ట్రీట్ సైడ్ అంటూ పొజిషన్ సర్టిఫికెట్లు, దొంగ పట్టాలు ఇప్పిస్తున్నారన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఎన్నికల ముందు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలోని జిప్లస్ 3 గృహాలను ఇప్పటికీ పేదలకు ఇవ్వలేదన్నారు. తన బినామీలకు అసైన్డ్ భూములను కట్టబెట్టేందుకు ఎమ్మెల్యే పేర్ని నాని చూస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో వెళ్లి అసైన్డ్ ల్యాండ్ పట్టాలు ఇవ్వాలని సీఎంవో ధనుంజయరెడ్డి వద్ద వత్తిడి తీసుకువస్తున్నారన్నారు. సామాజిక కార్యకర్త కొనకళ్ల గణపతిపేరున ఉన్న పార్కుకు మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి పేరు పెట్టించి తద్వారా అడ్డగోలు అనుమతులు ఇప్పించారన్నారు. విశాఖలో గ్యాస్ ప్రమాదంలో మృతిచెందిన పేదలకు రూ. 25లక్షలు ఇచ్చిన వైసీపీ పాలకులు బందరులో అధికారుల నిర్లక్ష్యం కారణంగా బలైపోయిన పసిబిడ్డ కుటుంబానికి ఇప్పటి వరకు ఒక్కపైసా చెల్లించకపోవడం దారుణమన్నారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే కర్రగ్రహారంలో సెంటు స్థలం ఇచ్చిన లబ్ధిదారులకు రెండు సెంట్లు ఇప్పించి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

నెలాఖరులో జయహో బీసీ.. : నెట్టెం



బీసీ సెల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విద్యాధరపురం, ఫిబ్రవరి 22 : జిల్లాలో ఈ నెలాఖరున జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. ఆటోనగర్‌లోని జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా బీసీ సెల్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గానికి 1500 మంది చొప్పున 10వేల మందికి తగ్గకుండా సభకు వచ్చేలా నాయకులు కార్యాచరణ చేయాలన్నారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ, ఏడు నియోజకవర్గాల్లో బీసీ సాధికారిక సంఘాల అధ్యక్ష కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేసి జగన్‌రెడ్డి పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరించాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి బీసీలకు జరిగిన మోసాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్టీఆర్ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మరక శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఉయ్యూరు నరసింహరావు, గంజం రాఘవేంద్రరావు, మల్లెల ఈశ్వరరావు, వెలగాల నూకాలమ్మ, మొండి జ్యోతి, శివకుమారి, శ్రావ్య, లీలా తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు తప్పిన గూడ్స్ బోగీ

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

- రాయనపాడు వద్ద పట్టాలు తప్పిన ఐదు బోగీలు.. పలు రైళ్లు దారి మళ్లింపు

విజయవాడ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ-సికింద్రాబాద్ మెయిన్ లైన్‌లో రాయపాడు సమీపంలో గురువారం రాత్రి 10.30గంటల సమయంలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. ఘటనలో ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ గూడ్స్ రైలు సికింద్రాబాద్ నుంచి కాకినాడ సీ పోర్టుకు వెళ్లాల్సి ఉంది. రాయనపాడులో కొంత సమయం హాల్టింగ్ తర్వాత కాకినాడ సీ పోర్టుకు బయలుదేరాల్సి ఉండగా రాయనపాడుకు రైలు చేరుకోగానే పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. విషయం తెలియగానే రైల్వే ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షిస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి గ్రానైట్ రాయి లోడుతో రైలు వస్తోంది. సరుకుకు కూడా ఎలాంటి నష్టం వాటిల్ల లేదు. మెయిన్‌లైన్‌పై పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. మచిలీపట్నం - బీదర్ (12749) రైలును విజయవాడ, కృష్ణా కెనాల్ జంక్షన్, గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా మళ్లించారు. కాకినాడ పోర్టు - లింగంపల్లి (12737)ను కూడా విజయవాడ, కృష్ణా కెనాల్ జంక్షన్, గుంటూరు, పిడుగురాళ్ల మీదుగా మళ్లించారు. గూడూరు, సికింద్రాబాద్ (12709)ను తెనాలి, గుంటూరు, పగిడిపల్లిల మీదుగా మళ్లించారు.

ఏసీబీకి చిక్కిన శానిటరీ ఇన్‌స్పెక్టర్

- టిఫిన్ బండి పెట్టుకునేందుకు 8వేలు డిమాండ్
- లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్

అవనిగడ్డ, ఫిబ్రవరి 22 : అవనిగడ్డ పంచాయతీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న పవన్ కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం వలపన్ని పట్టుకోవటం స్థానికంగా కలకలం రేకెత్తించింది. ఏసీబీ ఏఎస్పీ స్నేహిత పర్యవేక్షణలో ఇన్చార్జి డీఎస్పీ ప్రతాప్ నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అవనిగడ్డకు చెందిన ఆకుల సాయికృష్ణ టిఫిన్ బండి పెట్టుకునేందుకు పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు అనుమతి ఇవ్వాలంటే రూ.8 వేలు పవన్‌కుమార్ డిమాండ్ చేయడంతో విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాడు. గురువారం ఉదయం పవన్‌కుమార్ సాయికృష్ణ నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఏఎస్పీ స్నేహిత తెలిపారు. విచారణ అనంతరం పవన్‌కుమార్ రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు దాడుల్లో ఏసీబీ అధికారులు శ్రీనివాస్, నాగరాజు, సురేష్, రవి కిరణ్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తలశిల స్వర్ణలత, కొనకళ్ల నారాయణ

మహిళా గళం విజయవంతం చేయండి

- తలశిల స్వర్ణలత పిలుపు

చల్లపల్లి, ఫిబ్రవరి 22 : మార్చి 4న గుడివాడలో జరిగే 'మహిళా గళం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత పిలుపునిచ్చారు. గురువారం తెలుగుమహిళా నేతల సమావేశంలో స్వర్ణలత మాట్లాడుతూ, గుడివాడలో జరిగే 'మహిళా గళం' ద్వారా మహిళల గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలన్నారు. తెలుగుమహిళలు, వీర మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులు, మహిళలు సదస్సులో పాల్గొనేలా చూడాలని కోరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు ఎలుగెత్తి చాటడంలో తెలుగుమహిళల పాత్ర ముఖ్యమైనదన్నారు. జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి పైడిపాముల కృష్ణకుమారి, అధికార ప్రతినిధి మైనేని ఇందిర, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బండె కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, ఎంపీపీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్‌లో మూయించిన స్టాలు

రైతుబజార్‌లోనూ రాజకీయం!

- భర్తలు పార్టీ మారారని భార్యలపై ఎమ్మెల్యే వెలంపల్లి కక్ష సాధింపు
- డ్వాక్రా మహిళల స్టాళ్లు మూసివేత

పాయకాపురం, ఫిబ్రవరి 22 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలకు తెరతీస్తూ పేదల కడుపుకొడుతున్నారు. భర్తలు పార్టీ మారారని, భార్యలపై ఎమ్మెల్యే వెలంపల్లి కక్ష సాధింపులకు దిగడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీకి ఇటీవల భారీగా వలసలు పెరిగాయి. వైసీపీలోని పలువురు కార్యకర్తలు పార్టీ పోకడలతో విసిగిపోయి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. వీరిని కట్టడి చేసేందుకు వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ కక్షసాధింపు చర్యలకు దిగడం గమనార్హం.

పాయకాపురం మోడల్ రైతుబజార్‌లో రెండేళ్ల క్రితం కూరగాయల విక్రయాలకు దరఖాస్తు చేసుకుని స్రవంతి, చామంతి డ్వాక్రా గ్రూపుల మహిళలు స్టాళ్లు నిర్వహిస్తున్నారు. అయితే ఇటీవల ఇద్దరు మహిళల భర్తలు వైసీపీ కార్యకర్తలుగా ఉంటూ పార్టీ పోకడలతో విసిగిపోయి సెంట్రల్ టీడీపీ నేత బొండా ఉమా సమక్షంలో పార్టీలో చేరారు. వారు పార్టీలో చేరిన రెండురోజుల్లో రైతుబజార్‌లో మహిళలకు చెందిన రెండు దుకాణాలను వెలంపల్లి, స్థానిక వైసీపీ నేత కలిసి మూయించి వేశారు. నేతలు ఆదేశాలే తడవుగా రైతుబజార్ ఈవో దుకాణాలు మూయించి వేయడంతో సదరు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భర్తలు పార్టీ మారితే తమ దుకాణాలను మూయించడం అన్యాయమని, చిరువ్యాపారులపై తమ ప్రతాపం చూపి రాజకీయాలకు బలిచేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా జగనన్న అక్కచెల్లెమ్మలకు ఇచ్చే గౌరవం అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.



రైతుబజార్‌లో డ్వాక్రా మహిళ స్టాలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316



సెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

రాష్ట్రంలో బాగుపడింది జగన్ కుటుంబం మాత్రమే : నాగుల్‌మీరా

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: ఈ రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి కుటుంబం మాత్రమే బాగుపడిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా అన్నారు. గురువారం మొగల్రాజపురంలోని కేశినేని శివనాథ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి మళ్లీ ఆ వర్గాలను అడ్డుపెట్టుకుని గెలవడానికి మరో కొత్త నాటకానికి తెరతీశాడని విమర్శించారు. 34 శాతం ఉన్న రిజర్వేషన్‌లను తగ్గించిన జగన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు శత్రువే అవుతాడని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు లేకుండా చేశాడని, కార్పొరేషన్ వల్ల ఆ వర్గాల కుటుంబాలకు ఏ మాత్రం ప్రయోజనం లేకుండా సర్వనాశనం చేశాడన్నారు. బీసీలందరూ ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే ఉంటారన్నారు. నాయీ బ్రాహ్మణుల ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ వినుకొండ సుబ్రహ్మణ్యం, రజక సంఘాల ఐక్యవేదిక సెక్రటరీ కందేటి వీరవెంకటేశ్వరరావు, మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

నేటితరానికి ఆజాద్ ఆదర్శం

విద్యాధరపురం, ఫిబ్రవరి 22: నేటి తరానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆదర్శమని టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట యోధుడు అబుల్ కలాం ఆజాద్ జీవిత ప్రస్థానాన్ని ప్రస్తావించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చి విశ్వవిద్యాలయాలను స్థాపించారన్నారు. దేశ పురోగతికి చదువే ముఖ్యమని ఆయన చాటి చెప్పారన్నారు. ఆయన జీవితం నేటి తరం వారికి ఆదర్శమని చెప్పారు. మహమ్మద్ రజావుల్లా, తమీమ్ అన్సారీ, షేక్ ఆషా, అబ్దుల్ కరీమ్, రియాజ్, జహేద్, మహమ్మద్ ఇర్ఫాన్, బడేషా పాల్గొన్నారు.



ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న మహమ్మద్ ఫతావుల్లా తదితరులు



ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న ఎంఎస్ బేగ్

పశ్చిమ టీడీపీ కార్యాలయంలో ..

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను స్మరించుకోవడం ఎంతో గర్వకారణమని పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. పశ్చిమ టీడీపీ కార్యాలయంలో గురువారం భారతదేశ మొట్టమొదటి విద్యామంత్రి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి బేగ్, తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ జీవితంలోని మైలురాళ్లను బేగ్ ప్రస్తావించి ఆ మహనీయుడిని స్మరించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.

మహోన్నత వ్యక్తి ఆజాద్

పాయకాపురం: దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేసిన గొప్ప మహోన్నత వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా అన్నారు. 61వ డివిజన్ శాంతినగర్‌లో గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగూల్‌మీరా ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్ సాజిద్ ఆలీ, ఎండీ కాలేషా పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 22 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అక్రమాలన్నింటిని సరిచేస్తామని తెలిపారు. గురువారం ఉదయం 13వ డివిజన్ జేడీనగర్ ఏరియాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను గద్దె ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. డివిజన్‌లోని పార్టీ కార్యకర్త కోటేశ్వరమ్మకు టిఫిన్ బండిని గద్దె అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయని, జగన్ పాలనలో కేవలం 5 శాతం పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వలేదని విమర్శించారు. టిడ్కో ఇళ్ల ప్రహరీకి రంగులు వేయడానికే జగన్‌కు ఈ ఐదేళ్ల కాలం పట్టిందని అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల పేరుతో జగన్ ప్రభుత్వం ఒక్కో ఇంటి మీద బ్యాంక్‌ల నుంచి రూ.3లక్షల 25వేలు రుణం తీసుకుందని, అసలు వడ్డీ కలిపి కట్టాలని లబ్ధిదారులకు బ్యాంక్‌లు నోటీసులు ఇస్తున్నాయని, ఈ పరిణామంతో లబ్ధిదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. కేవలం నెలా పదిహేను రోజులు మాత్రమే జగన్ ప్రభుత్వం ఉంటుందని గద్దె జోస్యం చెప్పారు. బంగారు మురళీ, బంగారు నూకరాజు, ఆంజనేయులు, పామర్తి కిషోర్, జాస్తి సురేష్, బెజవాడ నజీర్ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న గద్దె రామ్మోహన్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బాలస్వామి, బొండా రవితేజ

టీడీపీ నాయకుల ప్రత్యేక పూజలు

చిట్టినగర్: తెలుగుదేశం-జనసేన కూటమిని ఆశీర్వదించమ్మా మహాలక్ష్మమా అంటూ టీడీపీ నాయకుడు ఎంఎస్ బేగ్ ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబు రావాలి.. రాష్ట్రం బాగుపడాలని నినాదాలు చేస్తూ అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ ఓటమి భయంతో వైసీపీ ప్రజలతోపాటు పాత్రికేయ మిత్రులపై, ఆఫీసులపై భౌతిక దాడులకు తెగబడుతున్నారన్నారు. పశ్చిమంలో పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపు కోసం టీం టీడీపీ పాటుపడుతుందన్నారు. మీడియా కో-ఆర్డినేటర్ ఏదుపాటి రామయ్య, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కనకరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు సుకాశి సరిత, అశోక్, శివశర్మ పాల్గొన్నారు.

23వ డివిజన్‌లో..

గవర్నర్‌పేట: 23వ డివిజన్ టీడీపీ ఆధ్వర్యంలో గురువారం సూర్యారావుపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. డివిజన్ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి నేతృత్వంలో టీడీపీ కార్యకర్తలు డోర్నకల్ రోడ్డులో పాదయాత్ర నిర్వహిస్తూ వ్యాపార వర్గాలకు భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. టీడీపీ యువ నాయకుడు బొండా రవితేజ, డివిజన్ కార్యదర్శి ఆలపాటి రాము, స్థానిక నేతలు పాదయాత్రలో పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో జన శంఖారావం ప్రారంభం

పాయకాపురం, ఫిబ్రవరి 22 : సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన జన శంఖారావం కార్యక్రమం గురువారం ప్రకాష్‌నగర్ సెంటర్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈ నెల 27 వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఎర్రబెలూన్లు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా 61, 62, 63, 64వ డివిజన్లలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా రంజక పాలన అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం వలంటీర్లపై ఆధారపడి ఎన్నికలకు వెళ్తుంటే తాము ప్రజలను నమ్ముకుని ఎన్నికలకు వెళ్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టు వామపక్ష పార్టీలను ఆదరించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, సీపీఎం నేతలు కాశీనాథ్, డీవీ కృష్ణ, కె. శ్రీదేవి, కె. దుర్గారావు, సీపీఐ నేత కేవీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు

మోడరన్ అకాడమీ విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 22 : సీఎంఏ(ఐసీడబ్ల్యూఏ) ఇంటర్ ఫైనల్ పరీక్షల్లో మోడరన్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. డిసెంబరు 2023 సీఎంఏ పరీక్ష ఫలితాల్లో మోడరన్ అకాడమీ విద్యార్థులు జిల్లేపల్లి సాయి లక్ష్మీ స్నేహలత 38వ ర్యాంకు, గుళ్లతోటి అజయ్ 42వ ర్యాంకు, ఒంటెద్దు లోకనాథేశ్వరరెడ్డి 48వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా అకాడమీ ఛైర్మన్ సుంకర పాపారావు మాట్లాడుతూ మోడరన్ అకాడమీ అనుబంధ సంస్థ అన్నపూర్ణ మెమోరియల్ మోడరన్ డిగ్రీ కాలేజీలో బీకాం చదువుతూ సీఎంఏ కోర్స్ పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం అకాడమీ అధ్యాపకులు అభినందించారు.



స్నేహలత | లోకనాథేశ్వరరెడ్డి | అజయ్

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా గజవాహన సేవ

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: బ్రాహ్మణవీధి వెంకటేశ్వరస్వామి గుడిలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం యధావిధిగా నిత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేయి గులాబీలతో అర్చన, తీర్థ గోష్ఠులను నిర్వహించారు. బొర్రా మల్లేశ్వరరావు, అంజలి దంపతులు, గజ్జవరపు మేఘనాథ్ దంపతులు, విజయసాయి ఫోటో ఫ్రేమ్స్ సుబ్బారావు- శారద దంపతులు, సాయి బాలాజీ ట్రేడర్స్ కైంకర్య పరులుగా గజవాహనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.



నయనానందకరంగా కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల సందర్భంగా రాత్రి వేళ స్వామివారి కల్యాణోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు మంగళవాయిద్యాల నడుమ శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించారు. మాదల ప్రసాద్, - లక్ష్మి, వీరి కుమారులు వెంకటేష్, వరుణ్, సురేష్ పేపర్ అండ్ కో, గోల్డ్‌మెడల్ పేపర్ మార్ట్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. టీటీడీ వేదపండితుడు పల్లిమురారి వెంకట శివకుమార్ అవధాని భక్తులకు ఆశీస్సులు అందజేశారు. పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు స్వామివారి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈవో ఘంటసాల శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మీడియాపై దాడులు సిగ్గుమాలిన చర్య

● ఫారూక్ షుబ్లీ, సురేంద్రబాబు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 22: మీడియాపై దాడులు చేయడం సిగ్గుమాలిన చర్యగా ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు ఖండించారు. మొగల్రాజపురం కార్యాలయంలో ఉమ్మడిగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కొడాలి నాని, ఇతర వైసీపీ నాయకులు దాడులను సమర్థించడం దారుణం అన్నారు. ఇటువంటి పార్టీని రాబోయే ఎన్నికల్లో సాగనంపాల్సిన అవసరం ఉందని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమతా సైనిక్ దళ్ నాయకులు గొల్ల వరప్రసాద్, ఏర్రం సుధీర్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పాయకాపురం, ఫిబ్రవరి 22 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పాత రాజీవ్‌నగర్, ఉడాకాలనీలోని ఎల్‌ఐజీ, ఎంఐజీ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ. సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

అజిత్‌సింగ్‌నగర్: అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని యార్డ్ రోడ్డు, లూనాసెంటర్, ఎంకే. బేగ్ స్కూల్, లెనిన్ సెంటర్, రైల్వేట్రాక్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పలు ఆలయాలకు వీఎంసీ నోటీసులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: బిల్డింగ్ పన్ను, డ్రెయినేజీ సెస్సులు చెల్లించాలని విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం, పాత శివాలయాలకు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) నోటీసులు జారీ చేసింది. వన్‌టౌన్‌లోని పాత శివాలయానికి చెందిన ఎనిమిది షాపులకు రూ.19 వేలు బిల్డింగ్ పన్ను చెల్లించాలని, పాత శివాలయానికి అనుబంధంగా ఉన్న గవర్నరుపేట పెద్దిబొట్లవారి వీధిలో ఉన్న విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన 11 షాపులు, ఒక లాడ్జికి రూ. 1,22,638 బిల్డింగ్ పన్ను చెల్లించాలని రూ. 39,789 డ్రెయినేజీ పన్నులు చెల్లించాలని కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం పాత శివాలయంలో ఇన్‌చార్జి ఈవో లోకేశ్వరికి, విఘ్నేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం షాపుల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు

గణాంక శాస్త్రం ప్రాముఖ్యత, ఉద్యోగాలపై అవగాహన సదస్సు

లబ్బీపేట, ఫిబ్రవరి 22: నలంద డిగ్రీ కళాశాలలో నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు (ఎన్ఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో గణాంక శాస్త్రం ప్రాముఖ్యత, ఉద్యోగాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థల్లో స్టాటిస్టిక్స్ ఉపయోగం, ప్రాధాన్యత, డేటా కలెక్షన్ ఏవిధంగా చేయాలి అనేది స్టాటిస్టిక్స్ ద్వారానే తెలుసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్.కిరణ్ కుమార్ ప్రాబ్లెమ్ సాల్వింగ్ మెథడాలజీని మెరుగుపరచుకుంటే కలిగే ఉపయోగాలను, గవర్నమెంట్ సెక్టార్స్‌లో స్టాటిస్టిక్స్‌లో ఉన్న ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి సర్టిఫికెట్స్, మెమెంటోలను అందజేశారు. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.జె.శామ్యుల్, స్టాటిస్టిక్స్ హెచ్‌వోడీ పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైడ్ కాల్వలో పడి వ్యక్తి మృతి

పాయకాపురం, ఫిబ్రవరి 22 : సైడ్ కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పాయకాపురం ప్రాంతంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన కదిరి అప్పన్న(42) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పనుల నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం వాంబేకాలనీ రవీంద్ర భారతి స్కూల్ వద్ద ఉన్న సైడ్ కాల్వలో అప్పన్న పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అప్పన్నను కాలువలో నుంచి బయటకు తీశారు. అయితే అప్పన్న అప్పటికే మృతి చెందాడు. మద్యం మత్తులో సైడ్ కాలువలో పడిపోయి ఉంటాడని భావిస్తున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● సీపీఎం, సీపీఐ నేతల పరామర్శ

మృతుడు కుటుంబాన్ని సీపీఎం, సీపీఐ నేతలు సీహెచ్ బాబూరావు, జి. కోటేశ్వరరావులు గురువారం పరామర్శించారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైడ్ డ్రెయిన్‌లో పడి మృతి చెందిన ఘటనలు ఇటీవల ఎక్కువవుతున్నాయని, ప్రభుత్వం స్పందించి అవుట్‌ఫాల్ డ్రెయిన్లపై గ్రిల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బీటీ రోడ్డు, ప్లేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు శంకుస్థాపన

వెలంపల్లి లేకుండా మేయర్ శంకుస్థాపన

భవానీపురం, ఫిబ్రవరి 22 : కార్పొరేషన్ పరిధిలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ప్రమేయం లేకుండా మేయర్ రాయన భాగ్యలక్ష్మి భవానీపురంలోని వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్డు వద్ద రూ.3.5 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, ప్లేవర్ బ్లాక్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం గురువారం చర్చనీయాంశమైంది. 41, 42, 43వ డివిజన్లలోని ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని, 900 మీటర్ల పొడవైన కాలుష్య రహితమైన డస్ట్ ఫ్రీ రోడ్లు వేస్తున్నట్లు మేయర్ తెలిపారు. పనులకు శంకుస్థాపన విషయం కూడా కార్పొరేటర్లకు ఆలస్యంగా తెలియడం వెనుక ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యంపైన చర్చ సాగింది. ఏఈని కొందరు నిలదీసినట్లు సమాచారం. హడావుడిగా కార్పొరేటర్లు ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్‌లు పాల్గొన్నారు.

టీడీపీలోనే మైనార్టీ డీఎన్ఏ ఉంది: బేగ్

విద్యాధరపురం, ఫిబ్రవరి 22: టీడీపీలోనే మైనార్టీ డీఎన్ఏ విలీతమై ఉందని పశ్చిమ టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడు తూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల చెబుతున్నట్లుగా వైసీపీలో మైనార్టీ డీఎన్ఏ లేదని కొట్టిపారేశారు. 43 సంవత్సరాల టీడీపీ చరిత్రలో ఏనాడు మత కలహాలు లేవని చెప్పారు. ఎన్‌టీఆర్ నుంచి చంద్రబాబు వరకు ముస్లిం మైనార్టీలకు జరిగిన మేళ్లను ఆయన వివరిస్తూ జగన్‌రెడ్డి ప్రభుత్వంలో గత ఐదు సంవత్సరాల కాలంలో ముస్లిం మైనార్టీలకు జరిగిన అన్యాయాలను తమ వక్ఫ్ ఆస్తుల కబ్జాలను ఆయన ప్రస్తావించారు. మైనార్టీలను ఎన్నో అన్యాయాలకు గురి చేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వంలో మైనార్టీ డీఎన్ఏ ఉన్నదని ఏ విధంగా ప్రకటిస్తున్నదని ప్రశ్నించారు. టీడీపీ- జనసేన ప్రభుత్వ హయాంలో మళ్లీ మైనార్టీలకు మంచిరోజులు రానున్నాయని చెప్పారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

భారతీనగర్, ఫిబ్రవరి 22: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని 2021-24లో ఈఈఈ(ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్) విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 1958-1976 సంవత్సరాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి, మాజీ ప్రిన్సిపాల్ వి.రావు, పూర్వ విద్యార్థులు భీమానాయక్, మధు, రాకేష్, గోపిచందు, భానుమూర్తి, ప్రకాశరావు, ఎం.వి.బాబు, శ్రీనివాసరెడ్డి, భాగ్యమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



చెన్నైలో ఉండి బతికిపోయాడు

సంగీత దర్శకుడిపై డైరెక్టర్ ఫైర్



'సిద్ధార్థ్‌రాయ్' చిత్రం షూటింగ్ నిర్ణీత సమయం లోనే పూర్తి చేశాం. కానీ సంగీత దర్శకుడు రధన్ వల్ల పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యమైంది. అవుట్ పుట్ విషయంలో నన్ను బాగా విసిగించాడు. తనతో చాలా విషయాల్లో వాగ్వివాదం జరిగింది. తను మంచి టెక్నీషియనే కానీ నన్ను మానసికంగా చిత్రవధ చేశాడు. చెన్నైలో ఉండి బతికిపోయాడు. లేకుంటే పెద్ద గొడవే జరిగేది. ఇలాంటి సంగీత దర్శకులకు 'దూరంగా ఉండాలి' అని దర్శకుడు వీ యశస్వి చిత్ర పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. ఆయన దర్శకత్వంలో దీపక్ సరోజ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన సంయుక్తంగా నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా యశస్వి మాట్లాడుతూ 'సుకుమార్‌గారికి ఈ సినిమా బాగా నచ్చి, 'నీ తర్వాత సినిమా నా బేనర్ లోనే చేస్తున్నాం' అని ప్రకటించారు. నేను ఊహించినదానికన్నా దీపక్ అద్భుతంగా నటించాడు. సిద్ధార్థ్‌రాయ్ ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఇలాంటి కథ, పాత్ర ఇప్పటివరకూ రాలేదు' అని అన్నారు. దీపక్ సరోజ్ మాట్లాడుతూ 'సిద్ధార్థ్‌రాయ్' కథ విన్నాక ఆనంద బాష్పాలు వచ్చాయి. నటుడిగా నన్ను నిరూపించుకోవచ్చని ఈ సినిమా చేశాను. ఈ సినిమా కోసం యశస్వి చాలా కష్టపడ్డారు. నా పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుందని నమ్ముతున్నాను' అని అన్నారు. ఇందులో తన పాత్ర చాలా ప్రత్యేకంగా ఉండబోతోందని కథనాయిక తన్వీ చెప్పారు.

నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్

శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి కలయికలో వచ్చిన 'బ్రోచేవారెవరురా' చిత్రం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తింది. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సెట్టయింది. ఈ చిత్రానికి 'ఓం భీమ్ బుష్' అనే ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. 'నో లాజిక్ ఓన్లీ మ్యాజిక్' అనేది ఉపశీర్షిక. 'హుషారు' ఫేమ్ శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో వీ సెల్యూలాయిడ్‌తో కలసి సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. యూవీ క్రియేషన్స్



సమర్పిస్తోంది. గురువారం మేకర్స్ ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి, మార్చి 22న సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రీతీ ముకుందన్, అయేషాఖాన్ కథానాయికలు. ఈ చిత్రానికి సంగీతం: సన్నీ ఎంఆర్. సినిమాటోగ్రఫీ: రాజ్ తోట














గీతాసారం



ఆత్మ రమణీయత

మన అంతర్గతమైన (లోపలి), బహిర్గతమైన (వెలుపలి) ప్రపంచాలకు ఇంద్రియాలు ద్వారాల్లాంటివి. కాబట్టి వాటిని అర్థం చేసుకోవాలని భగవద్గీత పదేపదే చెబుతుంది. 'ఒకటిగా పని చేసే న్యూరాన్లు (నాడీ కణాలు) ఒక్కటిగానే ముడిపడి ఉంటాయి' అని నాడీశాస్త్రం ప్రతిపాదిస్తుంది. దానినే 'హార్డ్ వైరింగ్' అంటారు. మన మెదడులో 100 బిలియన్ కోట్ల న్యూరాన్లు ఉన్నాయి. వాటిలో కొన్ని మన డిఎన్ఎ కారణంగా ముడిపడి, అసంకల్పితంగా జరిగే ప్రాథమిక దేహక్రియలకు వినియోగమవుతాయి. మరికొన్ని జీవితకాలంలో మనం చేసే కర్మల ద్వారా ముడిపడతాయి. మొదటిరోజు డ్రైవింగ్ వీల్ ముందు కూర్చున్నప్పుడు... కారు నడపడం మనకు కష్టంగా అనిపిస్తుంది. తరువాత నెమ్మదిగా దానికి అలవాటు పడతాం. ఎందుకంటే... అప్పటివరకూ వాడుకలోలేని న్యూరాన్లను మన మెదడు హార్డ్ వైరింగ్ ద్వారా జోడించి, డ్రైవింగ్‌కు సంబంధించిన అన్ని చర్యల్లో పాల్గొనేలా చేస్తుంది. దీనికి సమయం పడుతుంది. మామూలు నడక, ఆటలతో మొదలుకొని ఒక సర్జన్ జరిపే శస్త్ర చికిత్స దాకా అన్ని రకాల నైపుణ్యాల విషయంలోనూ ఇదే జరుగుతుంది. హార్డ్ వైరింగ్ మెదడు తాలూకు శక్తిని బాగా ఆదాచేస్తుంది. తద్వారా మన జీవితాలను సులభతరం చేస్తుంది. శిశువుకు అనేక పనులు చేసే సామర్థ్యం ఉంటుంది. ఆ తరువాత కుటుంబం, సహచరులు, సమాజం మధ్యలో సాగే పెంపకంలో... అనేక నాడీ బంధాలు (ప్యాటర్న్) ఏర్పడతాయి. ఈ నాడీబంధాలు బాహ్య ప్రపంచం నుంచి నిర్దిష్టమైన ప్రేరణలకు, అనుభూతులకు అలవాటు పడడం వల్ల... ఆ ప్రేరణలను, అనుభూతులను పొందడానికి మనం తీవ్రంగా కృషి చేస్తాం. ఈ అలవాట్లనే మనం 'కోరికలు' అని కూడా అనవచ్చు. మన నాడీబంధాలు పొగడ్తలను ఆశించి, ఆస్వాదిస్తాయి కాబట్టి... వాటిని వినడానికి మనం ఇష్టపడతాం. ఈ నాడీబంధాలే మనలో ఉత్పన్నమయ్యే ఆకాంక్షలకు, కలిగే దురభిప్రాయాలకు, మనలో ఏర్పడే అంచనాలకు పునాదులు. ఈ నాడీబంధాలన్నిటి కలయిక, వాటి అలవాట్ల మీద ఆధారపడే మన ప్రవర్తనలన్నిటినీ కలిపితే అదే అహంకారం. దాన్ని ఛేదించినప్పుడు మాత్రమే మనల్ని మనలో కేంద్రీకరించుకోగలం. తద్వారా బాహ్య ప్రేరణలతో నిమిత్తం లేకుండా... శాశ్వతమైన సంతోషాన్ని పొందగలం. దీన్నే శ్రీకృష్ణుడు 'ఆత్మ రమణీయత' అని చెబుతున్నాడు. గీతోపదేశం ప్రకారం జీవించడం అంటే... భగవద్గీత అందించిన అనేక సాధనాలను, నియంత్రణలను పాటించి... ఈ నాడీబంధాల నుంచి మనల్ని మనం విముక్తి చేసుకోవడమే. ఈ విధంగా విముక్తమయినప్పుడు... మన దుఃఖానికి కారణమైన విభజనల నుంచి, భేదాభిప్రాయాల నుంచి కూడా విముక్తి పొందుతాం. శాశ్వతమైన ఆనందాన్ని పొందుతాం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సందేశం




ప్రవక్త మాసం

ఇస్లాం మాసాల్లో ఎనిమిదవది షాబాన్. ఇది ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న నెల. అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో మాట్లాడుతూ "షాబాన్ నా నెల. రజబ్... అల్లాహ్ నెల. రంజాన్ నా జాతి నెల. మానవులను పాపాల నుంచి షాబాన్ మాసం దూరం చేస్తుంది. రంజాన్ పూర్తిగా పరిశుద్ధం చేస్తుంది" అని పేర్కొన్నారు. ఆయన షాబాన్ కోసం ఒక నెల రోజుల ముందు నుంచే ప్రార్థనలతో సంసిద్ధమయ్యేవారు. "ఓ అల్లాహ్! మాకు రజబ్, షాబాన్ మాసాల్లో సమృద్ధిని, శుభాలను ప్రసాదించు. రంజాన్ నెలవరకూ మమ్మల్ని చేర్చు" అని వేడుకొనేవారు. "రజబ్, రంజాన్ మాసాల మధ్య నెల షాబాన్. దాసుల పుణ్యాల వివరాలు అల్లాహ్ వద్దకు వెళ్ళేది ఈ నెలలోనే. నా కర్మ ఫలాలు అల్లాహ్ వద్దకు వెళ్ళే ఈ సమయంలో... ఉపవాస దీక్షతో ఉండడానికి నేను ఇష్టపడతాను" అని మహా ప్రవక్త తెలిపారు. ఆయన షాబాన్ మాసంలో ప్రత్యేక ఉపవాసాలు చేసేవారు. అయితే చివరి పదిహేను రోజులూ ఉపవాసాలకు మినహాయింపు ఇచ్చేవారు. "అల్లాహ్ ఈ మాసంలో శుభాలను, పుణ్యాలను సమృద్ధిగా ప్రసాదిస్తాడు. పాపాలు దూరమవుతాయి. కాబట్టి వివేకవంతుడైన విశ్వాసులు ఈ మాసాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదు" అని మహా పండితుడైన అబ్దుల్ ఖాదర్ జిలానీ స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని స్వాగతించడానికి విశ్వాసులు ఈ మాసంలో తమనుతాము సంసిద్ధులను చేసుకోవాలి. వీలైనంత ఎక్కువగా ప్రార్థనలు చేసి, దైవ సామీప్యాన్ని పొందాలి.

● మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం



విశ్వ రక్షకుడు

మనం స్నేహితుడికో, బంధువుకో ఒక మాట ఇస్తాం. మాట ఇవ్వడం సులభమే. దాన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం. అది అనేక అంశాలమీద ఆధారపడి ఉంటుంది. మాట ఇచ్చినవారు బంధుమిత్రులైతే మావల్ల కాలేదని తప్పించుకుంటారు. సొంత కుటుంబ సభ్యులైనప్పుడు... వారి మీద ఎంత ప్రేమ ఉన్నప్పటికీ... మాట నిలబెట్టుకోలేక నిస్సహాయులుగా నిలిచిపోవాల్సి ఉంటుంది. మానవ బలహీనతలు, సాధ్యాసాధ్యాలను నిర్దేశించే పరిస్థితుల ప్రభావం ఆ విధంగా ఉంటుంది. కానీ ఇచ్చిన మాట తప్పకుండా... కష్టాలు, నష్టాలు, ప్రమాదాలు సంభవించిన సమయంలో ఆదుకొనేవాడు ఒక్కడే. దేవుడు. "ఇదంతా కేవలం విశ్వాసమే కదా! దేవుడు కనిపిస్తాడా?" అనే ప్రశ్న తలెత్తవచ్చు. కానీ 'బైబిల్'లోని 'ఆదికాండం'లో ఆదాము, అబ్రహం, మోషే తదితర వ్యక్తులకు దేవుడు ప్రత్యక్షంగా కనిపించకపోయినా... ఆయన స్వరం వినిపించేది. అభయం ఇచ్చేది. వారు నిత్యం దేవుడి ఆదేశాలకు అనుగుణంగా నడుచుకొనేవారు.

"నిన్ను విడువను. నిన్ను ఎడబాయను. నీ వెనుక ఉన్నది నేనే. నీకు భయమెందుకు. నీ చేయి పట్టి నడిపించేది నేనే. నేను తప్ప నీకు మరెవ్వరున్నారు? ఆపత్కాలంలో నిన్ను ఆదుకొనేది నేనే. నీకు" అంటూ 'బైబిల్'లోని 'యెహోషువా', 'హెబ్రీ' తదితర అధ్యాయాల్లో దేవుడు ఇచ్చిన అభయం స్పష్టంగా కనిపిస్తుంది. ఆ మాటను నిలబెట్టుకోవడం కోసం, రక్షణ అందించడం కోసం దేవుడు తన కుమారుణ్ణి (ఏసు ప్రభువును) మనకు తోడుగా పంపాడు. మానవులకు ఇచ్చిన వాగ్దానాన్ని ఏసు ద్వారా దేవుడు నెరవేర్చాడు. 'నేను మీకు తోడున్నా'నని ధైర్యం చెప్పి, మనల్ని ముందుకు నడిపించేది విశ్వానికే రక్షకుడైన దైవం తప్ప మరెవ్వరు?

● డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

సహజయోగ



బ్రహ్మ చైతన్య సారథి

"మిమ్మల్ని సృష్టించిన శక్తితో మీరు అనుసంధానమయ్యేదాకా... మీ జీవిత పరమార్థాన్ని మీరు తెలుసుకోలేరు" అంటారు పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి. ఆమె ప్రవచనాలు కేవలం మాటలకే పరిమితం కాదు. ప్రచారాన్ని ఆమె కోరుకోలేదు. తాను నమ్మిన సత్యాన్ని, బోధించిన ధర్మాన్నీ స్వయంగా ఆచరించి చూపించారు. సర్వమత సౌభ్రాతృత్వం కోసం, ధర్మ సంస్థాపన కోసం దేశ, విదేశాల్లో పర్యటించి... తన బోధనలతో ఎందరికో మార్గదర్శిగా నిలిచారు. వివిధ మతాల ప్రవక్తలు ప్రవచించిన మూల సూత్రాలను కొందరు పక్కదారి పట్టిస్తున్న సమయంలో... వాటిలోని అసలు సత్యాన్ని సహజయోగ ద్వారా నిర్మలాదేవి బహిర్గతపరిచారు. ఆమె 1970 మే 5న... తన స్వీయ తపోశక్తి ద్వారా 'సహజయోగ'ను ఆవిష్కరించారు. అప్పుడే ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది.

'సహ' అంటే మనతో, 'జ' అంటే జన్మించిన శక్తి, 'యోగ' అంటే బాహ్యపరంగా ఉన్న శక్తితో కలయిక అని అర్థం. కుల, మత, జాతి, ప్రాంత, వయో, లింగ భేదాలు లేకుండా... ఎవరైనా ఎప్పుడైనా ఈ సహజయోగాన్ని అతి సునాయాసంగా ఆచరించవచ్చు. దైనందిన జీవితంలో మనం ఎదుర్కొనే శారీరక, మానసిక, భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటికీ పరిష్కారంగా... మానవుడు ఎంతో కాలం నుంచి, ఎన్నో జన్మల నుంచి అన్వేషిస్తున్న సత్యాన్ని సహజయోగ ధ్యానం ద్వారా శ్రీ మాతాజీ ఆవిష్కరించారు. దాన్ని ఎటువంటి స్వార్థ చింతనా లేకుండా మానవాళికి అందించారు. ఎవరి దగ్గరా ధనాన్ని ఆశించకుండా... తన సొంత డబ్బుతో, భర్త అందించిన సహకారంతో వివిధ దేశాలు పర్యటించి... సహజయోగాన్ని ప్రపంచవ్యాప్తంచేశారు.

'నిన్ను నువ్వు తెలుసుకో' అనేది అన్ని మతాలలోని మూల సారాంశం. అదే సత్యం. భగవంతుడనేవాడు ఎక్కడో కాదు, నీలోనే ఆత్మగా ఉన్నాడు. అదే సత్యం. ఎన్నో యుగాల, జన్మల ఈ సత్యాన్వేషణ... సహజయోగంలోని ఆత్మసాక్షాత్కారంతో ముగుస్తుంది. ప్రపంచవ్యాప్తంగా... దేశం ఏదైనప్పటికీ... సహజయోగులు హిందూ దేవతలను, అల్లాను, క్రీస్తును, బుద్ధుణ్ణి, మహావీరుణ్ణి, గురునానక్‌ను... ఇలా అన్ని మతాల దేవతలనూ సమానంగా చూస్తారు. అందరూ ఒక్కటేననే భావనతో ఆరాధిస్తారు. కులమతాలు కేవలం మానవ సృష్టి. భగవంతుడికి దానితో ఎలాంటి సంబంధం లేదు. వివిధ దేశాల యువతీ యువకులకు వివాహాలు జరిపించి... సహజయోగ వివాహాల ద్వారా వసుధైక కుటుంబ భావనను శ్రీమాతాజీ ఆచరణలో చూపించారు. ఆమె ఏర్పాటు చేసిన వివిధ సంస్థలు గొప్ప సేవలు అందిస్తున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో, అమెరికా, ఇటలీ, కెనడాలలో సహజయోగా ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్స్ పలు దేశాలకు చెందిన విద్యార్థులకు ఎలాంటి తారతమ్యాలు లేకుండా... ఆధ్యాత్మిక వాతావరణంలో, క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాయి. ముంబయి, ఢిల్లీ నగరాల్లో అంతర్జాతీయ సహజ ఆరోగ్య, పరిశోధన కేంద్రాల్లో... సహజయోగ సాధన ద్వారా అనారోగ్య సమస్యలను చక్కదిద్దుకొని, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకొనే పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. నోయిడాలోని 'నిర్మల్ ప్రేమాశ్రమం' అభాగ్య మహిళలకు, అనాథలకు ఆశ్రయం కల్పిస్తోంది. శ్రీమాతాజీ దేశమంతటా తిరిగి... విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారంగా... సహజయోగాన్ని ఉచితంగా అందించారు. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఈ కార్యక్రమం కొనసాగుతోంది. అదేవిధంగా సహజయోగ ద్వారా కలిగే వైబ్రేషన్స్‌తో... సహజమైన సాగు పద్ధతుల ద్వారా ఆరోగ్యవంతమైన పంటలను పండించి, అధిక దిగుబడిని పొందే విధానాన్ని రైతులకు ఉచితంగా బోధిస్తున్నారు. మద్యపానం, మత్తు పానీయాలు, మత్తుమందుల లాంటి వ్యసనాలను వదలాలని చెప్పడమే కాదు, సహజయోగ ద్వారా వాటిని మానడం సాధ్యమని శ్రీమాతాజీ నిరూపించారు.

ప్రతి ఒక్కరిలో సరైన పరివర్తనకు దోహదం చేసే నవ సమాజ నిర్మాణం, వసుధైక కుటుంబం, సర్వమానవ సౌభ్రాతృత్వం, ద్వేషరహితమైన, ప్రేమపూరితమైన సమాజం ఏర్పడడం సుసాధ్యమేనని సహజయోగ ద్వారా శ్రీ మాతాజీ ఆచరించి చూపించారు.. మానవాళికి సహజయోగాన్ని కానుకగా ఇచ్చిన ఆమె 2011 ఫిబ్రవరి 23న ఈ లోకంలో తన అవతారాన్ని చాలించారు. ఆ రోజును ప్రపంచవ్యాప్తంగా ఉన్న సహజయోగ కేంద్రాలలో ప్రతి సంవత్సరం 'ప్రపంచ బ్రహ్మ చైతన్య దినోత్సవం'గా ఆమె మార్గాన్ని అనుసరించేవారు నిర్వహిస్తారు.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

మానవత్వం అంటే...

ఈ జీవితం ఒక కానుక. ఇది పదేపదే లభించేది కాదు. ఈ జీవితం తాలూకు పరిపూర్ణ ప్రయోజనాన్ని మనం పొందాలి. మీలాంటివారు ఎందరో ఉండవచ్చు, కానీ మీ చిరునవ్వు మీకు మాత్రమే సొంతం. అలాగే మీ వేదన కూడా మీకు మాత్రమే ప్రత్యేకం. మీకు సంబంధించిన ప్రతీదీ మీకే ప్రత్యేకమైనది. కానీ మీరు దేనికోసం జీవిస్తున్నారు? ఉన్నదాని కోసమా? లేనిదాని కోసమా?

'శాంతికి మూలం నాలోనే ఉంది' అనేది గుర్తించేవరకూ ఆ మూలశక్తితో మనం అనుబంధాన్ని ఏర్పరచుకోలేం. అది ఏనాడైతే మనలో ప్రస్ఫుటం అవుతుందో... అప్పుడు అందరికోసం ఒక చక్కని వాతావరణం ఏర్పడుతుంది. అప్పుడు మనం కూడా మన సంతోషాలను ఇతరులతో పంచుకోవడానికి సిద్ధమవుతాం. ఈ ప్రపంచంలో రెండు రకాల మనుషులు ఉంటారు. ఒక రకమైన వ్యక్తులతో మనం ఒక్క నిమిషం కూడా గడపలేం. రెండో రకం వారితో ఉన్నప్పుడు మనకు ఆనందం, సంతోషం కలుగుతుంది. మనలోని ప్రతి ఒక్కరూ తోటివారికి కాస్త సంతోషం, కాస్త ఆనందం ఇచ్చేలా మారిపోతే ఎంతో బాగుంటుంది కదా!

చింతన




ఒక రోజు నేను బస్టాప్ సమీపంలో ఉన్నాను. అక్కడ బస్సు ఆగింది. అది ఎక్కాలని ఒక వృద్ధుడు పరిగెడుతూ వస్తున్నాడు. అతను ఆ బస్సు ఎక్కలేకపోయాడు. అంతలో బస్సు నెమ్మదిగా కదిలి, వేగం అందుకుంది. ఆ వృద్ధుడు వేగంగా పరిగెత్తడానికి ప్రయత్నించినా, దాన్ని అందుకోలేకపోయాడు. ఏదో విధంగా డ్రైవర్ దగ్గరకు వెళ్ళి, బస్సు ఆపాలని నేను చెప్పాలనుకున్నాను. ఇంతలో మోటార్ సైకిల్ మీద ఎవరో అబ్బాయి వచ్చాడు. బస్సును గట్టిగా తట్టి "ఒక ప్రయాణికుడు బస్సు ఎక్కలేకపోయాడు. వెనుక నుంచి పరిగెత్తుకుంటూ వస్తున్నాడు. చూడండి" అని చెప్పాడు. డ్రైవర్ వెంటనే బస్సు ఆపాడు. వృద్ధుడు బస్సు ఎక్కాడు. ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు.

అతను కృతజ్ఞతలు కోరుకోలేదు. "నాకు కృతజ్ఞతలు చెప్పలేదేం?" అని ఆ వృద్ధుణ్ణి వెంబడించి అడగలేదు. మనం దేవదూతల గురించి మాట్లాడుకుంటాం. ఆ అబ్బాయి కూడా దేవదూత లాంటివాడే. అతి కష్టమైన పనిని సులభతరం చేశాడు. ఎక్కడి నుంచి వచ్చాడో తెలీదు. తిరిగి ఎటు వెళ్ళాడో కనిపించలేదు. నేను చూస్తూ ఉండగానే మాయమైపోయాడు. అతను ప్రత్యేకమైన మనిషిలా కూడా కనిపించలేదు. కానీ మానవ రూపంలో వచ్చిన దేవదూతలా... ఒక చిన్న పని చేసి వెళ్ళిపోయాడు. మనమందరం అలా చెయ్యగలం. దీనికోసం మనకు ఎలాంటి శిక్షణ అవసరం లేదు. తోటివారికి ఏదో విధంగా సాయం చెయ్యడం చాలా గొప్ప విషయం. కానీ దాని గురించి మనం ఏమాత్రం పట్టించుకోం. కానీ మానవత్వం అంటే అదే. మానవత్వం అంటే తెలుసుకోనంతవరకూ మనిషి దాన్ని ప్రదర్శించలేడు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు, ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు మనం తోటివారికి ఎంతో కొంత సాయం చెయ్యగలమని గుర్తించడం చాలా ముఖ్యం. ఈ ప్రపంచంలో మానవులు పుట్టడం, గిట్టడం అనేది వేల ఏళ్ళ నుంచీ జరుగుతోంది. మనం ఒకరికోసం ఒకరం ఏం చెయ్యగలం? అనేదే ప్రధానం. కాస్తంతైనా చేయూత అందించగలగడం ముఖ్యం. ఇవన్నీ చిన్నచిన్న విషయాలే. కానీ వాటిని గుర్తుంచుకోవడం చాలా అవసరం.



ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

హరేకృష్ణ



సింహగురు

హరినామ సంకీర్తనోద్యమాన్ని ప్రారంభించి, ఎలాంటి తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరికీ కృష్ణ ప్రేమను పంచిపెట్టిన మహాత్ముడు శ్రీ చైతన్య మహా ప్రభువు. శ్రీ చైతన్యులు నిష్క్రమించిన అనంతరం ఆయన సంప్రదాయం ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంది. ఆయన బోధనలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. అపసంప్రదాయాలు చోటుచేసుకోసాగాయి. ఆ సమయంలో అవతరించిన శ్రీల భక్తి వినోద ఠాకూర్... శ్రీ చైతన్యుల మార్గాన్ని పునఃస్థాపించారు. ఒడిశా రాష్ట్రంలోని జగన్నాథపురి పట్టణ మేజిస్ట్రేట్‌గా పని చేసిన ఆయన వందకు పైగా గ్రంథాలు రాశారు. మరెన్నో రచనలతో శ్రీ చైతన్య సిద్ధాంతసారానికి ప్రామాణికతను స్థాపించారు. ఒక శక్తిమంతమైన భగవత్‌తత్త్వ ప్రబోధకుణ్ణి తనకు పుత్రుడిగా ప్రసాదించమని శ్రీ చైతన్యులను ఆయన నిత్యం ప్రార్థించేవారు. ఆ ప్రార్థనల ఫలితంగా ఆయనకు 1874 ఫిబ్రవరి 6న... పూరీ జగన్నాథ క్షేత్రంలో ఒక కుమారుడు జన్మించాడు. పుట్టిన పిల్లవాడి బొడ్డు ప్రేగు జంధ్యంలా దేహంపై అల్లుకోవడం చూసి... అందరూ ఆశ్చర్యపోయారు. ఆ బాలుడికి బిమలదత్త ప్రసాద్‌గా తల్లితండ్రులు నామకరణం చేశారు.

ఆరు మాసాల తరువాత జగన్నాథ రథోత్సవంలో... వందలమంది లాగుతున్న రథం భక్తి వినోద ఠాకూర్ ఇంటి ముందు ఆగిపోయింది. బిమలప్రసాద్‌ను జగన్నాథుడి ఆశీర్వాదం కోసం అతని తల్లి రథం పైకి తీసుకువెళ్ళి, స్వామి పాదాల దగ్గర ఉంచగా... స్వామి మెడలోని పూలమాల ఆ పిల్లవాణ్ణి చుట్టుముట్టి నేలపై వాలింది. అది చూసిన బిమలదత్తుడి తల్లితండ్రులు... తమ బిడ్డ కచ్చితంగా జగన్నాథుని వరప్రసాదమేనని నిర్ధారించుకున్నారు. భక్తివినోదుల ఇంట బిమల ప్రసాద్‌గా వెలసిన ఆ ఆణిముత్యమే... బ్రహ్మ-మధ్వ-గౌడీయ వైష్ణవ సంప్రదాయ పరంపరలో 31వ ఆచార్యులైన శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్. తన చిన్న వయసులో... భగవంతుడి నివేదనకై ఉంచిన మామిడి పండును బిమలప్రసాద్ తిన్నాడు. అది అపరాధమని తండ్రి హితవు చెబుతూ, స్వల్పంగా మందలించారు. ఆనాటి నుంచి బిమలప్రసాద్ జీవితాంతం మామిడి పండ్లను తినడం మానేశారు. బాల్యంలో చేసిన చిన్న తప్పిదం విషయంలో తీసుకున్న ఈ నిర్ణయం... ఆయన దృఢ సంకల్పానికి నిదర్శనం. ఎవరైనా మామిడి పండు సమర్పిస్తే "నేను అపరాధిని. ఆ పండు తినలేను" అంటూ సున్నితంగా తిరస్కరించేవారు.

పదేళ్ళ వయసులో తండ్రి నుంచి హరేకృష్ణ, నృసింహ మంత్రోపదేశాల్ని ఆయన పొందారు. తండ్రి సూచన మేరకు నవద్వీపంలోని ప్రఖ్యాత వైష్ణవ సాధువైన శ్రీల గౌర కిశోర దాస బాబాను గురువుగా స్వీకరించి, దీక్ష పొందారు. అప్పటి నుంచి తండ్రితో పలు తీర్థస్థలాలను సందర్శిస్తూ... 'వైష్ణవ మంజూష' అనే గ్రంథాన్ని రచించారు. అనంతరం పూరీ క్షేత్రంలో శ్రీమద్భాగవతంపై ప్రవచనాలు ప్రారంభించారు. నిర్భయంగా, బలమైన వాదనలతో తత్త్వోపన్యాసాలను చేసే సామర్థ్యం సరస్వతీ ఠాకూరుకు 'సింహగురు' అనే బిరుదు తెచ్చి పెట్టింది. భారతదేశంతోపాటు బర్మా (మయాన్మార్), బ్రిటన్, జర్మనీ దేశాల్లో మొత్తం 64 గౌడీయ మఠాలను ఆయన స్థాపించారు. నవద్వీపంలో భూస్థాపితమైన శ్రీచైతన్యుల జన్మస్థలాన్ని వెలికి తీసి, ధనలాలసులైన వారి వ్యతిరేకతను ఎదుర్కొని పునర్నిర్మించారు. మద్రాసు, కృష్ణనగర్, కోల్‌కతాల్లో 'బృహత్ మృదంగాలు'గా పేర్కొనే మూడు ముద్రణాలయాల ద్వారా శ్రీ గౌరంగ మహా ప్రభువు బోధలపై పుస్తకాలను, పత్రికలను ప్రచురించి, ప్రచారం సాగించారు. మొత్తం 61 గ్రంథాలను ఆయన రచించారు. ఎనిమిది పత్రికలను ప్రచురించేవారు. 1914లో తండ్రి భక్తివినోదుల నిష్క్రమణతో... శ్రీ చైతన్యుల సంకీర్తనోద్యమాన్ని ముందుకు కొనసాగించే బాధ్యత పూర్తిగా సరస్వతీ ఠాకూర్ పైన పడింది. ఆధ్యాత్మిక జీవనానికి భౌతిక అర్హతలేవీ లేవని ఆయన వాదించేవారు. కుల, మత, ప్రాంత, లింగ భేదాలేవీ పరిగణించకుండా... వ్యక్తిలో ఆధ్యాత్మిక జీవనంపై ఉన్న ఆసక్తికే ప్రాధాన్యతనిచ్చి... దీక్షను ప్రసాదించేవారు. భగవత్ సందేశ ప్రచారానికి ఆయన ఎన్నో వినూత్న మార్గాలను అవలంబించారు. జీవితంలోని చివరి క్షణం వరకూ శ్రీకృష్ణ భక్తియుత సేవల్లో, శాస్త్ర ప్రబోధనల్లో ఆయన గడిపారు. 1936 డిసెంబర్ 31న... 62 ఏళ్ళ వయసులో... పూరీ క్షేత్రంలో... ఈ లోకాన్ని వీడి శ్రీ కృష్ణ సన్నిధానాన్ని చేరుకున్నారు. ఎటువంటి బేధాలు లేకుండా ప్రజలందరూ భగవన్నామాలను జపించాలనేదే ఆయన ప్రధాన సందేశం. నిత్య సాధన కోసం 'హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే/ హరే రామ హరే రామ రామ రామ హరే హరే' మహా మంత్రాన్ని ఆయన లోకానికి అందించారు.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

గురువు- దొంగ

ఒక గ్రామానికి కొంత దూరంలో ఒక జెన్ గురువు ఉండేవాడు. ఆయన చిన్న గుడిసెలో నివసించేవాడు. రోజూ ఆ గ్రామానికి వచ్చి భిక్షాటన చేసేవాడు. తన ఆకలి తీరడానికి సరిపోయే పదార్థాలు మాత్రమే తీసుకొనేవాడు. సొమ్ము దొరికితే ఎవరికైనా ఇచ్చేసేవాడు. తన గుడిసెకు వెళ్ళి ఆ ఆహారం తిని, విశ్రమించేవాడు. ఒక రోజు ఆయన రాత్రి నిద్రపోతూ ఉండగా... అతని గుడిసెలోకి ఒక దొంగ ప్రవేశించాడు. అక్కడ ఒక చిన్న దీపం వెలుగుతోంది. ఆ గుడ్డి వెలుగులోనే... ఏవైనా విలువైన వస్తువులు దొరుకుతాయేమోనని వెతుకుతున్నాడు.

ఈలోగా గురువు మేలుకున్నాడు. తన గుడిసెలోకి దొంగ వచ్చాడని అర్థమయింది. "అయ్యో పాపం! ఇంత చీకటిలో, ఇంత చలిలో ఎంతో దూరం నడిచి వచ్చాడు. నా గుడిసెలో కనీసం తిండి గింజలు కూడా లేవు. ఏమీ ఇవ్వలేకపోతున్నాను" అని బాధ పడుతూ... అటూ ఇటూ కదిలాడు.

ఇది గమనించిన దొంగ ఆయన దగ్గరకు వచ్చి గురువు ముఖంలోకి చూశాడు. ఆయన కళ్ళ నుంచి నీరు కారుతోంది. "నేను దొంగననీ, దొంగతనానికి వచ్చాననీ అర్థమయిందా? మీరు ఎందుకు ఏడుస్తారు? బాధపడకండి. నేను ఏవీ తీసుకుపోను. హాయిగా నిద్రపోండి" అన్నాడు దొంగ జాలిగా.

అప్పుడు గురువు అతని రెండు చేతులనూ పట్టుకొని "నా దుఃఖానికి కారణం అదికాదు నాయనా! నువ్వు ఇంత చలిలో, ఎంతో కష్టపడి ఇంత దూరం వస్తే... ఏమీ ఇవ్వలేకపోతున్నానని విచారంగా ఉంది. నువ్వు ఉత్త చేతులతో వెనక్కి వెళ్ళడం బాగుండదు. దయచేసి ఇదిగో... ఈ దుప్పటి తీసుకుపో. కాదనకు" అంటూ కన్నీరు తుడుచుకున్నాడు గురువు.

అవి పైపై మాటలు కావనీ, ఆయన హృదయం లోతులనుంచి వస్తున్నాయనీ దొంగ గమనించాడు. ఆ గురువుకు ఉన్నది ఒకే దుప్పటి. ఒంటిమీద సరైన దుస్తులు కూడా లేవు. బాగా చలి వేస్తోంది. ఆ దుప్పటి తీసుకోవడానికి దొంగకు మనసు ఒప్పుకోలేదు. కానీ దాన్ని తీసుకోవాలని ఆయన మనస్ఫూర్తిగా ప్రాధేయపడుతున్నాడు. ఆ దొంగ కాదనలేకపోయాడు. అతను దుప్పటి తీసుకొని వెళ్తూ ఉండగా గురువు ఆ దొంగతో "అయ్యా! మరొక్కసారి రండి. ఒక రోజు ముందు తెలియజెయ్యండి. ఎంతో కొంత విలువైన వస్తువును తెచ్చి ఉంచుతాను" అన్నాడు.

దొంగ వెళ్ళిపోయాడు. గురువు సంతోషంగా నిద్రపోయాడు.

మళ్ళీ ఇలా జరుగకూడదని గురువు భావించాడు. ఏరోజుకారోజు భిక్షగా వచ్చిన డబ్బును ఇదివరకటిలా పూర్తిగా దానాలు చెయ్యకుండా, కొంత మొత్తం దాచడం మొదలుపెట్టాడు. ఆ సొమ్మును చిన్న కుండలో పెట్టి, గుడిసెలో ఒక మూల ఉంచాడు.

ఒక రోజు రాత్రి ఇంకో దొంగ వచ్చాడు. గురువును చూసి అతను జంకుతూ తిరిగి వెళ్ళబోయాడు. అప్పుడు గురువు "మిత్రమా! ఇటురా. ఆ మూల కుండలో కొంత డబ్బు ఉంది. దాన్ని తీసుకుపో. అంతకన్నా ఎక్కువ ఇవ్వనందుకు నన్ను క్షమించు" అన్నాడు.

దొంగ ఆ సొమ్ము తీసుకొని బయటకు నడుస్తున్నాడు.

"ఇదిగో ఇలా చూడు! ఆ సొమ్ము ఇచ్చినందుకు కృతజ్ఞతలైనా చెప్పకపోతే ఎలా?" అన్నాడు గురువు.

దొంగ కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మరోచోట దొంగతనం చేస్తూ అతను దొరికిపోయాడు. అతణ్ణి న్యాయాధికారి ముందు రక్షకభటులు నిలబెట్టారు. గురువు సొమ్మును కూడా అతను తీసుకున్నట్టు విచారణలో తేలింది. గురువును న్యాయస్థానానికి పిలిపించారు. దొంగను చూపిస్తూ "ఇతను మీ సొమ్ము దొంగిలించాడు కదా!" అని ప్రశ్నించారు.

అప్పుడు గురువు వాళ్ళతో "ఇతను నాకు తెలుసు. ఒక రాత్రి నాకు అతిథిగా వచ్చాడు. అతను నా సొమ్ము దొంగిలించలేదు. నా విన్నపాన్ని మన్నించి తీసుకువెళ్ళాడు. పైగా దాన్ని ఇచ్చినందుకు నాకు కృతజ్ఞతలు కూడా తెలిపాడు" అని చెప్పాడు. దొంగను న్యాయస్థానం విడిచిపెట్టింది. అతనిలో పరివర్తన కలిగింది. ఆ గురువుకు శిష్యుడిగా మారిపోయాడు. శిక్షలతోనో, బోధనలతోనో కాకుండా చిన్న చర్యతో పరివర్తన తేవచ్చుననడానికి ఇదొక ఉదాహరణ.

● రాచమడుగు శ్రీనివాసులు

జెన్ కథ



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/umpwITGలో చదవండి.

అమ్మాయిల ధనాధన్



నేటినుంచే డబ్ల్యూపీఎల్
తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ ఢీ

రాత్రి 8 గం. నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

షెడ్యూల్

ఫిబ్రవరి 23	ముంబై x ఢిల్లీ
ఫిబ్రవరి 24	బెంగళూరు x యూపీ
ఫిబ్రవరి 25	గుజరాత్ x ముంబై
ఫిబ్రవరి 26	యూపీ x ఢిల్లీ
ఫిబ్రవరి 27	బెంగళూరు x గుజరాత్
ఫిబ్రవరి 28	ముంబై x యూపీ
ఫిబ్రవరి 29	బెంగళూరు x ఢిల్లీ
మార్చి 1	యూపీ x గుజరాత్
మార్చి 2	బెంగళూరు x ముంబై
మార్చి 3	గుజరాత్ x ఢిల్లీ
మార్చి 4	యూపీ x బెంగళూరు
మార్చి 5	ఢిల్లీ x ముంబై
మార్చి 6	గుజరాత్ x బెంగళూరు
మార్చి 7	యూపీ x ముంబై
మార్చి 8	ఢిల్లీ x యూపీ
మార్చి 9	ముంబై x గుజరాత్
మార్చి 10	ఢిల్లీ x బెంగళూరు
మార్చి 11	గుజరాత్ x యూపీ
మార్చి 12	ముంబై x బెంగళూరు
మార్చి 13	ఢిల్లీ x గుజరాత్
మార్చి 15	ఎలిమినేటర్
మార్చి 17	ఫైనల్

గమనిక: (తొలి 11 మ్యాచ్‌లు బెంగళూరులో, ఆ తర్వాత మ్యాచ్‌లన్నీ ఢిల్లీలో జరుగుతాయి. ఆరంభ మ్యాచ్ రా. 8 గంటలకు, మిగతా మ్యాచ్‌లన్నీ రాత్రి 7.30కు మొదలవుతాయి)

బెంగళూరు: యువ క్రికెటర్లను వెలికితీయడమే లక్ష్యంగా రూపుదిద్దుకొన్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో అంచెకు శుక్రవారం తెరలేవనుంది. సీజన్ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్, హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై ఇండియన్స్‌తో గతేడాది రన్నరప్, మెగ్ లానింగ్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనుంది. గతేడాది ముంబైలో జరిగిన తొలి అంచె పోటీల్లో విదేశీ ప్లేయర్లే ఎక్కువగా ఆకట్టుకొన్నారు. అయితే, ఈసారి మాత్రం భారత యువ క్రికెటర్లు వెలుగులోకి వస్తారనే అంచనాలున్నాయి. ఈ సీజన్‌లో బెంగళూరు, ఢిల్లీ వేదికలుగా లీగ్ జరగనుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ మెగ్ లానింగ్ గత ఎడిషన్‌లో అత్యధిక పరుగులు సాధించగా.. వెస్టిండీస్‌కు చెందిన ముంబై బౌలర్ హేలీ మాథ్యూస్ 16 వికెట్లతో పర్పుల్ క్యాప్ సొంతం చేసుకొంది. కానీ, భారత ప్లేయర్లు మాత్రం తమదైన ముద్ర వేయడంలో తడబడ్డారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున ఆడిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ శ్రేయాంక పాటిల్ మాత్రమే ప్రతిభను చాటగలిగింది. కాగా, యువ ప్లేయర్ల గురించి ఎంత చర్చ నడిచినా.. స్టార్ ప్లేయర్లు స్మృతి మంధాన, ఎలిస్ పెర్రీ, సోఫియా డివైన్ లాంటి వాళ్లు లీగ్‌కు ప్రధాన ఆకర్షణ కానున్నారు.





కాష్వీ దూరం: వేలంలో భారీగా రూ. 2 కోట్లతో అదరహో అనిపించిన అన్‌క్యాప్డ్ ప్లేయర్ కాష్వీ గౌతమ్ (గుజరాత్ జెయింట్స్) గాయంతో ఈసారి లీగ్‌కు దూరమవడం ఆ జట్టుకు నిరాశే. బౌలర్ టిటాస్ సాధుతోపాటు అన్‌క్యాప్డ్ బృందా దినేష్ (యూపీ వారియర్స్)పై భారీ అంచనాలున్నాయి. ఆసియా క్రీడల ఫైనల్లో సాధు అద్భుత ప్రదర్శనతో లంకపై భారత్ గెలిచింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ తరఫున ఆడుతున్న టిటాస్‌పై ఆ జట్టుకు భారీ ఆశలున్నాయి. బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన ఈసారి తన జట్టును విజేతగా నిలపాలనే పట్టుదలతో ఉండగా.. అత్యుత్తమ బ్యాటర్లయిన హీలీ, చమరి ఆటపట్టుతోపాటు బిగ్‌బాష్ అనుభవమున్న దీప్తి శర్మతో యూపీ బలంగా కనిపిస్తోంది. ముంబై సారథి హర్మన్‌ప్రీత్ బ్యాటింగ్‌పై కూడా భారీ అంచనాలున్నాయి. అనుభవానికి యువరక్తం తోడవడంతో ఈసారి లీగ్ మరింత మజాగా సాగే అవకాశం ఉంది. ఐదు జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ఫైనల్, ఎలిమినేటర్ సహా మొత్తం 22 మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 17న జరిగే ఫైనల్‌తో లీగ్ ముగియనుంది.

హైదరాబాద్, వైజాగ్‌లో రెండేసి మ్యాచ్‌లు

మార్చి 22 నుంచి ఐపీఎల్

- ఆరంభ మ్యాచ్‌లో చెన్నైతో బెంగళూరు ఢీ
- తొలి 17 రోజుల షెడ్యూల్ విడుదల

ఐపీఎల్ తొలి విడత షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక	సమయం
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై	రా. 8
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	మొహాలి	మ. 3.30
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా	రా. 7.30
మార్చి 24	రాజస్థాన్ X లఖ్‌నవూ	జైపూర్	మ. 3.30
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్	రా. 7.30
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు	రా. 7.30
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై	రా. 7.30
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్	రా. 7.30
మార్చి 28	రాజస్థాన్ X ఢిల్లీ	జైపూర్	రా. 7.30
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు	రా. 7.30
మార్చి 30	లఖ్‌నవూ X పంజాబ్	లఖ్‌నవూ	రా. 7.30
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్	మ. 3.30
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	విశాఖపట్నం	రా. 7.30
ఏప్రిల్ 1	ముంబై X రాజస్థాన్	ముంబై	రా. 7.30
ఏప్రిల్ 2	బెంగళూరు X లఖ్‌నవూ	బెంగళూరు	రా. 7.30
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	విశాఖపట్నం	రా. 7.30
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్	రా. 7.30
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్	రా. 7.30
ఏప్రిల్ 6	రాజస్థాన్ X బెంగళూరు	జైపూర్	రా. 7.30
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై	రా. 3.30
ఏప్రిల్ 7	లఖ్‌నవూ X గుజరాత్	లఖ్‌నవూ	రా. 7.30



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్‌ను భారత్‌లోనే నిర్వహిస్తారా? లేక విదేశాలకు తరలిస్తారా? అనే సస్పెన్స్‌కు తెరపడింది. అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్న మెగా లీగ్ షెడ్యూల్‌ను బీసీసీఐ గురువారం విడుదల చేసింది. అయితే, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పాక్షికంగా అంటే.. తొలి 17 రోజులకు (మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 వరకు) సంబంధించిన మ్యాచ్‌ల తేదీలను మాత్రమే ప్రకటించింది. అయితే, ఫైనల్ మే 26న నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల కమిషన్ పోలింగ్ తేదీలను ప్రకటించిన తర్వాత ప్రభుత్వం, పోలీసులతో సమన్వయం చేసుకొని రెండో దశ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు బీసీసీఐ తెలిపింది. వచ్చే నెల 22న చెన్నైలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ప్రకటిత షెడ్యూల్‌లో 10 నగరాల్లో జరిగే 21 మ్యాచుల్లో ప్రతి జట్టూ 3 నుంచి 5 మ్యాచ్‌లు ఆడనుంది. 2009లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్‌ను దక్షిణాఫ్రికాలో నిర్వహించగా.. 2014 ఎడిషన్‌ను యూఏఈలో ఆడించారు. అయితే, 2019లో ఎన్నికలు జరిగినా భారత్ నుంచి తరలించలేదు. తొలి వారాంతంలో జరిగే డబుల్ హెడర్‌లో పంజాబ్‌తో ఢిల్లీ, కోల్‌కతాతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. కాగా, తొలి దశలో జరిగే రెండు మ్యాచ్‌లకు విశాఖపట్నంను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు తమ హోంగ్రౌండ్‌గా ఎంపిక చేసుకొంది. ప్రస్తుతం డబ్ల్యూపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం పిచ్ కొంత పాడయ్యే అవకాశం ఉండడంతో క్యాపిటల్స్ ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం. దీంతో సాగర తీరం వైజాగ్‌లో మార్చి 31న చెన్నైతో, ఏప్రిల్ 3న కోల్‌కతాతో ఢిల్లీ ఆడనుంది. సన్‌రైజర్స్ ఉప్పల్ వేదికగా మార్చి 27న ముంబై, ఏప్రిల్ 5న సీఎస్‌కేతో తలపడనుంది. ఈ సీజన్‌లో మొత్తం 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతి జట్టు 14 మ్యాచ్‌లు ఆడనుండగా.. తమ గ్రూప్‌లోని మిగతా నాలుగు జట్లతో రెండేసిసార్లు తలపడనుంది. మరో గ్రూప్‌లోని నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్, ఐదో టీమ్‌తో రెండుసార్లు ఆడనుంది. ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యా పగ్గాలు చేపట్టడం ఈ సీజన్ విశేషం. ఇక, గత సీజన్‌లో చెన్నైను విజేతగా నిలిపిన ధోనీ.. ఏడాది తర్వాత మళ్లీ అభిమానుల ముందుకు రానున్నాడు.

ఐపీఎల్‌కు షమి దూరం



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో గత సీజన్ రన్నరప్ గుజరాత్ టైటాన్స్‌కు గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ మహ్మద్ షమికి గాయం తిరగబెట్టడంతో ఐపీఎల్‌కు దూరం కానున్నట్టు సమాచారం. షమి చీలమండకు సర్జరీ చేయించాల్సిన అవసరం ఉందని, త్వరలోనే అతను లండన్‌కు వెళ్లనున్నట్టు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కారణంగానే షమి లీగ్‌లో ఆడకపోవచ్చని తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని బీసీసీఐ, గుజరాత్ టైటాన్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. తమ జట్టును వరుసగా రెండుసార్లు ఫైనల్‌కు చేర్చిన షమి లేకపోవడంతోపాటు హార్దిక్ ముంబై కెప్టెన్‌గా మారడం కూడా గుజరాత్‌కు ఎదురుదెబ్బే అనుకోవాలి. 2022లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన గుజరాత్ అదే ఏడాది విజేతగా నిలిచింది. ఇక, గతేడాది రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర అమీతుమీ
నేటి నుంచి రంజీ క్వార్టర్‌ఫైనల్స్

ఇండోర్: లీగ్ దశలో మెరుగైన ప్రదర్శన చేసిన ఆంధ్ర జట్టు.. రంజీ నాకౌట్ సమరానికి సిద్ధమైంది. శుక్రవారం నుంచి జరిగే క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌తో తలపడనుంది. ఆంధ్ర గ్రూప్-బిలో ముంబై తర్వాత రెండో స్థానంలో నిలిచి రౌండ్-8కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న ఆంధ్ర.. లీగ్ దశలో వరుసగా మూడు విజయాలు సాధించింది. రికీ భుయ్ పరుగుల వరద పారిస్తుండగా.. హనుమ విహారి తన స్థాయికి తగ్గ ఆటను ఇంకా ప్రదర్శించలేదు. మరోవైపు గ్రూప్-డి టాపర్‌గా మధ్యప్రదేశ్ నాకౌట్ బెర్త్‌ను పట్టేసింది. మిగిలిన క్వార్టర్స్ మ్యాచ్‌లో బరోడాతో ముంబై, విదర్భతో కర్ణాటక, సౌరాష్ట్రతో తమిళనాడు తలపడనున్నాయి.

సిరీస్‌పైనే గురి

ఇంగ్లండ్‌తో భారత్ నాలుగో టెస్టు నేటి నుంచి
పేసర్ ఆకాశ్‌దీప్‌నకు చాన్స్!


ఉ. 9.30 నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో..



రాంచీ: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1తో తిరుగులేని ఆధిక్యంలో ఉంది. ఇక సిరీస్‌ను దక్కించుకునేందుకు మన జట్టుకిదే అద్భుత చాన్స్. ఈనేపథ్యంలో శుక్రవారం నుంచి జరిగే నాలుగో టెస్టులో రోహిత్ సేన విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఇంగ్లండ్‌కు సిరీస్‌లో నిలిచే చాన్స్ ఇవ్వకుండా రాంచీలోనే నెగ్గి వరుసగా 17వ సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అటు స్టోక్స్ సేన మాత్రం వరుసగా రెండు ఓటములతో తీవ్ర ఒత్తిడిలో పడిపోయింది. వారికిది కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్. లేకపోతే సిరీస్ గల్లంతవుతుంది. రాజ్‌కోట్‌లో 434 రన్స్ తేడాతో ఓడడంతో ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అయినా కోచ్ మెకల్లమ్ మాత్రం తమ దూకుడు తగ్గదని స్పష్టం చేశాడు.

సిరాజ్‌దే పేస్ బాధ్యత: ఫామ్‌లో ఉన్న పేసర్ బుమ్రాకు నాలుగో టెస్టులో విశ్రాంతినిచ్చారు. దీంతో సిరాజ్‌పైనే పేస్ భారం పడనుంది. కానీ అతను షార్ట్ పిచ్ బంతులు వేస్తూ ఇంగ్లండ్ బ్యాటర్లను ఇబ్బందిపెట్టాలనుకుంటున్నాడు. అయితే బుమ్రా మాదిరి లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడితేనే ప్రయోజనం ఉంటుంది. మరోవైపు రెండో పేసర్ విషయంలో ముకేశ్, ఆకాశ్ దీప్‌మధ్య పోటీ నెలకొంది. రంజీల్లో బెంగాల్ తరఫున ఆకాశ్ మెరుగ్గా ఆడాడు. అలాగే ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడిన రెండు అనధికార టెస్టుల్లోనూ 10 వికెట్లు తీశాడు. ఆకాశ్ ఓవరాల్‌గా 30 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 104 వికెట్లు తీశాడు. దీంతో ముకేశ్‌కన్నా సెలెక్టర్లు ఆకాశ్‌వైపే మొగ్గు చూపవచ్చు. బ్యాటింగ్‌లో యశస్వీ జైస్వాల్, సర్ఫరాజ్, గిల్ అదరగొడుతున్నారు. రజత్‌కు మరో చాన్స్ దక్కొచ్చు. కొత్త కీపర్ ధ్రువ్ జురెల్ కూడా ఆకట్టుకుంటున్నాడు. స్పిన్నర్లు జడేజా, అశ్విన్, కుల్దీప్ తుది జట్టులో కొనసాగనున్నారు.

ఎలా ఆడాలి?: న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, ఆస్ట్రేలియాలపై విజయాలతో భారత్‌ను కూడా బెదరగొడదామనుకున్న ఇంగ్లండ్ బజ్‌బాల్‌కు ఇక్కడ బ్రేకులు పడ్డాయి. క్రాలే, డకెట్ మాత్రమే స్ట్రోక్‌ప్లేతో ఆకట్టుకుంటున్నారు. సీనియర్లు రూట్, బెయిర్‌స్టో భారంగా మారారు. అటు స్టోక్స్ రాణించడం లేదు. భారత బౌలర్ల ధాటికి బజ్‌బాల్ ఆట ఫలితం ఇవ్వడం లేదు. ఈనేపథ్యంలో నాలుగో టెస్టులో వీరి ఆట ఎలా సాగుతుందో చూడాల్సిందే. పేసర్ ఉడ్ స్థానంలో ఒలీ రాబిన్సన్‌ను తీసుకున్నారు.



ఇలాంటి పిచ్‌ను చూడలేదు

'రాంచీ వికెట్‌ను అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉంది. ఇలాంటి పిచ్‌ను ముందెన్నడూ చూడలేదు. దూరం నుంచి చూస్తే పచ్చికగా కనిపిస్తున్నా.. దగ్గరికి వెళితే మరోలా ఉంది. అక్కడక్కడా పగుళ్లు కూడా ఉన్నాయి. దీంతో ఇక్కడ ఎలా ఆడాలో అర్థం కావడం లేదు' - బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్ కెప్టెన్)

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వీ, గిల్, రజత్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, కుల్దీప్, సిరాజ్, ఆకాశ్/ముకేశ్.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, స్టోక్స్ (కెప్టెన్), ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.

పిచ్

తొలి రెండు రోజులు పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. ఆ తర్వాత టర్న్ అయ్యే చాన్స్ ఉందని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ అన్నాడు.

ఆసియా కప్ ఫైనల్లో ధీరజ్ బృందం



బాగ్దాద్: ఆసియా కప్ లెగ్ 1 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్ రెండు విభాగాల్లో ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఈ టోర్నీలో ఓవరాల్‌గా భారత ఆర్చర్లు ఆరు టీమ్ ఈవెంట్లలో ఫైనల్ చేరి పతకాలు ఖాయం చేశారు. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, ప్రవీణ్, తరుణ్‌దీప్‌లతో కూడిన భారత జట్టు ఆతిథ్య ఇరాక్‌ను ఓడించి బంగ్లాదేశ్‌తో ఫైనల్ ఫైట్‌కు సిద్ధమైంది. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్, సిమ్రన్‌జీత్ ద్వయం సిరియా, కతార్ జట్లపై గెలిచి ఫైనల్ చేరింది. మహిళల రికర్వ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో దీపికా కుమారి, స్రిమన్‌జీత్, భజన్ కౌర్‌లతో కూడిన భారత బృందం.. ఇరాక్‌ను ఓడించింది. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్ సెమీస్‌లో ప్రథమేష్, ప్రియాన్ష్, కుశాల్‌లతో కూడిన భారత త్రయం 233-223తో ఇరాక్‌ను చిత్తుచేసింది. మహిళల టీమ్ ఈవెంట్‌లో అదితి, ప్రియ, పర్నీత్‌లతో కూడిన భారత జట్టు సెమీస్‌లో 234-210తో అఫ్ఘానిస్థాన్‌పై నెగ్గింది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో అదితి, ప్రియాన్ష్ ద్వయం 157-146తో బంగ్లాను ఓడించి ఫైనల్లో ప్రవేశించింది.

పారాలింపిక్స్‌కు ముగ్గురు తెలుగు క్రీడాకారులు



హైదరాబాద్: పారాలింపిక్స్‌కు ముగ్గురు తెలుగు క్రీడాకారులు అర్హత సాధించారు. ఢిల్లీలో జరుగుతున్న పారా సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఏపీకి చెందిన అర్షద్ షేక్, పవన్, తెలంగాణ సైక్లిస్ట్ ఆర్యవర్ధన్ రజత పతకాలు సాధించారు. వీరంతా హైదరాబాద్‌లోని ఆదిత్య మెహతా ఫౌండేషన్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు.

బిజినెస్

10 లక్షల కోట్ల డాలర్ల బాటలో భారత్

త్వరలో మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరణ • డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్ బోర్గే బ్రెండే



న్యూఢిల్లీ: భారత జీడీపీ 10 లక్షల కోట్ల డాలర్ల మైలురాయి వైపుగా దూసుకెళ్తున్నదని, మరో 2-3 ఏళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని ప్రపంచ ఆర్థిక ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) అధ్యక్షుడు బోర్గే బ్రెండే అన్నారు. ప్రపంచ దేశాల్లో ఈ స్థాయి ఆశావహ స్థితి మరెక్కడా చూడలేదని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. సమయం ఆసన్నమైనప్పుడు భారత ప్రభుత్వంతో కలిసి ఇక్కడ డబ్ల్యూఈఎఫ్ ఇండియా సదస్సును నిర్వహిస్తామన్నారు. బ్రెండే ఇంకా ఏమన్నారంటే..

- ప్రపంచంలోని బడా ఆర్థిక వ్యవస్థలన్నింటిలోకెల్లా భారత్ శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఈ ఏడాది డబ్ల్యూఈఎఫ్ సదస్సులోనూ ఇన్వెస్టర్లలో భారత్‌పై అమితాసక్తి కనిపించింది. రాబోయే కాలంలో కూడా ఇది కొనసాగుతుందని నాకనిపిస్తోంది.
- భారత్ ప్రస్తుతం 7 శాతం వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన కొన్నేళ్లలో భారత్‌లో కీలక సంస్కరణలు చోటు చేసుకున్నాయి. దాంతో అమెరికా, చైనాకు దీటుగా ఎదుగుతోంది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గణనీయంగా పెరుగుతున్నాయి. గతంలో చైనా సహా పలు వర్ధమాన మార్కెట్లలో జరిగే తయారీ కార్యకలాపాలు భారత్‌కూ తరలివస్తున్నాయి.
- భారత డిజిటల్ పోటీ సామర్థ్యం ప్రశంసనీయం. ప్రపంచంలో ప్రస్తుతం సంప్రదాయ వస్తు వర్తకం కంటే డిజిటల్ వర్తకమే అధికంగా జరుగుతోంది. డిజిటలీకరణ విషయంలో 140 కోట్ల జనాభా కలిగిన భారత్ కీలక దేశంగా మారింది.

వచ్చే పదేళ్లు 6-8% వృద్ధి: వైష్ణవ్

వచ్చే పదేళ్ల భారత జీడీపీ నిలకడగా 6-8 శాతం వృద్ధిరేటును నమోదు చేసుకోనుందని కేంద్ర సమాచార, ఐటీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంతో పాటు కొత్త ఆలోచనలకు భారత తలుపులు తెరిచే ఉంటాయని గురువారం 'రైసిన్ డైలాగ్ 2024' కార్యక్రమంలో ప్రసంగించిన సందర్భంగా ఆయన అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఉద్దేశించి అన్నారు. దేశంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు. వచ్చే ఐదేళ్లలో తమ ప్రభుత్వం తయారీ, విద్య ద్వారా పేదరిక నిర్మూలన, హెల్త్‌కేర్ రంగంలో పెద్దఎత్తున సాంకేతికత వినియోగం వంటి విషయాలకు ప్రాధాన్యం ఇవ్వనుందని మంత్రి సంకేతాలిచ్చారు.

నిఫ్టీ మరో ఆల్‌టైమ్ హై

ముంబై: ఒక రోజు విరామం అనంతరం స్టాక్ మార్కెట్‌లో మరోసారి రికార్డుల మోత మోగింది. తీవ్ర ఆటుపోట్లకు లోనైన సెన్సెక్స్, నిఫ్టీ చివరి గంటలో కోలుకున్నాయి. సెన్సెక్స్ 535.15 పాయింట్ల లాభంతో 73,158.24 వద్ద ముగియగా నిఫ్టీ 162.40 పాయింట్ల లాభంతో 22,217.45 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ 22,252.50 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీకి ఈ రెండూ కొత్త రికార్డులే. ఈ బుల్‌రన్ ఇలాగే కొనసాగితే నిఫ్టీ త్వరలోనే 22,280 స్థాయికి, దాన్ని అధిగమిస్తే 22,810 పాయింట్ల వరకు దూసుకుపోయే అవకాశం ఉందని టెక్నికల్ అనలిస్టుల అంచనా. ఒకవేళ అమ్మకాల ఒత్తిడి ఎదురైనా 22,011 వద్ద గట్టి మద్దతు లభిస్తుందని భావిస్తున్నారు.

ఆల్‌టైమ్ హైలో నిక్కీ: జీడీపీ వృద్ధిరేటు అంతంత మాత్రంగానే ఉన్నా జపాన్ స్టాక్‌మార్కెట్ మాత్రం కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. గురువారం నిక్కీ 225 పాయింట్ల లాభంతో 1989 పాయింట్ల ఆల్‌టైమ్ హై వద్ద ముగిసింది.

2030 నాటికి 10 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాప్

మోదీ సర్కారు గడిచిన పదేళ్లలో చేపట్టిన సంస్కరణలు రాబోయే దశాబ్దాల్లో భారత్ బలమైన వృద్ధికి బాటలు వేశాయని జెఫ్రీస్ ఈక్విటీ రీసెర్చ్ పేర్కొంది. 2030 నాటికి భారత స్టాక్ మార్కెట్ విలువ 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని తాజా నివేదికలో అంచనా వేసింది. గడిచిన 10, 20 ఏళ్లలో స్థిరంగా 10-12 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధిరేటును (సీఏజీఆర్) నమోదు చేసుకోవడం ద్వారా భారత్ ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా ఎదిగిందని ప్రస్తావించింది. నిరంతర సంస్కరణలు వేగంగా వృద్ధి చెందుతున్న బడా ఆర్థిక వ్యవస్థగా భారత్‌కున్న హోదాను కొనసాగేందుకు దోహదపడనున్నాయి. గడిచిన పదేళ్లలో ఏటేటా 7 శాతం సంచిత వృద్ధి ద్వారా భారత్ జీడీపీ ప్రస్తుతం 3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకుంది. దాంతో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో 8 నుంచి 5వ స్థానానికి ఎగబాకింది. వచ్చే నాలుగేళ్లలో 5 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో జపాన్, జర్మనీని వెనక్కి నెట్టి మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరించనుందని జెఫ్రీస్ పేర్కొంది.

డీహెచ్‌ఎఫ్‌ఎల్ మాజీ ప్రమోటర్ల బ్యాంక్, డీమ్యాట్ ఖాతాల జప్తు
ఆదేశాలు జారీ చేసిన సెబీ

న్యూఢిల్లీ: దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (డీహెచ్‌ఎఫ్‌ఎల్) మాజీ ప్రమోటర్లు ధీరజ్ వాధవాన్, కపిల్ వాధవాన్‌ల బ్యాంక్ ఖాతాలతోపాటు వారి డీమ్యాట్ ఖాతాల్లోని షేర్లు, మ్యూచువల్ ఫండ్ల యూనిట్ల జప్తునకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆదేశించింది. వారి నుంచి రూ.22 లక్షలకు పైగా బకాయిల వసూలు కోసం సెబీ గురువారం ఈ ఆదేశాలు జారీ చేసింది. సమాచార వెల్లడి నిబంధనల ఉల్లంఘన కేసులో గత ఏడాది జూలైలో విధించిన జరిమానాను వీరు చెల్లించడంలో విఫలమైన నేపథ్యంలో సెబీ ఈ నిర్ణయం తీసుకుంది.

సీఎంఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా మృణాళ్ ఠాకూర్



హైదరాబాద్: వస్త్ర ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించుకున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మృణాళ్ ఠాకూర్‌ను నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎంఆర్ నాలుగు దశాబ్దాలుగా వినియోగదారుల అభిరుచికి తగినట్టుగా వివిధ రకాల వస్త్రాలను అందిస్తుందని, అలాంటి సంస్థకు తాను బ్రాండ్ అంబాసిడర్ కావడం తనకు ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. నటుడు రామ్ పోతినేని ఇప్పటికే సీఎంఆర్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు.

బ్రైట్‌కామ్ గ్రూప్ పద్దుల తనిఖీకి ఎంసీఏ ఆదేశం

హైదరాబాద్: బ్రైట్‌కామ్ గ్రూప్‌లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ఆ కంపెనీ పద్దులు తనిఖీ చేయాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) హైదరాబాద్‌లోని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌ను ఆదేశించింది. పద్దులను తారుమారు చేశారంటూ వచ్చిన అన్ని ఆరోపణలపై సమగ్రంగా దర్యాప్తు జరుగుతుందని ఎంసీఏ అధికారులు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఈ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ ఇప్పటికే ఫెమా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ఎదుర్కొంటోంది.

27న వొడాఫోన్ ఐడియా బోర్డు భేటీ


న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు సిద్ధమవుతోంది. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఈ నెల 27న సమావేశమవుతోంది. దేశ, విదేశీ మదుపరులకు ఈక్విటీ షేర్లు లేదా కన్వర్టబుల్ డిబెంచర్లు జారీ చేయడం ద్వారా నిధులు సమీకరించాలని కంపెనీ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్ల దూకుడు

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఒలెక్ట్రా గ్రీన్ టెక్ కంపెనీ షేర్లు గురువారం బీఎస్ఈలో ఇంట్రా డేలో 7.73 శాతం పెరిగి రూ.2,222 ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకాయి. చివరికి రెండు శాతం లాభంతో రూ.2,103.85 వద్ద ముగిశాయి. బృహన్ ముంబై ఎలక్ట్రిక్ సప్లయ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ (బీఈఎస్‌టీ) నుంచి రూ.4,000 కోట్ల విలువైన 2,400 ఎలక్ట్రిక్ బస్సుల సరఫరాకు ఆర్డర్ లభించిందన్న వార్తలు ఇందుకు దోహదం చేశాయి. గత ఏడాది కాలంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ షేర్లు మదుపరులకు దాదాపు 447 శాతం లాభాలు పంచాయి.

అపోలో మైక్రోసిస్టమ్స్‌కు ఎస్‌బీఐ రుణం

హైదరాబాద్: తాము హైదరాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్‌లో చేపడుతున్న కొత్త ప్రాజెక్టు కోసం ఎస్‌బీఐ రూ.110 కోట్ల రుణం మంజూరు చేసిందని అపోలో మైక్రో సిస్టమ్స్ లిమిటెడ్ (ఏఎంఎస్ఎల్) ప్రకటించింది. రక్షణ ఉత్పత్తుల తయారీ కోసం తాము తెలంగాణ ప్లాంట్‌పై రూ.210 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు కంపెనీ వెల్లడించింది. ఈ రుణంతో పాటుగా తమకు గతంలో ఇచ్చిన రుణసదుపాయం రెన్యూ చేసి 2025 ఫిబ్రవరి 8వ తేదీ వరకు అంటే 12 నెలల పాటు గడువు పొడిగింపునకు కూడా ఎస్‌బీఐ అనుమతించినట్టు తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,630 ▼	57,500 ▼	76,500 ▼
ముంబై	62,160 ▼	56,930 ▼	70,400 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



22వ తేదీ	
హైదరాబాద్	534
23వ తేదీ	
చిత్తూరు	603
గోదావరి	515
విజయవాడ	515
విశాఖపట్నం	525
వరంగల్	536

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140
వరంగల్	140
కరీంనగర్	140
మహబూబ్‌నగర్	140
కర్నూలు	140
విశాఖపట్నం	127
గోదావరి	144
విజయవాడ	144
గుంటూరు	144
ఒంగోలు	144
చిత్తూరు	142

కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లేళ్ల రాజీనామా

» ఎమ్మెల్యే నంబూరు వేధిస్తున్నారని ఆరోపణ

క్రోసూరు, ఫిబ్రవరి 22: రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు పల్నాడు జిల్లా క్రోసూరు మండలానికి చెందిన లేళ్ల వెంకటరావు గురువారం ప్రకటించారు. రాజీనామా లేఖను రాష్ట్ర కాపు కార్పొరేషన్ అధ్యక్షుడికి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపినట్లు తెలిపారు. 700 మంది అనుచరులు కూడా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ఉయ్యందన గ్రామంలో జరిగిన కాపుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తమ కులంపై కక్ష పెంచుకుని, వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన వీడియోలు, సాక్ష్యాధారాలు ఉన్నాయన్నారు. కాపు కార్పొరేషన్‌తో కులానికి ఏ ప్రయోజనం లేదన్నారు. మరో 15మంది డైరెక్టర్లు కూడా అసంతృప్తిగా ఉన్నారని, టీడీపీ హయాంలోనే కాపులకు న్యాయం జరిగిందని తెలిపారు.

టీడీపీలోకి వేమిరెడ్డి..!

» వీపీఆర్‌ను కలిసి పార్టీలోకి ఆహ్వానించిన తెలుగుదేశం నేతలు



వేమిరెడ్డితో సమావేశమైన టీడీపీ ముఖ్యనాయకులు

నెల్లూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో చేరేందుకు వైసీపీ నుంచి బయటకొచ్చిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) సముఖత వ్యక్తం చేశారని టీడీపీ నేతలు వెల్లడించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ముఖ్య నేతలంతా గురువారం వీపీఆర్ నివాసానికి వెళ్లి ఆ దంపతులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులందరినీ వేమిరెడ్డి ఆప్యాయంగా పలకరించారు. అనేక రాజకీయ అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. అనంతరం బయటకొచ్చాక మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మీడియాతో మాట్లాడారు. వీపీఆర్ దంపతులు త్వరలోనే టీడీపీలో చేరే అవకాశముందని వ్యాఖ్యానించారు. హుందా రాజకీయాలు చేసే వేమిరెడ్డికి టీడీపీలో సరైన గౌరవం దక్కుతుందన్నారు. కాగా అనేక మంది వైసీపీ నాయకులు వీపీఆర్ వెంట నడిచేందుకు సిద్ధమవుతున్నారు.

వైఎస్‌కు జగన్ రాజకీయ వారసుడు కాదు

» మంద కృష్ణ మాదిగ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 22: వైఎస్ రాజశేఖరరెడ్డికి జగన్ కన్న కొడుకే గాని రాజకీయ వారసుడు కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'వైఎస్ఆర్.. ఏ విషయంలోనైనా మాట ఇస్తే సాధ్యమైనంత మేరకు దానికి కట్టుబడి ఉండేవారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి సర్వశక్తులు వడ్డేవారు. వైఎస్ రాజకీయ వారసుడుగా ప్రజల్లోకి వచ్చిన జగన్ తండ్రి ఫొటో పెట్టి, పార్టీకి వైఎస్ఆర్ అని పేరు పెట్టి ఓట్లు అడిగి అధికారంలోకి వచ్చారు. మాట తప్పేది లేదు, మడమ తిప్పేది లేదని చెప్పిన జగన్ ప్రజారంజక పాలన చేస్తారనే ప్రజల ఆశలను అడియాశలు చేశారు. కాంగ్రెస్ ఎంపీగా ఉన్నప్పుడు ఆయన చూపించిన చొరవ చూసి వర్గీకరణకు కట్టుబడి ఉన్నారని మాదిగలు జగన్‌కు ఓటు వేశారు. అయితే వైసీపీ పాలనలో ఏనాడూ వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడలేదు. వర్గీకరణపై మాట్లాడడానికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. వర్గీకరణపై సుప్రీం కోర్టులో మాట్లాడక పోవడం చూస్తే మడమ తిప్పేది లేదని, మాట తప్పేదిలేదని జగన్ చెప్పే మాట నిజం కాదని అర్థమైంది. రాజకీయ లబ్ధి కల్గిన తర్వాత మాదిగలను నట్టేట ముంచినట్లుగా భావిస్తున్నాం. మాదిగలు అమాయకులనో, రాష్ట్రంలో మాదిగలే లేరనో భావిస్తే రాబోయే రోజుల్లో జగన్ తగిన మూల్యం చెల్లించుకోవడానికి మాదిగలే ప్రధాన కారకులవుతారు' అని మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అద్దంకిబాబు, ఎంఎస్‌పీ పోలే పోగు రాములు తదితరులు పాల్గొన్నారు.

షర్మిల అరెస్ట్

» దగా డీఎస్సీకి వ్యతిరేకంగా 'చలో సెక్రటేరియట్'

» ఉండవల్లి కరకట్టపై అడ్డగించిన పోలీసులు

» షర్మిలనూ ఈడ్చుకుంటూ వాహనంలో పడేసిన వైనం.. చేతికి గాయం

విజయవాడ/విజయవాడ/మంగళగిరి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): '30 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించే అవకాశమున్నా సీఎం జగన్ ఆ పని చేయలేదు. 6వేల పోస్టులతో దగా డీఎస్సీని ప్రకటించారు. అందుకే జగన్‌ను దగా సీఎం అంటున్నాం. ఇప్పుడు చలో సెక్రటేరియట్‌కు పిలుపిచ్చాం. త్వరలో తాడేపల్లి ప్యాలెస్‌నూ టచ్ చేస్తాం' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హెచ్చరించారు. గత ఎన్నికలతో పాటు జగన్ పాదయాత్రల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 23వేల ఉపాధ్యాయ పోస్టులతో కూడిన మెగా డీఎస్సీ కావాలంటూ పీసీసీ గురువారం తలపెట్టిన 'చలో సెక్రటేరియేట్' తీవ్ర ఉద్రిక్తంగా మారింది. విజయవాడలోని పీసీసీ కార్యాలయమైన ఆంధ్రరత్న భవన్ చుట్టూ పోలీసులు బుధవారమే మోహరించారు. మూడంచెల భద్రతను ఏర్పాటుచేసి.. భవన్‌కు వెళ్లే మార్గాన్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో షర్మిల బుధవారం రాత్రి భవన్‌లోనే మకాం వేశారు. గురువారం ఉదయం కార్యాలయం నుంచి బయటకు వస్తే అరెస్టు చేయాలని పోలీసులు భావించారు. ఇది తెలిసి షర్మిల కార్యాలయం ఆవరణలోనే ధర్నాకు దిగారు. సీడబ్ల్యూసీ ఆహ్వానితుడు గిడుగు రుద్రరాజు, సీనియర్ నేతలు తులసిరెడ్డి, సుంకర పద్మశ్రీ, షేక్ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు. గంటకు పైగా షర్మిల ధర్నా చేశారు. పోలీస్ కంట్రోల్ రూం వరకు ఆమె చేసే పాదయాత్రను అడ్డుకోకూడదని పోలీసులు భావించారు. నేతలు, కార్యకర్తలతో కలిసి ఆమె కంట్రోల్ రూం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏలూరు రోడ్డులో చల్లపల్లి బంగ్లా వద్ద బైఠాయించి కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం పోలీసు కంట్రోల్ రూం వద్ద బైఠాయించారు. అక్కడి నుంచి వాహనాల్లో అమరావతి సచివాలయానికి బయల్దేరారు. ఉండవల్లి కరకట్ట మీద కొండవీడు ఎత్తిపోతల పథకం వద్ద తాడేపల్లి పోలీసులు వారిని అడ్డుకున్నారు. సీఎస్ జవహర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతించాలంటూ కాంగ్రెస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు. పోలీసులు ససేమిరా అనడంతో వాగ్వాదం, తోపులాట జరిగాయి. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టుచేసి వ్యాను ఎక్కించారు. దీనిని నిరసిస్తూ షర్మిల వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు చర్యలకు నిరసనగా కరకట్ట రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులు ఆమెను కూడా ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యానెక్కించారు. ఈ పెనుగులాటలో ఆమె చేతికి గాయమైంది. వారందరినీ మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. షర్మిలతోపాటు అరెస్టు చేసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు, జేడీ శీలం, షేక్ మస్తాన్‌వలి, సుంకర పద్మశ్రీ తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మంగళగిరి స్టేషన్ చేరుకుని, ఆందోళనకు దిగారు. మధ్యాహ్నం తర్వాత వారిని విడుదల చేశారు.

ఉపాధి లేక 21 వేల మంది మృతి

ఉపాధి లేక ఐదేళ్లలో 21వేల మంది చనిపోయారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలే. ఉపాధి లేక యువత వలసలు పోతున్నారు. త్వరలో ఏపీ యువత లేని రాష్ట్రంగా మారుతుంది.

జగనన్న 23 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ తెస్తానని పదేపదే చెప్పి ఈ ఐదేళ్లపాటు కుంభకర్ణుడిలా నిద్రపోయి గుడ్డిగుర్రాలకు పళ్లు తోముతూ కూర్చున్నారు. ఎన్నికలు వచ్చేటప్పటికి ఓట్ల కోసం దగా డీఎస్సీ తీసుకొచ్చారు.

- వైఎస్ షర్మిల



మెగా డీఎస్సీ వేస్తామని దగా డీఎస్సీ వేశారంటూ విజయవాడలో నిరసన ర్యాలీలో ప్లకార్డుతో షర్మిల

అమ్మ బాధపడుతుంది.. నాన్న ఆత్మ క్షోభిస్తుంది

సీఎం జగన్‌పై షర్మిల ఫైర్

విజయవాడ/విజయవాడ/మంగళగిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తనను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి పోలీసు వ్యాన్‌లోకి ఎత్తివేయడంపై షర్మిల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడపిల్ల పట్ల ఇంత నిర్దయగా వ్యవహరించడం పాపమన్నారు. ఈ ఘటనను చూసి తన తండ్రి వైఎస్ ఆత్మ క్షోభిస్తుందని, తన తల్లి విజయమ్మ ఎంతగానో బాధపడుతుందని చెప్పారు. మంగళగిరి పోలీసు స్టేషన్ వద్ద, అంతకుముందు ఆంధ్రరత్న భవన్‌లో ధర్నా సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో చదువుకున్న బిడ్డలకు ఉద్యోగాలు రావడం లేదన్న బాధతో వైఎస్ బిడ్డ పోరాటం చేస్తోందని.. కనీసం సెక్రటేరియేట్‌లో వినతిపత్రం ఇవ్వడానికి కూడా ప్రభుత్వం అనుమతించడం లేదని ఆక్షేపించారు. 'మాట్లాడానికి కూడ స్వేచ్ఛ లేకుండా అత్యంత దురాగతంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. జర్నలిస్టులు రాయాలన్నా, కొట్లాడాలన్నా స్వేచ్ఛలేదు. నేడు సెక్రటేరియేట్‌లో వినతిపత్రం తీసుకోవడానికి అక్కడ ముఖ్యమంత్రి లేడు.. హోంమంత్రి లేరు, ఉపముఖ్యమంత్రులు, మంత్రులెవరూ లేరు. కనీసం సీఎస్ కూడా అందుబాటులో లేరట! ఇక వీళ్లకు చేతనైందేమిటీ? ప్రత్యేక హోదా తీసుకురావడం చేతకాదు.. పోలవరం పూర్తిచేయడం చేతరాదు.. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడం చేతనవుతుందా? కేపిటల్ సిటీ కట్టడం చేతనైందా? కనీసం మెట్రో అన్నా తీసుకురావడం చేతనైందా? రైతులకు పంటల బీమా ఇవ్వడం చేతకాలేదు. బిడ్డలు ఉద్యోగాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడం చేతకాలేదు. రాజశేఖర్‌రెడ్డి వదిలివెళ్లిన ప్రాజెక్టులను పూర్తి చేయడం చేతకాలేదు. మరి ఇదేనా రాజశేఖరరెడ్డి వారసత్వమంటే? ప్రజలు ఆలోచన చేయాలి. ప్రజల కోసం కొట్లాడుతుంటే.. కనికరం చూపకుండా, మహిళనని కూడా చూడకుండా నన్ను పార్టీ ఆఫీసులోనే ఉండేలా చేశారు. నన్ను గాయపరిచారు' అని ఆమె తన చేతికైన గాయాన్ని చూపారు. రాష్ట్రంలో లక్షలాది మంది యువత ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారని.. ఉన్నత విద్యార్హతలు ఉన్నా యువత చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారని.. డిగ్రీలు పూర్తిచేసిన ఎంతోమంది యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రతి జనవరికి జాబ్ కేలెండర్ ఇస్తామని సాక్షి కేలెండర్ అంటగడుతున్నారు. దగా డీఎస్సీ కాదు.. మొత్తం 23 వేల పోస్టులతో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి. గతంలో హామీ ఇచ్చిన విధంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.30 లక్షల పోస్టులను కూడా ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సిందే' అని షర్మిల డిమాండ్ చేశారు. జగన్ వైఫల్యాలు రాసిన విలేకరులపై దాడులు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమేనా అని నిలదీశారు.



కాంగ్రెస్ కార్యకర్తను కరకట్ట రోడ్డులో బలవంతంగా అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బొత్సపై పోటీ చేయాలని పార్టీ కోరింది: గంటా

విశాఖపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'విజయనగరం జిల్లా చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని పార్టీ కోరింది. దానిపై సహచరులతో సమాలోచన చేస్తున్నా' అని గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1999 నుంచి ప్రతిసారీ కొత్త నియోజకవర్గం నుంచే పోటీ చేస్తున్నానని, ఈసారి ఆ రికార్డుని బ్రేక్ చేసి, గతంలో ఎన్నికైన నియోజకవర్గం నుంచే పోటీకి దిగుతానని అన్నారు. చీపురుపల్లిలో మంత్రి బొత్సపై పోటీ చేయాలని పార్టీ కోరడం నిజమేనని అంగీకరించారు. 'పది రోజుల క్రితం చంద్రబాబు ఈ సూచన చేశారు. దానిపై మిత్రులు, సహచరులు, పార్టీ నాయకులతో చర్చిస్తున్నా. ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నాకైతే విశాఖ జిల్లా నుంచే పోటీ చేయాలని ఉంది. విజయనగరం జిల్లాలో బలమైన నాయకుడు బొత్స. ఆయనపై నన్ను పోటీకి దించుతున్నారంటే.. అందుకు తగిన సమర్థత నాకు ఉన్నదనే అధినేత భావిస్తున్నారు. చీపురుపల్లి నుంచి పార్టీ నాయకులు ఫోన్లు చేసి ఆహ్వానిస్తున్నారు' అని గంటా అన్నారు.

'ఎన్జీటీ ఆదేశించినా ఇసుక అక్రమ తవ్వకాలు ఆగలేదు. దీనిపై తగిన చర్యలు తీసుకోండి'... అని 'సియా' గనుల శాఖ డైరెక్టర్ వెంకటరెడ్డికి 8 లేఖలు రాసింది. 'అబ్బే అదేం లేదు' అన్న అబద్ధమే వెంకట రెడ్డి సమాధానం!

వాటీజ్ దిస్ వెంకటరెడ్డీ?

(మొదటి పేజీ తరువాయి)

వేలకోట్ల నష్టం... ఈ అన్ని అక్రమాల్లో తొలి ముద్దాయి గనుల శాఖే! జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) తేల్చి చెప్పిందిదే. వెంకటరెడ్డిని గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీ ఎండీగా నియమించిన తర్వాత ఇసుక అక్రమ తవ్వకాలు, పర్యావరణ విధ్వంసం పతాక స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ (సీఈఎఫ్ఎఫ్‌సీ)నివేదికతో ఈ అక్రమాలు తేటతెల్లమయ్యాయి. నిజానికి... ఈ విధ్వంసంపై రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (ఎస్ఈఐఏఏ - సియా) ఎప్పటికప్పుడు గనుల శాఖను అప్రమత్తం చేస్తూనే ఉంది. కానీ... సర్కారు పెద్దల అండదండలు పుష్కలంగా ఉన్న వెంకటరెడ్డి దీనిని పట్టించుకోలేదు. పైగా... 'ఇసుక అక్రమ తవ్వకాలు జరగడంలేదు' అంటూ పదేపదే అబద్ధాలు చెప్పారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ విభాగం స్పెషల్ సెక్రటరీ, ఆంధ్రా యూనివర్సిటీలో పర్యావరణ విభాగం ప్రొఫెసర్, మరో రిటైర్డ్ ఐఏఎస్ సభ్యులుగా... స్పెషల్ సెక్రటరీ సభ్యకార్యదర్శిగా ఉండే 'సియా' కళ్లకే గంతలు కట్టారు. కానీ... దాచాలంటే దాగదు అన్నట్లుగా, మొత్తం ఇసుక బండారం బయటపడింది.

ఇదీ అక్రమాల క్రమం

ఇసుక తవ్వకాలపై గుంటూరుకు చెందిన నాగేంద్రకుమార్ ఎన్జీటీలో కేసు వేశారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ (సియా), కాలుష్యనియంత్రణ మండలి (పీసీబీ) ఇచ్చిన నివేదికలు, స్వతంత్ర విచారణ కమిటీ ఇచ్చిన సిఫారసుల ఆధారంగా ఎన్జీటీ విచారణ జరిపింది. ఇసుక అక్రమాలు నిజమే అని తేలుస్తూ, 106 రీచ్‌లకు అనుమతులు రద్దు చేయాలని... అనుమతులు లేకుండా నడుస్తున్న ఇతర రీచ్‌లను నిలిపివేయాలని గత ఏడాది మార్చి 23న సియాను ఎన్జీటీ ఆదేశించింది. ఈ మేరకు సియా స్పందించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను, ఎన్జీటీ తీర్పును కలిపి గనుల శాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీగా ఉన్న వెంకట రెడ్డికి పంపించింది. ఎన్జీటీ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని కోరింది. 'సియా' జారీ చేసిన ఆదేశాలను గనుల శాఖ పట్టించుకోలేదు. పర్యావరణ అనుమతులు (ఈసీ) రద్దయినా జేపీ వెంచర్స్ భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుపుతోందంటూ నాగేంద్రకుమార్ మరోసారి ఎన్జీటీకి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో... తమ ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారా? ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా? కొత్త ఈసీలు ఎవరికైనా ఇచ్చారా? తేల్చాలంటూ ఎన్జీటీ గతేడాది జూన్‌లో ఆదేశించింది. ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ సియా గనుల శాఖ డైరెక్టర్‌కు వరుస లేఖలు రాసింది. అయితే, 110 రీచ్‌లు ఆగిపోయాయని, ఎలాంటి ఇసుక తవ్వకాలు జరగడం లేదని గనులశాఖ డైరెక్టర్ సియాకు పచ్చి అబద్ధాలు చెప్పారు. ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయని, జేపీ వెంచర్స్ అక్రమ మైనింగ్ చేస్తోందంటూ నాగేంద్ర కుమార్ ఫొటోలు, వీడియోలను ఎన్జీటీకి సమర్పించారు. దీని ఆధారంగా పరిశీలన చేయాలని సియాను ఎన్జీటీ ఆదేశించింది. దీంతో మరోసారి ఎన్జీటీ ఆదేశాల అమలును గుర్తుచేస్తూ గతేడాది ఆగస్టు 14, 18, సెప్టెంబరు 10, అక్టోబరు 15 తదితర తేదీల్లో గనుల శాఖ డైరెక్టర్‌కు సియా వరుస లేఖలు రాసింది. ఎన్నిసార్లు అడిగినా, ఎన్నిసార్లు చెప్పినా... వెంకట రెడ్డి నుంచి ఒకటే సమాధానం! 'ఇసుక అక్రమ తవ్వకాలు జరగడంలేదు' అనే అబద్ధమే! ఇదే అంశంపై కాలుష్య నియంత్రణ మండలికి కూడా సియా 5లేఖలు రాసింది. ఈసీలు రద్దయిన రీచ్‌ల్లో మైనింగ్ ఆపారా? లేదా వాస్తవిక నివేదిక ఇవ్వాలని పీసీబీని కోరింది.

బండారం బయటపెటిన కేంద్ర సంస్థ

గనుల శాఖ డైరెక్టర్ చెబుతున్నది నిజమా, కాదా తేల్చేందుకు ఎన్జీటీ వ్యూహాత్మకంగా కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ (సీఈఎఫ్ఎఫ్‌సీ)ను రంగంలోకి దింపింది. ఆ సంస్థ పలువురు పర్యావరణ శాస్త్రవేత్తలు, అధికారులతో జాయింట్ కమిటీని ఏర్పాటు చేసింది. గత నెలలో ఈసీలు రద్దయిన రీచ్‌లను కమిటీ సభ్యులు పరిశీలించి అక్రమాలను సాంకేతిక ఆధారాలతో సహా నిర్ధారించారు. దీంతో వెంకటరెడ్డి చెప్పిన మాటలు అబద్ధాలని తేలింది. కొత్తగా పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టబోమని గనుల శాఖ వెంకటరెడ్డి ఇటీవల హైకోర్టుకు నివేదించారు. కానీ, ఈసీలు లేకుండా అటు ప్రతిమ, ఇటు జీసీకేసీ సంస్థలతో ఇసుక మైనింగ్ చేయిస్తున్నట్లు ఇప్పుడు తేలింది. కేంద్ర పర్యావరణ సంస్థే ఈ వాస్తవాన్ని బయటపెట్టింది. దీంతో ఆయన అడ్డంగా దొరికిపోయినట్లేనని, హైకోర్టుకు సమాధానం చెప్పక తప్పదని అధికార వర్గాలు చెబుతున్నాయి. గనుల శాఖ డైరెక్టర్‌గా ఆయన నియామకంపై ఇప్పటికే హైకోర్టులో కేసు నడుస్తోంది. దీంతో ఆయన 'ఇసుక తుఫాను'లో చిక్కుకున్నట్లయిందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

28న గూడెంలో ఉమ్మడి భేరి

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య.. జనసేన నుంచి రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్, ఆ పార్టీ నేతలు కందుల దుర్గేశ్, కొటికలపూడి గోవిందరావు, బొమ్మిడి నాయకర్, పాలవలస యశస్వి, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం పక్కన ఉన్న ప్రత్తిపాడులో సభా ప్రాంగణం ఏర్పాటు చేస్తున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. 'ఈ సభకు ఆరు లక్షల మంది వస్తారని అంచనా. రెండు పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇందులో పాల్గొంటారు. ప్రతిపక్షం సభకు ఆర్టీసీ బస్సులు ఇవ్వరు. ప్రైవేటు బస్సులూ ఇవ్వకుండా వారిపై అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తారు. ఇన్ని ఇబ్బందుల మధ్య కూడా కనీసం ఆరు లక్షల మందిని సమీకరించి ఈ సభను ఘనంగా నిర్వహించబోతున్నాం' అని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లి గూడెం సభలో రెండు పార్టీలు ఎన్నికల శంఖం పూరిస్తాయని నాదెండ్ల మనోహర్ చెప్పారు. 'వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్‌కు ఈ సభ నాందీవాచకం పలుకుతుంది. ఉభయ గోదావరి జిల్లాలతోపాటు మొత్తం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నాయకులను దీనికి ఆహ్వానిస్తున్నాం. 500 మంది కూర్చునేలా సభావేదికను నిర్మిస్తున్నాం. బైబై వైసీపీ అని రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. దానిని ఈ సభ ప్రతిబింబిస్తుంది' అని ఆయన తెలిపారు.

పోటీలపై నిర్ణయించేది పవన్, బాబే

కింది స్థాయిలో రెండు పార్టీల మధ్య మరింత సమన్వయం పెరిగేలా చూడాలని, ఎక్కడైనా చిన్న సమస్యలు ఉంటే వాటిని మృదువుగా పరిష్కరించుకోవాలని సమన్వయ కమిటీ నిర్ణయించింది. 'రెండు పార్టీల తరఫున ఎవరు, ఎక్కడ పోటీ చేయాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయిస్తారు. టీడీపీ గతంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు, జనసేన షణ్ముఖ హామీల వ్యూహంపై ప్రజల్లోకి నిత్యం వెళ్తున్నాం. పూర్తి స్థాయి మేనిఫెస్టో త్వరలోనే ప్రకటిస్తాం. మా కలయికను ఓర్చుకోలేక టీడీపీ, జనసేన మధ్య తగాదాలు పెట్టడానికి అధికార పార్టీ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తోంది. ఇరు పార్టీల శ్రేణులూ తిప్పికొట్టాలి. సమన్వయంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం' అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బీజేపీతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలో విషయం చెబుతామన్నారు. తమ కూటమి మందకొడిగా ఉందనడం నిజం కాదని, ఒకపక్క లోకేశ్.. మరోపక్క పవన్ ప్రజల్లో తిరుగుతూనే ఉన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాగా.. జనసేన నేత కందుల దుర్గేశ్ రాజమండ్రి రూరల్ సీటుకు సంబంధించిన చేసిన వ్యాఖ్యలు వివాదం రేపిన నేపథ్యంలో నాయకులు సంయమనం పాటించేలా చూడాలని సమావేశంలో నిర్ణయించారు.

మోదీ కూడా పాల్గొనేలా త్వరలో సభ!

ఎన్డీయేలో చేరిక పూర్తయిన తర్వాత ప్రధాని మోదీ కూడా పాల్గొనేలా ఒక భారీ బహిరంగ సభ నిర్వహించాలని టీడీపీ-జనసేన నిర్ణయించాయి. తాడేపల్లిగూడెం సభ తర్వాత మార్చిలో ఇంకో భారీ సభ ఏర్పాటు చేసి.. మోదీని ఆహ్వానించాలని నిశ్చయించాయి. ఎన్డీయేలో చేరిక, బీజేపీతో సీట్ల సర్దుబాటు నెలాఖరులోపు పూర్తవుతాయని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. ఉమ్మడి మేనిఫెస్టో విడుదలను కొంతకాలం పాటు ఆపాలనుకున్నారు. బీజేపీ కూటమిలోకి వచ్చాక వాళ్ల అభిప్రాయాలూ తీసుకుని విడుదల చేయాలని నిశ్చయించారు.

మీడియాపై దాడులకు ఖండన

రాష్ట్రంలో వైసీపీ ప్రోద్బలంతో మీడియాపై జరుగుతున్న దాడులను సమన్వయ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు తీర్మానం ఆమోదించింది. 'ప్రజల్లో పెరిగిపోతున్న వ్యతిరేకతను దారి మళ్లించడానికి చివరి ప్రయత్నంగా రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయడానికి మీడియాపై దాడులకు అధికార పార్టీ దిగుతోంది. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడులు రాక్షసత్వానికి ప్రతీక' అని విమర్శించారు.

ధర్మానా.. ఏమిటిది?: రాబోయే ఎన్నికల్లో వలంటీర్లు వైసీపీ బూత్ ఏజెంట్లుగా వ్యవహరించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పడం దారుణమని, వారికి ఎన్నికల విధులే అప్పగించరాదని ఎన్నికల కమిషన్ చెబుతుంటే ఏకంగా బూత్ ఏజెంట్లుగా కూర్చోబెడతామని మంత్రి ఎలా చెబుతారని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. పొత్తుల వల్ల రెండు పార్టీల్లో కూడా కొందరు త్యాగాలు చేయాల్సి వస్తుందని, తర్వాత వారికి తగిన అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

వారంలోగా బిల్లులు చెల్లించకపోతే ఆత్మహత్య!

» మండల సమావేశంలో వైసీపీ సర్పంచ్ అల్టిమేటం

మునగపాక, ఫిబ్రవరి 22: 'బిల్లులు వెంటనే చెల్లిస్తామని నమ్మబలికారు. అప్పులు చేసి పనులు చేశా. మూడేళ్లయ్యింది. ఇప్పటికీ అతీగతీ లేదు. వారం రోజుల్లోగా బిల్లులు చెల్లించకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటా'.. అంటూ అధికారులకు వైసీపీకి చెందిన అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వాడ్రాపల్లి వైసీపీ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అల్టిమేటం ఇచ్చారు. గురువారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునగపాకలో జగనన్న కాలనీ నిర్మాణానికి లోతట్టు ప్రాంతంలో భూమి కొనుగోలు చేశారని, సుమారు ఐదు అడుగుల లోతట్టు ప్రాంతాన్ని గ్రావెల్‌తో నింపడానికి అప్పట్లో ఏ కాంట్రాక్టరూ ముందుకు రాలేదన్నారు. వైసీపీ మండల అధ్యక్ష పదవిలో ఉన్న తనను అధికారులు, నాయకులు బలవంతంగా ఒప్పించి పనులు చేపట్టేలా చేశారని, మూడేళ్లవుతున్నా బిల్లుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.42 లక్షలు పెట్టుబడి పెట్టానని, తీరా అధికారులు రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తానని చెప్పారని, అది కూడా చెల్లించకుండా వాయిదాలు వేసుకుంటూ పోతున్నారన్నారు. మరోవైపు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేస్తుందని, అప్పుడు తన గోడు ఎవరూ వినరని వాపోయారు. మార్చి ఒకటో తేదీలోగా బిల్లులు చెల్లించకుంటే జగనన్న కాలనీకి అడ్డంగా రోడ్డు తవ్వి, అక్కడే కుటుంబంతో సహా ఆమరణ దీక్షకు దిగుతానని, అప్పటికీ అధికారుల్లో చలనం రాకపోతే ఆత్మహత్య చేసుకోవడం మినహా వేరే దారి లేదని అన్నారు. బిల్లులు చెల్లించకపోవడం సరికాదని సమావేశంలో పలువురు వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు నూకరాజుకు సంఘీభావం తెలిపారు. ఎలాంటి ధాన్యమైనా కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చెబుతుంటే.. మండలంలో ఆ పరిస్థితి కనిపించడం లేదని వ్యవసాయ అధికారిణి జ్యోత్స్నను సభ్యులు నిలదీశారు. వాడ్రాపల్లి, గణపర్తి సర్పంచులు నూకరాజు, గణేశ్‌నాయుడు మాట్లాడుతూ సుమారు ఐదు నెలలు కావస్తున్నా తమ వద్ద ధాన్యం కొనుగోలు చేయడానికి విల్లర్లు, ప్రభుత్వం ముందుకు రాలేదన్నారు. గణపర్తిలో రుద్రభూమిలో రెవెన్యూ అధికారులు ఎల్‌పీసీలు ఎలా ఇచ్చారంటూ సర్పంచ్ గట్టిగా నిలదీశారు.

పెనమలూరు తెరపైకి ఘట్టమనేని..!

» చంద్రబాబు వద్ద ఆసక్తిని వెల్లడించిన ఆది శేషగిరిరావు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పెనమలూరు నియోజకవర్గం తెరపైకి దివంగత సినీ హీరో కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆది శేషగిరిరావు వచ్చారు. టీడీపీ అధినాయకత్వం ఆకస్మికంగా ఈ సంచలన ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఆది శేషగిరిరావు కొంతకాలంగా టీడీపీలో చురుగ్గా ఉంటున్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో చంద్రబాబును కలిసి పెనమలూరులో పోటీపై ఆసక్తిని వివరించారు. ఆయనా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు అరెస్టయినప్పుడు సినీ రంగం నుంచి ఆయన తొలిసారిగా స్పందించి అరెస్టును ఖండించారు. శేషగిరిరావు పోటీవల్ల రాష్ట్రవ్యాప్తంగా కృష్ణ, ఆయన కుమారుడు మహేశ్‌బాబు అభిమాన సంఘాలు ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమికి అనుకూలంగా పనిచేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పెనమలూరు నియోజకవర్గానికి ప్రస్తుతం టీడీపీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఉన్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా పేరు కొంత కాలం క్రితం వినిపించినా ఇప్పుడు ఆది శేషగిరిరావు పేరు ముందుకు వచ్చింది.

సమాచార కమిషనర్లుగా సునీల్, 'ఎన్టీవీ' రెహానా, భాస్కర్ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషనర్లుగా మరో ముగ్గురు నియమితులయ్యారు. ఎన్టీవీ చానల్ విలేకరిగా పని చేస్తున్న రెహానా బేగం, 'త్రో బాల్' చాంపియన్ చావలి సునీల్ కుమార్, వైద్యుడు ఉదయ భాస్కర్ రెడ్డిలను కమిషనర్లుగా నియమిస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పొత్తు ఎలా ఉన్నా... పోటీకి సిద్ధం

» నేనెక్కడి నుంచి పోటీ చేయాలో పార్టీ ఇష్టం: పురందేశ్వరి

ఏలూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'పొత్తుల విషయం ఎలా వున్నా కార్యకర్తలందరూ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమయ్యారు. పార్టీని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలూ శ్రమిస్తున్నారు. అధిష్ఠానం పిలుపు మేరకు 27న ఏలూరులో ప్రజా పోరు పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించనున్నాం. ఈ సభకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఏలూరులో గురువారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి తదితర నేతలతో కలసి ఆమె సభాస్థలిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'నేను ఎంపీగానా, ఎమ్మెల్యేగానా... ఏ స్థానం నుంచి పోటీచేయాలి..? తదితర అంశాలను అధిష్ఠానం నిర్ణయిస్తుంది. రాష్ట్రంలో అన్ని స్థానాలకూ బీజేపీ పోటీ చేసేందుకు సన్నాహాలు చేశాం. ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలనే విషయంలో కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోబోతోంది' అని స్పష్టం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పనిచేయాల్సింది దేశ సేవ కోసమే కానీ రాజకీయ పార్టీలకు కొమ్ము కాసేందుకు కాదని వ్యాఖ్యానించారు. తిరుపతి లోక్‌సభ ఉపఎన్నిక సందర్భంగా వైసీపీ అక్రమాలకు వంత పాడి కెరీర్‌నే ప్రమాదంలో పడేసుకున్న అధికారుల్లా రాష్ట్రంలో ఏ అధికారులు కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) బ్యూరోక్రాట్లపై నిఘా పెట్టిందని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

లైట్... కెమెరా.. ఓవరాక్షన్!

» యూట్యూబ్ చానల్‌కు మంత్రి రజిని ఇంటర్వ్యూ

» ముందే అంతా సెటప్ చేసి జగన్ భజన

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 22: అది.. ఓ యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూ! వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినితో 'మాటా మంత్రీ' ప్రోగ్రామ్! ఇందులో తప్పేముంది... ఎన్ని చానళ్లకైనా ఇంటర్వ్యూలు ఇచ్చుకోవచ్చు కదా అని అనుకుంటున్నారా! కానీ... అక్కడ జరిగింది అక్షరాలా అధికార దుర్వినియోగం! ప్రభుత్వ డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని ప్రేక్షక పాత్రలో కూర్చోబెట్టి మరీ మోగించిన ప్రచార భేరీ! చిలకలూరిపేట ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి విడదల రజినిని గుంటూరు పశ్చిమ స్థానానికి మార్చిన సంగతి తెలిసిందే. దీంతో... అటు కొత్త నియోజకవర్గంలో, రాష్ట్ర వ్యాప్తంగా క్రేజ్ కోసం 'ఇంటర్వ్యూ' ప్లాన్ చేశారు. 'గురువారం ఉదయం 9 గంటలకు గుంటూరు మెడికల్ కాలేజ్‌లోని జింఖానా మీటింగ్ హాల్‌కు రావాలి. తెల్లకోటు వద్దు. మామూలు దుస్తుల్లో రండి' అంటూ బుధవారం సాయంత్రం జిల్లాలోని డాక్టర్లు, సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు 'వాయిస్ మెసేజ్' పంపించారు. బహుశా... మంత్రి ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేశారేమో అని వారంతా అనుకున్నారు. ఉన్నతాధికారులు చెప్పినట్లుగానే వారంతా సివిల్ డ్రస్‌లో మెడికల్ కాలేజ్ వద్దకు చేరుకున్నారు. ఆ తర్వాత జరిగిన సన్నివేశం చూసి డాక్టర్లు, సీహెచ్‌వోలు విస్తుపోయారు. ఓ యూట్యూబ్ చానల్‌కు మంత్రి ఇంటర్వ్యూ ఇచ్చే క్రమంలో తమను సామాన్య ప్రజలుగా చూపించేందుకు పిలిపించారని తెలుసుకుని అవాక్కయ్యారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో ఆరోగ్యశాఖ పనిచేస్తోందన్న స్థాయిలో మంత్రి రజిని గొప్పలు చెప్పారు. అంతకుముందు తామంతా పని చేయకుండానే జీతాలు తీసుకున్నామా అని చాలామంది సీనియర్ వైద్యులు రుసరుసలాడారు. జగనన్న ఆరోగ్య సురక్షతోనే అద్భుతాలు సృష్టించినట్లు మంత్రి చెప్పడం చూసి.. క్యాంపు రోజున తమతో వందల కొద్దీ దొంగ ఓపీలు ఆన్‌లైన్ చేయిస్తున్నారుగా అని సీహెచ్‌వోలు చెవులు కొరుక్కున్నారు. మంత్రి ఇంటర్వ్యూ మొత్తం సొంత డబ్బానే తప్ప నిజాలు లేవని, దానికి మమ్మల్ని పిలిచి ఇబ్బంది పెట్టారని పలువురు సిబ్బంది వ్యాఖ్యానించారు. మంత్రి ఇంటర్వ్యూ కోసం గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య సిబ్బందిని పిలిపించడంతో... గ్రామాల్లో ఆస్పత్రులకు వచ్చిన రోగులు ఇబ్బంది పడ్డారు. అధికారులు తెప్పించిన భోజనాలు కొద్దిమందికే సరిపోవడంతో, మిగిలినవారు ఆకలితోనే తిరుగుముఖం పట్టారు.

వైసీపీ మరో చీప్ ట్రిక్!

» జయసుధ వైసీపీలో చేరారంటూ సోషల్ మీడియాలో హడావుడి

» పాత వీడియో కొత్తగా విడుదల

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రత్యర్థులను కించపరిచేలా పోస్టులు పెట్టి వారి ప్రతిష్ఠను మసకబార్చేందుకు సీఎం జగన్‌కు చెందిన వైసీపీ సోషల్ మీడియా చేయని చౌకబారు ప్రయత్నం లేదు. సొంత చెల్లెలు, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై పేటీఎం బ్యాచ్ ఎంత అసభ్యకరమైన పోస్టులు పెట్టినా ఆయన చలించలేదు. ఆమె విమర్శలకు జవాబులు చెప్పలేక ఏకంగా అరెస్టుకే తెగించిన జగన్ అండ్ కో.. ఇంకో చీప్ ట్రిక్‌కు తెరలేపింది. సీనియర్ నటి, ప్రస్తుతం బీజేపీలో ఉన్న జయసుధ అప్పుడెప్పుడో ఏళ్ల కిందట హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకొన్నారు. ఆ తర్వాత గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరారు. చెల్లెలు క్రైస్తవురాలు కాబట్టి క్రిస్టియన్ అయిన జయసుధ వైసీపీలో చేరారంటే క్రైస్తవులంతా తమకు మద్దతిస్తారని జగన్ అండ్ కో భావించినట్లు కనబడుతోంది. అంతే.. జయసుధ వైసీపీలో చేరిన పాత వీడియోను సోషల్ మీడియాలో తాజాగా విడుదల చేశారు. మరుక్షణమే కొందరు పాస్టర్లు ఆమెను అభినందిస్తూ ఆమెకు మెసేజ్‌లు పెట్టడం మొదలుపెట్టారు. 'మంచి పని చేశావమ్మా.. కష్టకాలంలో వైసీపీలోకి చేరి.. పార్టీకి ఊపిరిస్తున్నావు' అని దీవించారు కూడా. గురువారం ఉదయం నుంచి ఒక్కసారిగా వరుస ఫోన్లు, వాట్సాప్ మెసేజ్‌లు వెల్లువెత్తడంతో జయసుధ విస్మయం చెందారు. ఇందులో రాజకీయ మర్మమేదో ఉందని గ్రహించారు. తాను వైసీపీలో ఉన్నప్పుడు గౌరవం, గుర్తింపూ ఇవ్వలేదని 'ఆంధ్రజ్యోతి'తో ఆమె అన్నారు. బీజేపీలో ప్రశాంతంగా ఉన్నానని.. తనను వైసీపీలోకి తీసుకోవాలంటే జగన్ ముందుగా ప్రధాని మోదీ అనుమతి తీసుకోవాలని చురకలంటించారు.

సిగ్గు.. సిగ్గు!

జగనన్న 'సిద్ధం'తో ఆర్టీసీకి నష్టం

నిర్వహించిన మూడు 'సిద్ధం' సభలకు పెద్ద ఎత్తున బస్సులను పంపిన ఆర్టీసీకి దాదాపు 5 కోట్లకు పైగా నష్టం కలుగజేశారు. పేదలకు రూపాయి తక్కువైతే టికెట్ ఇవ్వని ఆర్టీసీ జగన్‌కు మాత్రం కోట్ల రూపాయలు డిస్కౌంట్ ఇస్తోంది. ఆయన పార్టీ వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం నిర్వహిస్తున్న సభలకు ఆర్టీసీ భారీ రాయితీ ఇస్తోంది. 'సిద్ధం' సభలకు ఆర్టీసీ బస్సులు తరలించినందుకు అద్దె పదికోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, వైసీపీ ఆర్టీసీకి ఇచ్చింది ఐదు కోట్లు మాత్రమే. సామాన్య ప్రజలకు అద్దెకిచ్చినా, ప్రయాణికుల్ని గమ్యం చేర్చినా వచ్చే ఆదాయంతో.. జగనన్న సిద్ధం సభలకు పంపిన బస్సులకు ఇచ్చిన అద్దెను పోలిస్తే సగం ఆదాయం కోత పడింది.

బస్సులన్నీ రాప్తాడుకే

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో సామ, దాన, బేధ, దండోపాయాలకు సిద్ధమైన అధికార వైసీపీ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో మూడు కీలక సభలు ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి జగన్ ఒక్కరినే ఫోకస్ చేస్తూ 'సిద్ధం' పేరుతో ఉత్తరాంధ్ర(భీమిలి), కోస్తాంధ్ర(దెందులూరు), రాయలసీమ(రాప్తాడు)లో గతనెల చివరి వారం నుంచి ఈ నెల మూడో వారం మధ్యలో సభలు నిర్వహించింది. భారీగా జనాన్ని సమీకరించి తమ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గలేదని చూపించుకోవడానికి నానా అగచాట్లు పడింది. ప్రయాణికుల ఇబ్బందుల్ని పట్టించుకోకుండా బస్సులను దాదాపుగా సిద్ధం సభలకు పంపాలని ఆర్టీసీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ప్రతిపక్ష పార్టీలు ముందుగానే మొత్తం డబ్బులు చెల్లిస్తామని చెప్పినా బస్సులు పంపేందుకు ససేమిరా అన్న ఆర్టీసీ అధికారులు... అధికార వైసీపీ సభలకు మాత్రం వారిచ్చిందే మహాభాగ్యం అంటూ అడిగినన్ని బస్సులు మళ్లించేశారు. నాలుగు రోజుల క్రితం అనంతపురం శివారులోని రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు ఏపీఎస్ఆర్టీసీ పదమూడు కొత్త జిల్లాల నుంచి మూడు వేల బస్సుల్ని అద్దెకిచ్చింది. అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచి 374 బస్సులు, అన్నమయ్య 335, కడప 333, అనంతపురం 301 బస్సులు పంపించింది. బస్సులతో జనాన్ని తరలించినందుకు కి.మీ.కు సగటున రూ.46 చొప్పున మొత్తం 19.10 లక్షల కి.మీ.కు వైసీపీ 8.79 కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లించాల్సి ఉంది. అయితే ఐదు కోట్లు మాత్రమే చెల్లించింది. ఇదేంటని అధికారులు అడిగితే 'ఏదో ఒకటి సర్దుకో అదే ఎక్కువ' అనే రీతిలో ఆ పార్టీ నేతలు అహంకారం ప్రదర్శించారు. జగన్ సభకు పంపిన ఆర్టీసీ బస్సులను కి.మీ. లెక్క ప్రకారం కాకుండా రోజు వారీ అద్దెకు ఇచ్చామని కొందరు అధికారులు చెబుతున్నారు. ఆ ధరల ప్రకారం తీసుకున్నా రోజుకు పల్లె వెలుగు బస్సుకు రూ.24,960, అల్ట్రా పల్లె వెలుగు బస్సుకు రూ.29,760 వసూలు చేస్తారు. రెండు ధరలకు మధ్యలో సరాసరి రూ.27,500 అనుకున్నా మూడు వేల బస్సులకు అద్దె మొత్తం రూ.8.25 కోట్లు అవుతుంది. అంటే.. ఏ రకంగా చూసినా జగన్ పార్టీ నేతలు చెల్లించిన ఐదు కోట్ల రూపాయలు ఆర్టీసీ అద్దెకు సరిపోదు. ఇక భీమిలి సభకు 1000, దెందులూరు సభకు 1200 బస్సులు ఇచ్చిన ఆర్టీసీకి వాటి అద్దె కూడా వైసీపీ పూర్తిగా చెల్లించలేదు. మొత్తం మూడు సభలకు గానూ ఐదు కోట్లకు పైగా నష్టం వచ్చిందని అంటున్నారు.

- ఆర్టీసీ నాన్ ఏసీ బస్సులను ప్రజలకు పెళ్లిళ్లు లేదా ఇతరత్రా యాత్రలకు ఇస్తే కిలోమీటరుకు కనీసం రూ.41 నుంచి గరిష్ఠంగా రూ.52 వరకు అద్దె వసూలు చేస్తుంది. ఈ లెక్కన సగటున తీసుకున్నా కి.మీ.కు రూ.46 అద్దె అవుతుంది.
- రాప్తాడులో జరిగిన జగన్ 'సిద్ధం' సభకు ఆర్టీసీ 3 వేల బస్సులు పంపింది. జనాన్ని తరలించడానికి ఈ బస్సులు మొత్తం 19.10 లక్షల కి.మీ. తిరిగాయి. కి.మీ.కు రూ.46 చొప్పున తీసుకున్నా వైసీపీ సుమారు 8.79 కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లించాలి. కానీ జగన్ పార్టీ ఐదు కోట్లు మాత్రమే చెల్లించింది. అంటే.. ఒక్క రాప్తాడు సభతో ఆర్టీసీకి 3.79 కోట్లు నష్టమన్న మాట.
- భీమిలి సభకు 1000 బస్సులు, దెందులూరు సభకు 1200 బస్సులను ఆర్టీసీ కేటాయించింది. వీటి అద్దెను కూడా వైసీపీ నుంచి పూర్తిగా వసూలు చేయలేకపోయింది.

ప్రయాణికులకు నరకం

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండేది ఆర్టీసీ ఒక్కటే. ఈ నెల 18న రాప్తాడు సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులన్నీ తరలించడండంతో ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రాయలసీమ జిల్లాలతో పాటు గుంటూరు వరకూ 25లక్షల మంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. జగన్ ఏ జిల్లాలో సభ పెట్టినా ఆ రోజు ఆ జిల్లాలోని విద్యా సంస్థలకు డీఈవో సెలవు ప్రకటిస్తారు. రాప్తాడు సభకు మొత్తం 2 వేల బస్సుల్ని పంపించాలంటూ అధికార పార్టీ నాయకులు రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు, విద్యా శాఖ అధికారుల ద్వారా విద్యా సంస్థలపై ఒత్తిడి తెచ్చారు. బెదిరించి మరీ బస్సుల్ని బలవంతంగా సభకు మళ్లించారు.

జగన్ కోసం మరో 2 హెలికాప్టర్లు

ఒక్కోదానికి నెలకు లీజు రూ. 1.91 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ ఎక్కడికెళ్లినా ప్రత్యేక విమానంతో పాటు హెలికాప్టర్‌ను వినియోగిస్తుంటారు. అవసరాన్ని, వాడకాన్ని బట్టి వీటికి అద్దె చెల్లిస్తుంటారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇవికాకుండా మరో రెండు హెలికాప్టర్లు లీజుకు తీసుకుంటున్నారు. వాటిలో ఒకదాన్ని గన్నవరంలో, మరోదాన్ని విశాఖ విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచనున్నారు. దీనివల్ల అవసరం ఉన్నా లేకపోయినా నెలనెలా లీజు చెల్లించాల్సిందే. మరో 15రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఆ తర్వాత పార్టీ ప్రచారం కోసం వీటిని వాడుకోవడం కుదరదు. అయినా ఇంత తక్కువ సమయానికి హెలికాప్టర్లను ఎందుకు లీజుకు తీసుకుంటున్నారో? హెలికాప్టర్లను లీజుకు తీసుకోవాలని రాష్ట్ర ఏవియేషన్ కార్పొరేషన్‌కు ఆదేశాలు వెళ్లాయి. టెండర్లు కూడా పిలిచారు. గ్లోబల్ వెక్ట్రా ఎల్-1గా నిలిచిందంటూ ప్రభుత్వం పేర్కొంది. ఒక్కో హెలికాప్టర్‌కు నెలకు రూ.1,91,75,000 లీజు చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. లీజుకు అదనంగా ఎయిర్‌పోర్టులో గ్రౌండ్ హ్యాండ్లింగ్ చార్జీలు, పైలట్లకు స్టార్ హోటల్‌లో వసతి, భోజనాలు, రవాణా, ఇంధన చార్జీలు, వైద్య సేవల ఖర్చులూ భరించాల్సి ఉంటుంది. హెలికాప్టర్‌ను ఎయిర్‌పోర్టులో నిలిపి ఉంచినందుకు గాను గంటల ప్రాతిపదికన చెల్లించాలి. ఈ ఖర్చులన్నింటిని ప్రభుత్వమే భరిస్తుంది. జగన్ జెడ్ ప్లస్ కేటగిరి భద్రతలో ఉన్నారని, ఆయనకు ముప్పు ఉన్నందున రెండు హెలికాప్టర్లను తీసుకుంటున్నట్లుగా ప్రభుత్వం వెల్లడించింది. గురువారం రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పనా శాఖ 7వ నంబరుతో ఉత్తర్వు జారీ చేసింది. 2010 నుంచి సీఎం కోసం రాష్ట్ర ప్రభుత్వం బెల్ 412 వీటీ ఎయిర్‌క్రాఫ్ట్‌ను వినియోగిస్తోంది. ముఖ్యమంత్రి భద్రతరీత్యా హెలికాప్టర్‌ను మార్చాల్సి ఉందని ఇంటెలిజెన్స్ డీజీ నివేదించారని ప్రభుత్వం పేర్కొంది. దీంతో కొత్తగా రెండు హెలికాప్టర్లను లీజుకు తీసుకోవడానికి రాష్ట్ర ఏవియేషన్ కార్పొరేషన్ టెండర్లను పిలిచింది. గ్లోబల్ వెక్ట్రా హెలికాప్టర్స్, తంబీ ఏవియేషన్ ప్రైవేటు లిమిటెడ్, రాజాస్ ఎయిరో స్పోర్ట్స్ అడ్వెంచర్స్ లిమిటెడ్ సంస్థలు ముందుకు వచ్చాయి. హెలికాప్టర్లకు డబుల్ ఇంజిన్లు ఉండాల్సిందేనని కార్పొరేషన్ స్పష్టం చేసింది. టెండర్ కమిటీ గతనెల 10న సమావేశమై మెసర్స్ గ్లోబల్ వెక్ట్రా హెలికాప్టర్స్‌కు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. జగన్ తరహాలో ఉమ్మడి ఏపీ నుంచి ఏ సీఎం కూడా ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడలేదని రాజకీయవర్గాలు విమర్శిస్తున్నాయి. పార్టీ ప్రచారం కోసం చేసే పర్యటన ఖర్చులన్నింటినీ పార్టీ ఖాతా నుంచి ఖర్చు చేసేవారని చెబుతున్నారు. జగన్ ఇష్టారీతిన వాడేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సీఎం వస్తున్నారు..ఖర్చులకు డబ్బులివ్వండి!

జగన్ కుప్పం పర్యటన కోసం అవస్థలు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి వస్తున్నారు. ఆయన పర్యటనకు డబ్బులు ఖర్చవుతాయి. మా దగ్గరేమో డబ్బుల్లేవు. రూ.2కోట్లు సర్దండి. తర్వాత తిరిగి చెల్లిస్తాం"... అటూఇటుగా చిత్తూరు జిల్లా కలెక్టర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు చేసుకున్న విన్నపమిది! రాష్ట్ర ఖజానా ఒట్టిపోయిందని... సీఎం పర్యటనలకూ డబ్బులివ్వలేని దుస్థితి తలెత్తిందనేందుకు ఇదే నిదర్శనం. ఈ నెలాఖరులో సీఎం జగన్ చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటించనున్నారు. సహజంగా... సీఎం పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించిన శాఖలే పర్యటన ఖర్చులు భరించాలి. లేదా... కలెక్టర్ల వద్ద ఉండే కంటింజెన్సీ నిధులను ఉపయోగిస్తారు. కానీ... శాఖలు ఇవ్వడంలేదు. కలెక్టర్ల వద్ద నిధుల్లేవు. దీంతో... చిత్తూరు కలెక్టర్ సగిలి షణ్మోహన్ గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ఎండీకి లేఖ రాశారు. "ఈ నెలలో సీఎం చిత్తూరు జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆ ఏర్పాట్లకోసం డబ్బులు అవసరం. చిత్తూరు హౌసింగ్ డిపార్ట్‌మెంట్ వద్ద అందుబాటులో ఉన్న రూ.2 కోట్లను మా ఖాతాలో జమ చేయాలని మీ ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించండి. ఇది బాగా అత్యవసరమైన పని. మీ డబ్బులు తిరిగి చెల్లించేస్తాం" అని కలెక్టర్ పేర్కొన్నారు. దీనిపై హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఏవిధంగా స్పందిస్తారనేది వేచి చూడాల్సి ఉంది. గతేడాది సీఎం విజయనగరం జిల్లా పర్యటనకు వెళ్లినప్పుడు డబ్బులు సమకూర్చాలని ఉన్నత విద్యామండలికి ఆ జిల్లా కలెక్టరు లేఖ రాసిన విషయం తెలిసిందే. అప్పుడు విద్యార్థులు ఫీజుల రూపంలో చెల్లించిన డబ్బులు సర్దారు. జగన్ సర్కారు ఏటా రూ.లక్షల కోట్ల బడ్జెట్‌ను ఘనంగా ప్రవేశపెడుతోంది. కానీ సీఎం జిల్లాల పర్యటనలకు ఏర్పాట్లు చేయడానికి కలెక్టర్లు నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏమిటో అర్థం కాదు. చివరకు పేదల గృహ అవసరాల కోసం హౌసింగ్ కార్పొరేషన్ వద్ద ఉండే డబ్బులనూ వాడుకోవడం గమనార్హం. నిజానికి ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వానికి చెందినవి కాదు. పీఎంఏవై కింద పేదల ఇళ్ల నిర్మాణం కోసం కేంద్రం రాయితీగా ఇస్తున్న డబ్బులివి. ఇళ్లు నిర్మించుకున్న పేద లబ్ధిదారులకు వాటిని చెల్లించాలి. కానీ, సకాలంలో బిల్లులు మంజూరు చేయకుండా ఇతర అవసరాలకు హౌసింగ్ అధికారులు వాటిని దారి మళ్లిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న హౌసింగ్ నిధుల్లోంచి కొంత సీఎం కార్యక్రమం ఏర్పాట్లకు సర్దాలని కలెక్టర్ అభ్యర్థించారు.



అనంతపురం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

గర్జించిన కలం

నిర్బంధాలను దాటుకుని 'చలో అనంత'కు వెల్లువెత్తిన జర్నలిస్టులు

అనంతపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి)/కావలి, తిరుపతి (తిలక్‌రోడ్): అనంతపురం వెళ్లకుండా ముందస్తు అరెస్టులు.. గృహ నిర్బంధాలు..జర్నలిస్టుల ఇళ్లకు వెళ్లి నోటీసులు.. పోలీస్‌స్టేషన్లకు పిలిచి బెదిరింపులు.... అయినా 'చలో అనంతపురం'లో కలాల కవాతును ఇవేవీ ఆపలేకపోయాయి. 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడిపై జర్నలిస్టుల ఆగ్రహం వెల్లువెత్తింది. పత్రికా స్వేచ్ఛను తొక్కిపెట్టిన శక్తులను ధిక్కరిస్తూ అనంత వీధుల్లో వందలాది మంది జర్నలిస్టులు గురువారం కదం తొక్కారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి పెద్దఎత్తున రిపోర్టర్లు, మీడియా జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు కదిలివచ్చారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక లేదా అంటూ నిలదీశారు. దాడి జరిగి నాలుగు దాటిపోయినా ముఖ్యమంత్రి, డీజీపీ నోరుమెదపకోవడం.. 'సిగ్గు సిగ్గు' అంటూ ఆగ్రహ స్వరంతో నినదించారు. అనంతపురంలోని సంగమేశ్వర సర్కిల్ నుంచి పదకొండు గంటలకు ర్యాలీ మొదలయింది. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు పాల్గొన్నారు. మద్దతుగా కదిలిన టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఆయా పార్టీల అనుబంధ సంఘాలు, ఏపీఎన్జీవో, పెన్షనర్స్ అసోషియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, శ్రేణులతో ప్రాంగణం నిండిపోయింది. శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ గూండాలందరినీ అరెస్టు చేయాలని, వారిపై రౌడీషీట్ తెరవాలని జర్నలిస్టు నేతలు డిమాండ్ చేశారు. 'తిరగబడే దాకా తెచ్చుకోకుండా కఠిన చర్యలు తీసుకోండి' అని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి శ్రీకృష్ణపై దాడికి పాల్పడిన అందరిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని కోరారు. జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు అధికారమిచ్చింది జర్నలిస్టులపై దాడులు చేసేందుకేనా అని ఐజేయూ జాతీయ ప్రధాన కార్యదర్శి సోమసుందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై రౌడీషీటు తెరవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ డిమాండ్ చేశారు.

జిల్లాల్లో కదిలిన జర్నలిస్టులు

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ నెల్లూరు జిల్లా కావలి, చేజర్లలో పాత్రికేయులు ఆందోళన చేపట్టారు. కావలిలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కాంగ్రెస్, టీడీపీ, న్యూడెమోక్రసీ, సీపీఎం, స్త్రీవిముక్తి సంఘటన, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు. చేజర్లలో ఏపీఎంపీఏ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి సురేశ్ తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దారుకు, పోలీస్‌స్టేషన్లలో వినతిపత్రాలు ఇచ్చారు.

నిరసన బ్యాడ్జీలతో మీడియా కవరేజి

జర్నలిస్టులపై దాడులపై ఆగ్రహించిన తిరుపతి జర్నలిస్టులు ఇకనుంచి నిరసన బ్యాడ్జీలు ధరించి వైసీపీ సహా అన్ని పార్టీల కార్యక్రమాలను కవర్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బ్యాడ్జీలను ఆవిష్కరించారు.

జర్నలిస్టులపై దాడి దుశ్చర్య!

» నేను ఖండిస్తున్నా: మంత్రి కారుమూరి

తిరుమల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడిని ఖండిస్తున్నానని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చెప్పారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ 'జర్నలిస్టులపై దాడి అనేది చాలా తప్పు. హేయమైన పని. జర్నలిస్టులు నిత్యం ప్రజలకు చేరువగా ఉంటూ, క్షణాల్లో అన్ని విషయాలను ప్రజలకు తెలిపేలా పనిచేస్తారు. వారిపై దాడి దుశ్చర్య. దాడులను ఖండిస్తున్నా' అన్నారు.

సీఎం సభ... విద్యార్థులకు 'పరీక్ష'!

నేడు ఒంగోలులో జగన్ సభ

» నేటినుంచి టెన్త్ విద్యార్థులకు ప్రీఫైనల్స్

» మిగిలిన తరగతులకు ఎఫ్ఏ-4 ఎగ్జామ్స్

» ప్రైవేటు స్కూళ్ల బస్సులు 385 స్వాధీనం

» ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

» లబ్ధిదారులు కుటుంబంతో రావాలని హుకుం

» జన సమీకరణకు ఆర్పీలు.. వలంటీర్లపై ఒత్తిడి

» ఇప్పుడు హడావుడిగా రోడ్లు, విద్యుత్ సౌకర్యం

» సభ విజయవంతం కోసం అధికారుల ఆరాటం



క్వారీ డస్ట్‌తో రోడ్డు వేస్తున్న దృశ్యం

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 22: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభ అంటేనే జనం గడగడలాడుతున్నారు. ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో ప్రజల్లో సానుభూతి కోసం వైసీపీ నేతలు తెగ పాకులాడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఒంగోలులో పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సీఎం జగన్ పాల్గొనే ఈ సభను విజయవంతం చేయడానికి అటు అధికార పార్టీ నాయకులు, ఇటు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. సభా ప్రాంగణానికి భారీగా జనాన్ని తరలించేందుకు విద్యాసంస్థల బస్సులతో పాటు ఆర్టీసీ బస్సులను కూడా కేటాయించడంతో విద్యార్థులు, ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. శుక్రవారం నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్స్, మిగిలిన తరగతులకు ఎఫ్ఏ-4 పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 385 స్కూలు బస్సులను సీఎం సభకు తీసుకోవడంతో కొన్ని స్కూలు యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. జిల్లాలోని అన్ని ఆర్టీసీ డిపోల నుంచి 506 బస్సులను సీఎం సభ కోసం గురువారమే స్వాధీనం చేసుకోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

సీఎం మెప్పు కోసం.. పరుగులు

పేదలకు పట్టాల పేరుతో ప్రజల్లో ప్రచారం కోసం వైసీపీ నేతలు చేస్తున్న ఆర్భాటానికి అధికారులు వంతపాడుతున్నారు. వారంరోజులుగా కార్యాలయాల్లో సాధారణ విధులను సైతం వదిలేసి అధికార పార్టీ ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ సీఎం సభను సక్సెస్ చేసే పనిలో ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టాలు ఇస్తున్న ప్రాంతంలో హడావుడిగా రెండురోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసి, రోడ్లు వేయించారు.

భారీగా జనాన్ని తీసుకు రావాల్సిందే

సీఎం సభను విజయవంతం చేయాల్సిన బాధ్యతను ఆ పార్టీ నేతలు మెప్మా, డీఆర్‌డీఏ అధికారులపై పెట్టారు. ఒంగోలులో మెప్మా ఆర్పీలు, సీవోలు, ఇతర అధికారులతో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సీఎం సభకు ప్రజలను, పొదుపు మహిళలను భారీగా తీసుకురావాల్సిన బాధ్యత వారిపై పెట్టారు. ప్రతి ఇంటి నుంచి కనీసం నలుగురు సభకు రావాలని, రాకపోతే పథకాల్లో కోతలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మరోవైపు పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ ప్రభుత్వ కార్యక్రమం అయినా కూడా సభా వేదికను వైసీపీ రంగులతో అలంకరించారు. రైల్వే గేటు వద్ద నుంచి కొప్పోలు, సభావేదిక వరకు వైసీపీ ఫ్లెక్సీలతో ముంచేశారు.

వైసీపీకి ఎంపీ మాగుంట గుడ్‌బై?!

» సీఎం సభకు గైర్హాజరు కావాలని నిర్ణయం

ఒంగోలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీకి మరో షాక్ తగలబోతోంది!. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కూడా పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయినట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే శుక్రవారం ఒంగోలులో సీఎం జగన్ పర్యటనలో పాల్గొనకూడదన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. నిజానికి చాలారోజుల నుంచి వైసీపీ అధిష్ఠానం మాగుంటను దూరం పెట్టింది. జగన్ అభీష్టాన్ని గుర్తించిన జిల్లా నాయకులు కూడా ఇటీవల ఆయనను పార్టీ కార్యక్రమాలకు పిలవటం లేదు. అయినా ఇటీవల ఢిల్లీ వెళ్లిన జగన్‌కు మాగుంట నేరుగా ఎదురెళ్లి రెండు చేతులు జోడించి నమస్కారం చేశారు. జగన్ ప్రతి నమస్కారం చేయకపోగా కనీసం పలకరించకుండా అవమానించారు. అయినా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం కాబట్టి ఒంగోలులో జరిగే సీఎం సభకు పిలుస్తారని మాగుంట, ఆయన ముఖ్య అనుచరులు ఎదురుచూశారు. అయితే అధికారుల నుంచి నిబంధనల మేరకు ఆహ్వానం రావటం తప్ప వైసీపీ నేతల నుంచి పిలుపురాలేదని తెలిసింది. అధికారిక కార్యక్రమం కాబట్టి మర్యాదపూర్వకంగా సీఎం సభకు వెళ్లి రావాలన్న ఆలోచనతో తర్జనభర్జన పడిన మాగుంట.. చివరికి సభకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. ముఖ్య అనుచరులు కూడా సభకు వెళ్తే మరోసారి అవమానపడాల్సి వస్తుందని చెప్పినట్లు తెలిసింది. ఇంకా వైసీపీలో ఉండటం కూడా మర్యాద కాదని వెంటనే నిర్ణయం తీసుకోవాలని అనుచరుల నుంచి రెండు రోజులుగా ఒత్తిడి పెరిగినట్లు సమాచారం. దీంతో మాగుంట కూడా వైసీపీని వీడాలన్న నిర్ణయానికి వచ్చి సీఎం సభకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. వచ్చే వారంలో ఆయన వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలోకి వెళ్లే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

పది పరీక్షలకు 7.25 లక్షల మంది!

» వారిలో లక్ష మందికిపైగా గతంలో ఫెయిలైనవారు

» పరీక్ష కేంద్రాలు 3,473.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ఈసారి 7,25,150 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో 1,02,058 మంది గతంలో ఫెయిలై, రీఎన్‌రోల్ చేసుకున్న వారున్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలు ఉన్నారు. మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాట్లు చేస్తోంది. ఏర్పాట్లపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం సమీక్షించారు. గతేడాది సైన్స్ రెండు పేపర్లకు ఒకేరోజు పరీక్ష నిర్వహించగా, ఈ ఏడాది మళ్లీ పాత పద్ధతిలో వేర్వేరుగా రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహించబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3,473 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేస్తుండగా, అందులో 137 సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఆర్టీసీ బస్సుల్లో హాల్ టికెట్‌ను చూపించి పరీక్షల కేంద్రాలకు ఉచితంగా ప్రయాణం చేయొచ్చని ప్రభుత్వం తెలిపింది. పరీక్షల ఏర్పాట్లపై విజయవాడలో సమీక్ష నిర్వహించిన మంత్రి బొత్స మాట్లాడుతూ... రానున్న కాలంలో మొత్తం 20 లక్షల మంది విద్యార్థులు వివిధ రకాల పరీక్షలకు హాజరుకాబోతున్నారని చెప్పారు. పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్‌కు 1,559 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని, 10,52,221 మంది పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే 47,921 మంది పెరిగారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్, రీఎన్‌రోల్ విద్యార్థులు హాజరవుతారని, 682 సిటింగ్ స్క్వాడ్, 156 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటుచేశామన్నారు.

120 కేంద్రాల్లో టెట్

ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష)కు 2,79,685 మంది హాజవుతారని, 120 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని మంత్రి బొత్స చెప్పారు. ఏపీతోపాటు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఖమ్మం, కోదాడ ప్రాంతాల్లోనూ పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు టెన్త్, ఇంటర్ పరీక్షలు మార్చి 18 నుంచి 26 వరకు జరుగుతాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి 34,635 మంది, ఇంటర్ 76,572 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. సీబీఎస్ఈ పదో తరగతి పాఠ్య ప్రణాళిక మాడ్యూళ్లను మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రంలో వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ అమలవుతోందన్నారు.

కడప ఎస్పీని కలిసిన వివేకా కుమార్తె

» తప్పుడు కేసులు, సోషల్ మీడియాలో పోస్టులపై ఫిర్యాదు!

కడప (క్రైం), ఫిబ్రవరి 22: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీతారెడ్డి తన భర్త రాజశేఖర్‌రెడ్డితో కలిసి గురువారం కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిశారు. వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి తనపైన అనవసరంగా పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పులివెందులకు చెందిన వైసీపీ నేత వర్రా రవీంద్రారెడ్డి సోషల్ మీడియాలో తమపై అసభ్యంగా పోస్టులు పెడుతున్న విషయం ఎస్పీ దృష్టికి ఆమె తీసుకెళ్లినట్లు తెలిసింది. వివేకా కేసులో తాజా పరిణామాల సందర్భంగా జరుగుతున్న ఘటనలపై కూడా మాట్లాడినట్లు చెబుతున్నారు. ఎన్నికల వేళ ఎస్పీని ఆమె కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఎస్పీ కార్యాలయంలో సునీత దంపతులు గంటపాటు ఉన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడకుండానే కారులో వెళ్లిపోయారు.

దస్తగిరికి బెయిల్ రాకుండా చేస్తున్నారు: షబానా

కడప క్రైం, ఫిబ్రవరి 22: దస్తగిరితోపాటు తమ కుటుంబాన్ని ఏదో చేయాలని పులివెందులకు చెందిన వైసీపీ నాయకులు కుట్ర పన్నుతున్నారని వివేకా హత్య కేసులో అప్రూవర్ అయిన దస్తగిరి భార్య షబానా ఆరోపించారు. గురువారం కడప సెంట్రల్ జైలులో దస్తగిరిని కలిసి బయటికి వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడారు. 'నా భర్తకు రెండు కేసుల్లో బెయిలు మంజూరైనా, ఎఫ్ఐఆర్‌లో పేరు మార్చి బెయిలు రాకుండా చేస్తున్నారు' అని షబానా ఆవేదన వ్యక్తం చేశారు. 'నా భర్త బయటకు వస్తే వారికి వచ్చిన ఇబ్బందేమిటి? వైఎస్ వివేకాను వాళ్ల వాళ్లే చంపకపోతే ఎందుకు నా భర్తకు భయపడుతున్నారు? జైలులో వైసీపీ నాయకులు నా భర్తను కలిసి ప్రలోభాలకు గురి చేస్తున్నారు. సీబీఐ అధికారులపై తప్పుడు సాక్ష్యం చెప్పాలని ప్రలోభ పెడుతున్నట్లు నా భర్త నాకు చెప్పాడు. సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఇదంతా చేయిస్తున్నారు' అని షబానా ఆరోపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas,
RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

జగనన్న పథకం సబ్సిడీ విడుదల చేయండి

ధర్నాచౌక్: దళిత, గిరిజనుల అభివృద్ధికి ఆయా వర్గాల చిన్న తరహా పారిశ్రామికులకు 2020లో 'వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం' పథకం లబ్ధిదారులకు వెంటనే సబ్సిడీ విడుదల చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. తక్షణమే సబ్సిడీ నిధులను విడుదల చేయకుంటే స్థానిక ధర్నాచౌక్‌లో ధర్నా చేపడతామన్నారు. దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తల సమావేశం గాంధీనగర్‌లోని కందుకూరు కల్యాణమండంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు సబ్సిడీ రాయితీలు విడుదల చేయకపోవడంతో లబ్ధిదారులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురై వ్యాపారాలు నష్టపోయే పరిస్థితికి వచ్చాయన్నారు. ప్రతినెల బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నారని దీంతో బ్యాంక్ సిబిల్ స్కోర్ కోల్పోతున్నారన్నారు. సిబిల్ స్కోర్ పోతే భవిష్యత్‌లో బ్యాంకుల నుంచి లోన్లు మంజూరయ్యే పరిస్థితి ఉండదన్నారు.డీబీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాల మహానాడు జాతీయాధ్యక్షుడు అశోక్‌కుమార్, నత్త నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సాయంత్రం కేవీ మహదేవన్ సంగీత స్వరాలు పేరిట సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు ఉమాబలరాం, సుధా శ్రీనివాస్, దండు చంద్రశేఖర్, విష్ణుప్రియ, భాగ్యశ్రీ, హరికృష్ణ, శ్రీనివాసరావు మధుర గానం చేశారు. అనంతరం బి.వీరభద్రరావును ఘనంగా సత్కరించారు. పరుచూరి విజయలక్ష్మి, కొప్పవరపు ఉమాబలరాం, శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ, చావా నరసింహరావు పాల్గొన్నారు.

రేపు మాతృభాషా ప్రజాచైతన్య సభ

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషా ఉద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 24న ప్రజా చైతన్య సభ నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ మొవ్వా శ్రీనివాస్ తెలిపారు. మాతృభాషలో బోధన విద్యారంగంలో నేటి పరిస్థితి, ప్రజల భాషలో పరిపాలన నేటి పరిస్థితి, ఏపీలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతోపాటు ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు.

షెడ్యూల్డు కులాల జోలికొస్తే రాజకీయ సమాధే!

వన్‌టౌన్: షెడ్యూలు కులాల జోలికి వస్తే ఏ రాజకీయ పార్టీకైనా సమాధికడతామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. నగరంలోని తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గురువారం జైమాల మహానాడు ఆధ్వర్యంలో జరిగిన మాలల ఐక్య సంగ్రామభేరి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీల్లో పదవులు అనుభవిస్తున్న 29 మంది ఎమ్మెల్యేలు ఏనాడూ మాలల అన్యాయంపై మాట్లాడలేదన్నారు తనకు పదవులు అవసరం లేదని, ఎవరికి భయపడాల్సిన పనిలేదని షెడ్యూల్డు కులాల అభ్యున్నతే ముఖ్యమన్నారు. తాను తలచుకుంటే రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెట్టే సత్తా ఉందన్నారు. నేతలు దేవతోటి నాగరాజు, సత్తెనపల్లి కిషోర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, పీవీరావు, వేరే నాగేశ్వరరావు, అంబటి కొండలరావు., నత్తనాగేశ్వరరావు, నూకపెయ్యి వెంకట్రావు, జే రాజు, చిన్నం సుశీల్, పత్తిపాటి అరుణకుమారి, డాక్టర్ మల్లీశ్వరి, దాస్ ప్రకాష్, మాలల జేఏసీ నేతలు పాల్గొన్నారు

విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని వెలికితీసేందుకే పోటీలు: వేములు

విజయవాడ కల్చరల్: విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తే వారిలో అంతర్లీనంగా ఉన్న విజ్ఞానం వెలికి తీయొచ్చని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. ప్రసన్న భారతి 27వ వార్షికోత్సవం సందర్భంగా సత్యనారాయణపురంలోని శిశువిద్యామందిరంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యగానం వంటి 8 పోటీల్లో 2700 మంది విద్యార్థులు పాల్గొనగా 330 మంది విజేతలుగా నిలిచారు. వారికి హజరత్తయ్యగుప్తా బహుమతులిచ్చారు. ఒలివేటి శివరామకృష్ణ, కేవీ పునీత్‌కృష్ణ, నాగరాజు, కల్యాణ్, ప్రసాద్, శాస్త్రి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకం కాదు.. పక్కన పెట్టారు..!

● వలంటీర్ల పురస్కారాల వేడుకలో గైర్హాజరైన కార్పొరేటర్లు ● అసహనంతో వలంటీర్ల ఆగ్రహం

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 22: వలంటీర్ల వ్యవస్థ తమ ప్రభుత్వంలో చాలా ప్రతిష్టాత్మకమైనదని సాక్షాత్తు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి డివిజన్ నేతల వరకు బాహాటంగా చెప్పుకుంటారు. కానీ 35వ డివిజన్, బాప్టిస్ట్ పాలెంలో గురువారం ఏర్పాటు చేసిన వలంటీర్ల పురస్కారాల వేడుకల్లో కార్పొరేటర్ల గైరాజరుతో వారు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని తెలుస్తోంది. 191వ సచివాలయంలో 34, 35, 54, 55, 56 డివిజన్ల వలంటీర్లకు సేవా పురస్కారాల అందించేందుకు మేయర్ భాగ్యలక్ష్మితో పాటు కేవలం 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మణిమ్మ మాత్రమే వచ్చారు. మిగిలిన 34, 54, 55, 56 డివిజన్ కార్పొటర్లు గైర్హాజరయ్యారు. కేవలం 5 డివిజన్ల వలంటీర్ల పురస్కారాల వేడుకను పార్టీ పశ్చిమ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మీ, కార్పొరేటర్ మణిమ్మ మాత్రమే చేపట్టారు. గైరాజరైన కార్పొరేటర్ల డివిజన్‌కు సంబంధించిన వలంటీర్లు తమ కార్పొరేటర్లు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రతి విషయానికి వలంటీర్లు కావాలి గానీ, తమ పురస్కారాల వేడుకకు మాత్రం సమయం లేదా, కావాలనే రాలేదంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు.



వేదికపై కార్పొరేటర్ మణిమ్మ తప్ప హాజరుకాని మిగతా కార్పొరేటర్లు

జలీల్‌ఖాన్‌తో కేశినేని చిన్ని భేటీ

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌ను బుధవారం రాత్రి టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) కలిశారు. జలీల్‌ఖాన్ వైసీపీలోకి వెళుతున్నాడన్న సమాచారం పొక్కడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు అధిష్టానం తరఫున చిన్ని రంగప్రవేశం చేశారు. వైసీపీ ఎంపీ, ముఖ్య నేత ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని జలీల్‌ఖాన్ కలవడం పశ్చిమ నియోజకవర్గ సీటు గురించి మాట్లాడడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని చిన్ని ఆయనతో మంతనాలు జరిపారు. పొత్తులో భాగంగా పశ్చిమ సీటును జనసేనకు ఇస్తున్నారన్న సమాచారం పార్టీ వర్గాల్లో చర్చకు వస్తున్న నేపథ్యంలో జలీల్‌ఖాన్ తాను వేరే ప్రత్యామ్నాయం చూసుకుని సీటు కోసం ప్రయత్నిస్తున్నాడన్న అంశంపై చిన్ని ఆయనను బుజ్జగించారు.

చిన్ని చేసిన మంత్రాంగం ఫలించి జలీల్‌ఖాన్ చల్లబడ్డట్టు చెబుతున్నారు. ఒకటి రెండ్రోజుల్లో నేరుగా జలీల్‌ఖాన్ టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ అధికార ప్రతినిధి నారా లోకేష్‌ను కలిసేందుకు నిర్ణయించారు.



బకాయిల చెల్లింపులో
వ్యాపారుల నిర్లక్ష్యం

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: దుర్గగుడిలో షాపుల నిర్వాహకులు బకాయిలు చెల్లించకుండా మొండికేస్తున్నారు. కనకదుర్గనగర్‌లో మొత్తం 24షాపులకు గాను 19 షాపులను వ్యాపారులు లీజులకు తీసుకున్నారు. ఒక్కో షాపునకు జీఎస్‌టీతో కలిపి నెలకు సుమారు రూ.1.05 లక్షలు చెల్లించాలి. అధికారుల నిర్లక్ష్యంతో సుమారు రూ.2కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం రావడంతో ఈవో రామారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు.దీంతో అధికారులు వసూళ్లకు ఉపక్రమించినా ఇప్పటి వరకు కేవలం సుమారు రూ 19లక్షల వరకు మాత్రమే వసూలైనట్లు సమాచారం. ఒక వ్యాపారి 2 షాపులు నిర్వహిస్తూ సుమారు రూ.25 లక్షల వరకు బకాయి పడ్డాడు. అడిగితే తనకు అధికార పార్టీ ఎమ్మెల్యే అండ ఉందని అధికారులను బెదిరిస్తున్నట్టు తెలుస్తోంది. మరో ఇద్దరు వ్యాపారులు ట్రస్ట్‌బోర్డులో కీలక వ్యక్తి చేత సిఫారసు చేయించుకుని కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రెండు నోటీసులిచ్చినా వ్యాపారులు పట్టించుకోవడం లేదు.



కనకదుర్గ నగర్‌లో షాపులు

లెనిన్ సెంటర్‌లో
వృద్ధురాలి హత్య

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: మద్యం సేవించడానికి డబ్బులివ్వలేదని ఓ హోటల్ కార్మికుడు లెనిన్‌సెంటర్ ఫుట్‌పాత్‌పై ఉంటున్న ఓ వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన రెండ్రోజుల క్రితం జరిగింది. గవర్నరుపేట పోలీసులు కడప జిల్లాకు చెందిన నిందితుడు ఆర్ల విజయశంకర్‌పై కేసు నమోదు చేసి గురువారం అరెస్టు చేశారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన గొల్లపూడి దుర్గ (74) 30ఏళ్ల నుంచి లెనిన్ సెంటర్ ఫుట్‌పాత్‌పై ఉంటూ పలు హోటళ్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇటీవల ఆమె గుండెపోటుతో ఇబ్బంది పడుతుంది. హోటల్‌లో పనిచేస్తూ ఫుట్‌పాత్‌పై జీవిస్తున్న విజయశంకర్ రెండ్రోజుల క్రితం రాత్రి మద్యం తాగి వృద్ధురాలి వద్దకు వెళ్లి మళ్లీ మద్యం సేవించడానికి డబ్బులడిగాడు. లేవని చెప్పడంతో శంకర్ ఆమెతో గొడవపడి ఆవేశంతో ఆమె గుండెపై కొట్టాడు. ఈ సంఘటనతో ఆమె అక్కడే పడిపోయింది. స్థానికులు 108 సిబ్బందికి ఫోన్ చేయగా వారు వచ్చి పరీక్షించి మరణించినట్టు ధ్రువీకరించారు. ఈ సంఘటన తెలుసుకున్న గవర్నరుపేట పోలీసులు ఘటనా ప్రదేశానికి వెళ్లి మృతురాలి వివరాలు తెలుసుకుని కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆమె కుమార్తెకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతురాలిని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు శంకర్‌పై 302 సెక్షన్ హత్యానేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

డిజిటల్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోండి

● రైతులకు కలెక్టర్ ఢిల్లీరావు సూచన

పటమట, ఫిబ్రవరి 22: ఆధునిక సాంకేతిక ప్రపంచంలో అందుబాటులో ఉన్న డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని రైతులు సుస్థిర ఆదాయాన్ని పొందొచ్చని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో నాబార్డ్ ఏపీ ప్రాంతీయ కార్యాలయం, స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం (ఎస్ఎఫ్ఏసీ) ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) సంయుక్త ఆధ్వర్యంలో తరంగ్ పేరుతో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం మేళాను కలెక్టర్ ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. నాబార్డ్ జీఎం డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, డీజీఎం సీఆర్ అబుకరాజన్‌తో కలిసి 44 స్టాళ్లను ఆయన సందర్శించి, నిర్వాహకులతో మాట్లాడారు. డిజిటల్ చెల్లింపులు చేసి ఒక ఎఫ్‌పీవో ఉత్పత్తిని స్వయంగా కొనుగోలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే ఈ ప్రదర్శనకు ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చి చిన్నరైతులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. నాబార్డ్ జీఎం డాక్టర్ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం లక్ష్యంగా నాబార్డ్ వివిధ వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ప్రత్యేకంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాబార్డ్ డీజీఎం ఎంఎస్ఆర్ చంద్రమూర్తి, జిల్లా అధికారి ఎం. చౌసాల్కర్, స్మాల్ ఫార్మర్స్ అగ్రీ బిజినెస్ కాన్సార్టియం ప్రతినిధి కుల్‌వీర్ సింగ్, బ్యాంక్ ఆఫ్ బరోడా డీజీఎం చందన్ సాహూ, కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



స్టాల్‌లో రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఢిల్లీరావు



దుర్గమ్మకు వెండి పళ్లాలను బహుకరించిన రంగారావు, ఉషారాణి

దుర్గమ్మకు వెండి పళ్లాలు, కాసుల పేరు

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: తాడేపల్లిలోని భువనవిజయం నివాసి వి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు గురువారం దుర్గగుడికి విచ్చేసి అమ్మవారికి 51.5 గ్రాముల బంగారు కాసుల పేరును కానుకగా సమర్పించారు. నగరరంలోని ఎనికేపాడుకు చెందిన పి రంగారావు, ఉషారాణి కుటుంబ సభ్యులు 1020 గ్రాములు, 988 గ్రాములు, 555 గ్రాముల బరువు గల వెండి పళ్లాలను కానుకగా సమర్పించారు. ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ రాంబాబు ద్వారా ఈ కానుకలను అందించారు. వారికి అమ్మవారి దర్శనానంతరం శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి చెల్లుబోయిన

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం ఆశీస్సులు అందజేశారు.



సభలో పాల్గొన్న రాంజీ గౌతమ్, ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

బీఎస్పీతోనే బహుజనుల సమస్యల పరిష్కారం

● బీఎస్పీ రాష్ట్ర ఇన్‌చార్జి రాంజీ గౌతమ్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 22: పేదల సమస్యలు పరిష్కరించేది కేవలం బీఎస్పీ మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి రాంజీ గౌతమ్ అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం హనుమాన్‌పేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీలో ప్రజాసమస్యల పరిష్కారానికి బీఎస్పీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు ఈ సందర్భంగా బీఎస్పీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ బహుజనుల సమస్యల పరిష్కారం బహుజనులకు అధికారం వస్తేనే సాధ్యపడుతుందని నమ్మి పార్టీలో చేరానన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి అధ్యక్షతన వహించగా రాష్ట్ర నేతలు బాలయ్య, గౌతమ్‌కుమార్, వందన్‌కుమార్ పుష్పరాజు, గురప్ప, మల్లికల్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం అబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

టీడీపీ - జనసేనదే అధికారం

● భవిష్యత్‌కు గ్యారెంటీలో మాజీమంత్రి దేవినేని ఉమా

మైలవరం, ఫిబ్రవరి 22: ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ - జన సేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మైలవ రం దేవుని చెరువులో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీలో పాల్గొని ప్రజలకు సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను పంపిణీ చేశారు.

వైవీయూ వసతిగృహంలో ఫుడ్ పాయిజన్

» 22 మంది విద్యార్థులకు అస్వస్థత

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 22 : కడప యోగివేమన విశ్వవిద్యాలయం వసతిగృహంలో 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి భోజనం చేసిన తరువాత వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. క్యాంపస్‌లోనే వారికి వైద్యసేవలందించారు. అర్ధరాత్రి దాటాక మరికొంతమంది కడుపు నొప్పితో ఇబ్బంది పడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురైన 11మందిని అర్ధరాత్రి రిమ్స్‌కు తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కడపలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గురువారం మరో 11మంది అస్వస్థతకు గురవ్వగా, వారిని కూడా రిమ్స్‌కు తరలించారు.

వాస్తవాలు చెబుతున్నందుకే మీడియాపై దాడులు!

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): 'ఏ మీడియానైతే జగన్ టార్గెట్ చేస్తున్నాడో, ఆ మీడియా వాస్తవాలు రాస్తోంది. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఈటీవీ, టీవీ-5లు ప్రజలకు మంచి చేసే వారిపక్కన నిలిచాయి. భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వం జగన్‌లాగా కక్ష సాధింపులకు పాల్పడితే జగన్ సొంత పత్రిక, చానల్ పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలి' అని టీడీపీ నేత కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ప్రజల ముందు బహిరంగ సభల్లో మీడియా సంస్థలపై నిందలేస్తున్న జగన్.. ఆయన చెప్పే అబద్ధాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు.

నగరిలో బీఎల్వోపై చర్య తీసుకోండి: ఎంఏ షరీఫ్

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నగరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతున్న బీఎల్వో తేజస్విపై చర్య తీసుకోవాలని శాసనమండలి మాజీ ఛైర్‌పర్సన్ ఎంఏ షరీఫ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలతో అంటకాగుతూ టీడీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని, అక్రమాలను ప్రశ్నించినందుకు బీఎల్‌వో తేజస్విని ఫిర్యాదుతో టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టారన్నారు.

మంత్రి ధర్మానపై చర్య తీసుకోవాలి: అచ్చెన్న

ఎన్నికల విధుల్లో వలంటీర్లు పాల్గొనాలంటూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ఎన్నికల సంఘానికి ఆధారాలతోసహా ఫిర్యాదు చేశారు.

ఇసుక దోపిడీలో కలెక్టర్లకు జైలు ఖాయం: ఆనంద్‌బాబు

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక దోపిడీకి కలెక్టర్లే సహకరిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 25 మంది కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వ ఇసుక దోపిడీని సమర్థిస్తూ కేంద్రానికి తప్పుడు నివేదికలు ఇచ్చారని ఎన్జీటీ కమిటీ వెల్లడించిందన్నారు.

గిరిజన కార్పొరేషన్‌కు జగన్ గ్రహణం: ధారూనాయక్

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజన కార్పొరేషన్‌కు జగన్ గ్రహణం పట్టిందని, జగన్ అధికారంలోకి వచ్చాక కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టీడీపీ హయాంలో కళకళలాడిన కార్పొరేషన్.. నేడు ఈగలు తోలుకుంటోందని, 58 నెలల్లో ఐదుగురు గిరిజనులకు కూడా సబ్సిడీ రుణాలు ఇవ్వలేదన్నారు. గిరిజనులకు సంబంధించి 16 సంక్షేమ పథకాలను రద్దు చేయడమే కాకుండా, కేంద్రం ఇచ్చిన ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ నిధులను దారిమళ్లించారన్నారు.

ఎన్నికల పొత్తులపై నేడు కాంగ్రెస్, వామపక్షాల భేటీ

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కలిసి పోటీ చేసే విషయమై చర్చించేందుకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీతో సీపీఎం, సీపీఐ భేటీ కానున్నాయి. ఆంధ్రరత్నభవన్‌లో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు శ్రీనివాసరావు, రామకృష్ణలతో షర్మిల రెడ్డి సమావేశమవుతారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యక్ష కార్యాచరణ

విజయవాడ, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై గుర్తింపు సంఘం ఎన్ఎంయూ ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమౌతోంది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవటంపై ఈ నెల 21 వ తేదీన సంఘ అత్యున్నత కమిటీ సుదీర్ఘంగా చర్చించిన మీదట ఆందోళన దిశగా వెళ్లాలను కుంటున్నట్టు ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, వై శ్రీనివాసరావు గురువారం ఆర్టీసీ ఎండీకి ఘాటుగా లేఖ రాశారు. ఈ నెల 2న రాష్ట్ర, జోన్, జిల్లా, డివిజన్, నాన్ ఆపరేషన్ యూనిట్ల కమిటీలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి, ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటించనున్నట్టు తెలిపారు.

తిరుమలకు కూరగాయల వితరణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 22: తిరుమలలో నిత్యాన్నదాన పథకానికి దాతల సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. తిరుమల నిత్యాన్నదాన పథకానికి దివంగత మండవ కుటుంబరావు స్ఫూర్తితో మరడ నాగేంద్ర (నాగు) ఆధ్వర్యంలో గురువారం ఉచిత కూరగాయల పంపిణీ వాహనాన్ని నక్కల రోడ్డు నుంచి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభిన్న రంగాల్లో సేవాగుణం కల ఎంతోమంది దాతలు తమ సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఇటువంటి సేవలకు పునాది వేసిన దివంగత మండవ కుటుంబరావు బాటలో నాగేంద్ర బృందం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయ మని భవిష్యత్తులో మరెన్నో నిర్వహించాలని అభిలాషించారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు మాట్లాడుతూ అన్నదానానికి మించిన దానం మరొకటి లేదన్నారు. ఎం.నాగేంద్ర మాట్లాడుతూ 2004లో తిరుమలకు ఉచితంగా కూరగాయల పంపిణీ దాతల సహకారంతో ప్రారంభించామని ఇప్పటివరకు 25వేల మెట్రిక్ టన్నుల కూరగాయలను టీటీడీకి పంపించినట్లు తెలిపారు. డాక్టర్ బుర్రా అనూష్, పూజిత, ధూళిపాళ్ల సాయిశరత్ ప్రశాంత్, సత్యప్రణతి, శ్రీయాన్ష్ ప్రణవ్, ఆకుల వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి, చందన, తరుణ్, ఛుగన్‌లాల్, ముత్యాల రిషాన్, అక్షయ ఫార్మసీ అధినేత వివేక్, బాలాజీ ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు కొప్పుల వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటరత్నం, శారద, డాక్టర్ కర్నాటి జనార్ధన్ చౌదరి పాల్గొన్నారు.



కూరగాయల లారీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న దేవానందరెడ్డి

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

● ఏపీ ఎగ్జామ్స్ డైరెక్టర్ దేవానందరెడ్డి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 22: విద్యార్థులు భయంతో పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించలేరని ఇష్టం, ఏకాగ్రతతో పరీక్షలకు సన్నద్ధమైతే అద్భుతమైన ఫలితాలు సొంతం చేసుకోవచ్చని ఏపీ పరీక్షలు విభాగం డైరెక్టర్ దేవానంద రెడ్డి అన్నారు. గురువారం ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) గన్నవరం డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్డులోని ఫంక్షన్ హాలులో టెన్త్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవానంద రెడ్డి పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షా విధానం, అత్యధిక మార్కులు సాధించే పద్ధతులు వివరించారు. అప్సా జిల్లా అధ్యక్షుడు గౌరి ప్రసాద్ అధ్యక్షతన ఎంఈవో రామబాలసింగ్, సంఘం రాష్ట్ర కార్యదర్శి వీడీఎస్.ప్రసాద్, మాజీ స్టేట్ కౌన్సిల్ ఛైర్మన్ సుందరరామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాబుజాన్, జిల్లా కోశాధికారి ఎస్.పూర్ణచంద్రాచార్యులు, డివిజన్ సభ్యుడు మదన్‌మోహన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన దేవానందరెడ్డి

బాపులపాడు జడ్పీ హైస్కూల్‌ను దేవానంద రెడ్డి సందర్శించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈవో రామబాలసింగ్,పాఠశాల హెచ్‌ఎం టీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో రెక్కీ.. బంగారం దోపిడీ!

» 3.5 కిలోల బంగారం, రూ.5లక్షలతో ఉడాయించిన దుండగులు

» విలువ రూ.2కోట్లు..

» కాకినాడ జిల్లా పోతవరంలో ఘటన

నల్లజర్ల, ఫిబ్రవరి 22: సినీఫక్కీలో రెక్కీ నిర్వహించి, సుమారు రూ.2కోట్ల విలువైన మూడున్నర కిలోల బంగారు ఆభరణాలు, రూ.5లక్షల నగదును దుండగులు దారికాచిదోచేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో జరిగిందీ ఘటన. మహారాష్ట్రకు చెందిన గార్లె బాలు నాతురామ్ హోల్‌సేల్ నగల వ్యాపారం చేస్తూ 25 ఏళ్ల క్రితం భీమవరం వచ్చి స్థిరపడ్డారు. బంగారం షాపుల నుంచి వచ్చిన ఆర్డర్ల మేరకు ఆభరణాల సరఫరాకు కోసం బుధవారం కారులో దూబచర్ల, జంగారెడ్డిగూడెం, కోయలగూడెం మీదుగా తన స్విఫ్ట్ కారులో బయలుదేరారు. కోయలగూడెం దాటాక.. పోతవరం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో చీకటి పడుతున్న సమయంలో ఓ ఇన్నోవా కారులో ఐదుగురు దుండులు వచ్చి తాము ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులమని బెదిరించి, బాలును, డ్రైవర్ వేంద్ర సురేష్‌ను ఇన్నోవా కారు ఎక్కించుకున్నారు. ఐదుగురిలో ఇద్దరు బంగారు ఆభరణాలు ఉన్న స్విఫ్ట్ కారును తీసుకుని రాజమహేంద్రవరం వెళ్లి దివాన్ చెరువు, లాలాచెరువు ప్రాంతాలు తిప్పి, కారులో ఉన్న 3.5 కిలోల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు తీసుకుని బాలును, డ్రైవర్‌ను స్విఫ్ట్ కారు వద్ద వదిలి వెళ్లిపోయారు. అయితే స్విఫ్ట్ కారులోని బ్యాగులో నగదు కనిపించకపోవడంతో బాలు రాజమహేంద్రవరం పోలీసులను ఆశ్రయించారు. దోపిడీ నల్లజర్ల మండలం పోతవరంలో జరిగినట్టు గుర్తించి కొవ్వూరు డీఎస్పీ రామారావు వద్దకు వెళ్లారు. డీఎస్పీ, సీఐ దుర్గాప్రసాద్ స్పందించి, పోతవరం వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, కారు లోపల సీట్లకు అనుసంధానంగా ఉండే లాకర్ తాళం యజమాని బాలు వద్దే ఉంది. ఆ లాకర్‌లో పెట్టిన బంగారం, నగదును మాత్రం దుండగులు ఏవిధంగా అపహరించారనేది ప్రశ్నార్థకంగా మారింది. దారి దోపిడీపై నగల వ్యాపారి కారు డ్రైవర్ సురేష్‌పై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్నేహితులకు సమాచారమిచ్చి దోపిడీ చేయించి ఉంటాడని అనుమానించి ఆ దిశగా దర్యాప్తు సాగిస్తున్నారు.





కారులోని లాకర్

ఏపీ కరాటే అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ (కాయ్) నూతన కార్యవర్గం ఎన్నికను చేపట్టినట్టు కరా టే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ రజనీష్ చౌదరి గు రువారం ప్రకటించారు. కాయ్ ఛైర్మన్‌గా నగరానికి చెందిన యు.బ్రహ్మానందం, టెక్నికల్ డైరెక్టర్‌గా రజనీష్ చౌదరి, ప్రెసిడెంట్‌గా జె.విజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా జె.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా సీహెచ్.మహేష్ బాబు, వైస్ ప్రెసిడెంట్‌లుగా జె.హరినాథ్, సకీల్ అహ్మద్, జాయింట్ సె క్రటరీలుగా రవికుమార్, శివకుమార్, వీరాచారి, రిఫరీ కమిషన్ సెక్రటరీగా పీవీకేఎస్.హర్ష, సెలక్షన్ కమిటీ సెక్రటరీగా జె.దినేష్, డిసిప్లిన్ కమిషన్ ఛైర్మన్‌గా షేక్ మాలిక్, సెక్రటరీగా టి. వెంకటసాయికుమార్, మెం బర్‌గా హరీష్‌బాబు, ఉమెన్స్ స్పోర్ట్స్ కమిషన్ ఛైర్మన్‌గా వరలక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్‌గా సునీత వాణి, సెక్రటరీగా లక్ష్మీ ప్రసన్నకుమారి, ఈసీ మెంబర్లుగా మధుసూదన్‌రావు, సత్య, నాగరాజన్, శ్రీకర్ పాల్గొన్నారు.



కరాటే అసోసియేషన్ కార్యవర్గం

కక్షిదారుల కులమతాల ప్రస్తావన అక్కర్లేదు

»» ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని హైకోర్టులకు సుప్రీం ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కోర్టులను ఆశ్రయించే కక్షిదారులు తాను దాఖలు చేసే పిటిషన్, దావాలలో కులం, మతాన్ని ప్రస్తావించకుండా చూడాలని జ్యుడీషియల్ అధికారులకు హైకోర్టు ఆదేశించింది. షామ శర్మ వర్సెస్ కిషన్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయవాదుల సంఘంతోపాటు రాష్ట్రంలోని అన్ని న్యాయవాద సంఘాలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ ఆదేశాలు అమలయ్యేలా చూడాలని రాష్ట్రంలోని అన్ని హైకోర్టులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలను కింది కోర్టులకు తెలియజేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు సర్క్యులర్ జారీ చేశారు.

నకిలీ ఇంటి రుణాలతో ఆదాయపు పన్ను ఎగవేత

»» 42 మంది ఉద్యోగులపై చర్యలకు సిద్ధం.. ఆరోగ్య శాఖలో కలకలం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 22: వైద్య ఆరోగ్యశాఖలోని కొందరు ఉద్యోగులు తాము తీసుకుంటున్న జీతానికి ఆదాయపు పన్ను చెల్లించే విషయంలో పెడదోవ పట్టారు. ఆదాయపు పన్ను ఎగవేసేందుకు అడ్డదారులు తొక్కారు. 2019లో వచ్చిన చిన్న ఫిర్యాదుతో కళ్లు బైర్లు కమ్మే విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 42 మంది ఉద్యోగులు ఆదాయపు పన్ను మినహాయింపు పొందేందుకు లేని ఇంటి రుణాలు ఉన్నట్లుగా చూపించినట్లు తేలింది. ఈ విషయాలపై దర్యాప్తు జరిపిన విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు అక్రమాలు నిజమేనని తేల్చారు. వాటి ఆధారంగా గత అనేక సంవత్సరాలుగా లక్షల్లో ఆదాయపు పన్ను ఎగవేసినట్లు గుర్తించారు. నకిలీ బ్యాంక్ స్టేట్‌మెంట్స్‌తో ఆదాయపు పన్ను మోసానికి పాల్పడిన 42 మంది ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని హెల్త్ డైరెక్టర్‌ను విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ ముఖ్య అధికారి కె.రాధికామంజరి ఆదేశించారు. జనవరి 30న జారీ అయిన ఈ ఉత్తర్వులతో ఆ శాఖలో కలకలం రేగింది.

సీపీఎస్ ఉద్యోగులపై దమనకాండ ఆపాలి

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని, దమనకాండను ఆపాలని ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ ఈ నెల 27న చలో విజయవాడకు పిలుపునిస్తే కార్యక్రమానికి వెళ్లకూడదంటూ పోలీసులు సీపీఎస్ ఉద్యోగులకు ముందస్తు నోటీసులు ఇస్తున్నారన్నారు.

నేడు ఉద్యోగ సంఘాలతో మంత్రుల కమిటీ చర్చలు

ఉద్యోగ సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి చర్చలు జరపనుంది ఈమేరకు శుక్రవారం అమరావతి సచివాలయంలో జరిగే సమాశానికి హాజరుకావాలని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉన్న ఉద్యోగ సంఘాలకు సాధారణ పరిపాలనశాఖ సమాచారం పంపింది.

ముస్లిం ఉద్యోగులు గంట ముందే ఇంటికి వెళ్లొచ్చు!

అమరావతి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ముస్లిం ఉద్యోగులకు రంజాన్ మాసం సందర్భంగా మార్చి 11 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ప్రతిరోజూ విధుల నుంచి గంట ముందే ఇంటికి వెళ్లడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

అగ్రిగోల్డ్ కేసు విచారణ ఏప్రిల్ ఒకటికి వాయిదా

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 22: అగ్రిగోల్డ్ కేసులపై ఏలూరు జిల్లా కోర్టులో విచారణ జరిగింది. 11 కేసులకు సంబంధించి గురువారం ఏలూరు జిల్లా కోర్టులో వాయిదా ఉండడంతో నిందితులు కోర్టుకు హాజరయ్యారు. వాదోపవాదాల అనంతరం జడ్జి ఏప్రిల్ 1వ తేదీ వాయిదా వేశారు. అగ్రిగోల్డ్ చైర్మన్ అవ్వా వెంకట రామారావు కూడా హాజరయ్యారు.

అనపర్తి ఎమ్మెల్యే అవినీతి 500 కోట్లు!

»» చర్చకైనా.. సత్యప్రమాణానికైనా.. సిద్ధం: రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 22: 'గత నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి రూ.500 కోట్ల అవినీతికి పాల్పడ్డారు. దీనిపై చర్చకైనా, సత్యప్రమాణికైనా నేను సిద్ధం. మీరు సిద్ధమా?' అంటూ తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేకు బహిరంగ లేఖ రాశారు. సదరు లేఖకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆయన ప్రజలకు పంపిణీ చేశారు.

జగన్‌కు ఎందుకంత భయం?: కేసీ వేణుగోపాల్

»» షర్మిల అరెస్టు అప్రజాస్వామికం: రఘువీరా

న్యూఢిల్లీ, మడకశిర టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీలో దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతుండడంతో జగన్ సర్కారు భయపడుతోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలను జగన్ ప్రభుత్వం అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ఏపీ సీఎం జగన్‌కు ఎందుకంత భయమని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. షర్మిల అరెస్టు అప్రజాస్వామికమని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా రెడ్డి ఖండించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో బహిరంగ చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

మన లారీ కనిపిస్తే.. ఇతర రాష్ట్రాల్లో బాదుడే!

»» 'వాహన్' సైట్‌లో వాహనాల డేటా అప్‌లోడ్‌లో సమస్యలు

విజయవాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రవాణా వాహనాల డేటా 'వాహన్' పోర్టల్‌లోకి అప్‌లోడ్ కాకపోవటం వల్ల ఇతర రాష్ట్రాల్లో తిరిగే మన లారీలకు భారీ జరిమానాలు వేస్తున్నారు. డేటాను ఎప్పటికప్పుడు వాహన్ సైట్‌లోకి అప్‌లోడ్ చేయాల్సి ఉండగా.. విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు గురువారం తెలిపారు. ప్రధానంగా ఒడిసాలో రోజూ వందలాది లారీలను నిలిపివేసి.. ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రాష్ట్ర రవాణా శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

'దుమ్ము'తో రేగిన ఘర్షణ!

»» తిరుపతిలో పుణె వాసి హత్య.. మరొకరి పరిస్థితి విషమం

రేణిగుంట, ఫిబ్రవరి 22: దాబా హోటల్‌లో తిరుపతి, మహారాష్ట్ర వాసులకు నడుమ జరిగిన ఘర్షణలో పుణెకు చెందిన ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లా రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగిందీ ఘటన. పోలీసుల కథనం మేరకు... మహారాష్ట్రలోని పుణె, పరిసర ప్రాంతాలకు చెందిన 11 మంది స్నేహితులు శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వచ్చారు. బుధవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి వెళుతూ మార్గమధ్యం లోని రేణిగుంట మండలం గుత్తివారిపల్లి-మల్లవరం మధ్య రోడ్డుపక్కనున్న సంతోష్ పంజాబీ దాబా హోటల్ వద్ద భోజనం చేస్తుండగా, తిరుపతి నగరం కొర్లగుంటకు చెందిన ఆరుగురు వ్యక్తులు మద్యం సేవించి అతివేగంగా వాహనంతో అక్కడికి దూసుకొచ్చారు. ఆ క్రమంలో దుమ్ము రేగి హోటల్‌లో భోజనం చేస్తున్న మహారాష్ట్రవాసుల ప్లేట్లలో పడింది. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగి.. పుణెకు చెందిన రిషంత్ జగపత్ (45), కుల్దీప్ (45) తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఆ ఇద్దరినీ తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం రిషంత్ జగపత్ మృతి చెందగా, రేణిగుంట పోలీసులు హత్యానేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తిరుపతికి చెందిన ఆరుగురిలో ఇప్పటికే ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసు మూడు వారాలకు వాయిదా

»» హైకోర్టు తీర్పును సవాలు చేసిన ఈడీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో వ్యాపారవేత్త కోనేరు మధుకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఈడీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మూడు వారాలకు వాయిదా పడింది. గురువారం ఈ పిటిషన్‌ను చేపట్టిన న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ ఎస్వీఎన్ బట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

టెట్, టీఆర్‌టీ షెడ్యూల్‌పై నేడు హైకోర్టు తీర్పు!

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష), ఏపీ టీఆర్‌టీ(ఉపాధ్యాయ నియామక పరీక్ష) మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు నిర్ణయాన్ని ప్రకటించనుంది. గురువారం తీర్పు వెల్లడించాల్సి ఉన్నా, న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సెలవులో ఉండడంతో సాధ్యపడలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏపీ టెట్, ఏపీ టీఆర్‌టీ మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దు చేసి, టెట్, టీఆర్‌టీ పరీక్షల నిర్వహణకు తాజాగా షెడ్యూల్ జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం వాదనలు ముగియడంతో న్యాయమూర్తి నిర్ణయాన్ని వాయిదా వేసిన విషయం తెలిసిందే.

సీమ ప్రాజెక్టులకు గ్రహణం!



వేదవతి ప్రాజెక్టు కోసం తెచ్చిన పైపులు ఇలా పొలాల్లో..

»» జగన్ నిర్వాకంతో పడకేసిన పథకాలు

»» నాడు రాయలసీమ దుర్భిక్షం నివారణ మిషన్ పేరిట హడావుడి

»» చేసిన పనుల్లో 1,393 కోట్ల బిల్లులు పెండింగ్

»» పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమ జిల్లాల్లో కరువు.. వలసలు శాశ్వతంగా నివారించే లక్ష్యంగా చేపట్టే ఏ ప్రాజెక్టయినా రైతులకు వరమే! ఏ ప్రభుత్వం చేపట్టినా వారు స్వాగతిస్తారు. అయితే చేపట్టే ప్రాజెక్టులు పూర్తిచేయాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఉండాలి. సీఎం జగన్‌లో అది కనిపించడం లేదని సాగునీటి రంగ నిపుణులు మండిపడుతున్నారు. ఆయన హడావుడిగా మొదలుపెట్టిన ఆర్డీఎంపీలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులకు రూ.1,360 కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. ప్రధాని మోదీని నోరెత్తి అడగని కారణంగా ఈ ప్రాజెక్టుకు పీఎం కృషి సంచాయి యోజన (పీఎంకేఎస్‌వై) గ్రాంట్ అందని ద్రాక్షగా మారింది. ఆర్డీఎంపీ కింద జగన్ ప్రభుత్వం మూడేళ్ల కింద ఆర్భాటంగా ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో రూ.33,862 కోట్లతో 23 ప్రాజెక్టులను చేపట్టింది. నిధుల కేటాయింపులు లేకుండా ఎడాపెడా శంకుస్థాపనలు చేసేశారు. నిధులివ్వక.. అప్పులు పుట్టక.. కేంద్రం కూడా చేతులెత్తేయడంతో ఈ ప్రాజెక్టులు ఇక అటకెక్కినట్లేనా అని సీమ రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రధానంగా రాయలసీమ దుర్భిక్ష నివారణలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.9,725 కోట్ల అంచనాతో రాయలసీమ లిఫ్ట్, పోతిరెడ్డిపాడు నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు ఎస్ఆర్ఎంసీ సహా జీఎన్ఎస్ఎస్ కెనాల్ సీసీ లైనింగ్, గోరుకల్లు జలాశయం నుంచి అవుకు జలాశయం వరకు జీఎన్ఎస్ఎస్ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ సీసీ లైనింగ్, అవుకు మూడో అదనపు టన్నెల్ తవ్వకం, కుందూ నది విస్తరణ పనులను 2020-21లో మొదలుపెట్టారు. 30 నెలల్లో పనులు పూర్తిచేయాలన్నది లక్ష్యం. ప్రారంభంలో వేగంగా పనులు చేశారు.

> రాజకీయ లబ్ధి కోసం జగన్ ప్రభుత్వం రాయలసీమలో కొన్ని ప్రాజెక్టులకు ఆర్భాటంగా శంకుస్థాపనలు చేయడమే తప్ప.. ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు. అవసరమైన అనుమతులు ఇవ్వదు. పైసా కూడా రాల్చదు. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయదు. ఈ నిర్లక్ష్యమే ఆ ప్రాజెక్టుల పాలిట శాపంగా మారింది.

రూ.1,360 కోట్లకు పైగా బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాంట్రాక్టరు పనులు ఆపేశారు.

మిషన్ ముందుకెళ్లేదెలా..?

శ్రీశైలం ఎగువన సంగమేశ్వరం నుంచి 854 అడుగుల దిగువన 35 వేల క్యూసెక్కులు ఎత్తిపోసుకోవడానికి వీలుగా రాయలసీమ లిఫ్ట్ చేపట్టారు. అంచనా వ్యయం రూ.3,825 కోట్లు. కాంట్రాక్ట్ విలువ (ఈపీసీ) రూ.3,307 కోట్లకు టెండర్లు పిలిస్తే.. మేఘా-ఎస్పీఎంఎల్ సంస్థ జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్నాయి. 12 పంపుల ద్వారా ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (ఎస్ఆర్ఎంసీ) కాలువకు వరద జలాలు తరలించాలన్నది లక్ష్యం. అనుమతుల్లేకుండా ప్రాజెక్టు చేపట్టడంతో తెలంగాణ ఫిర్యాదుతో.. పనులు ఆపాలని ఎన్‌జీటీ ఆదేశించింది. పోతిరెడ్డిపాడు నుంచి బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు ఎస్ఆర్ఎంసీ.. బానకచర్ల నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు 50 కిలోమీటర్లు గాలేరు-నగరి వరద కాలువ సామర్థ్యం రెట్టింపు చేస్తూ సీసీ లైనింగ్ వేయాలని నిర్ణయించారు. దీని అంచనా రూ.1,500 కోట్లు. ఈపీసీ రూ.1,061.69 కోట్లతో 2020 ఆగస్టు 28న టెండర్లు పిలిస్తే.. ఆగ్రాకు చెందిన పీఎస్సీ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ పనులు దక్కించుకుని 36 నెలల్లో పూర్తిచేసేలా 2021 మార్చిలో ఒప్పందం చేసుకుంది. బిల్లులు రాక పనులు ఆపేశారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు 60 కిలోమీటర్లు జీఎన్ఎస్ఎస్ వరద కాలువ సీసీ లైనింగ్, 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 6 కిలోమీటర్లు పొడవు అవుకు మూడో అదనపు టన్నెల్ పనులు రూ.1,500 కోట్లు అంచనాతో చేపట్టారు. ఈపీసీ విలువ రూ.1,269.49 కోట్లకు 2020 సెప్టెంబరు 1న టెండర్లు పిలిచారు. డీఎస్ఆర్-వీఏఆర్‌కేఎస్ సంస్థలు జాయింట్ వెంచర్‌గా పనులు దక్కించుకున్నాయి. రూ.700 కోట్లు పెండింగ్‌లో పెట్టడంతో పనులు ఆగిపోయాయి. 30 వేల క్యూసెక్కుల ప్రవాహానికి వీలుగా నిప్పులవాగు, కుందూ నదుల విస్తరణ, 2.9 టీఎంసీల సామర్థ్యంతో రాజోలి జలాశయం, 0.80 టీఎంసీల సామర్థ్యంతో జొలదరాశి జలాశయాల పనులు ఒకే ప్యాకేజీగా చేసి రూ.2,900 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. పనులు చేజిక్కించుకున్న అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కుటుంబానికి చెందిన సంస్థ బిల్లులు రాక పనులు నిలిపివేసింది. రాజోలి, జొలదరాశి జలాశయాల పనులకు ఒక్క ఇటుక కూడా వేయలేదు.

పడకేసిన వేదవతి, ఆర్డీఎస్..

కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలకు ఉపయుక్తమైన ఆర్డీఎస్ కుడి కాలువ, వేదవతి ప్రాజెక్టుల పరిస్థితీ అంతే.



హెడ్ వర్క్స్ పనులతోనే ఆగిపోయిన ఆర్డీఎస్ కుడికాలువ

అడగని జగన్.. ఇవ్వని మోదీ!

నీతి ఆయోగ్ సభ్యుడు అవినాశ్ మిశ్రా సూచన మేరకు దుర్భిక్ష నివారణ మిషన్ కింద చేపట్టిన 23 ప్రాజెక్టుల్లో 11 ప్రాజెక్టులకు పీఎంకేఎస్‌వై గ్రాంట్ కోసం దరఖాస్తు చేశారు. దీని కింద ఎంపికైతే 70 శాతం నిధులు కేంద్రం గ్రాంట్ రూపంలో ఇస్తుంది. కర్నూలు జిల్లాలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బీసీఆర్ వరకు ప్రధాన కాలువ లైనింగ్‌కు రూ.570.45 కోట్లు, బానకచర్ల నుంచి గోరుకల్లు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ సీసీ లైనింగ్‌కు రూ.939.65 కోట్లు, గాలేరు-నగరి కెనాల్ 0-56 కి.మీ వరకు ఇంప్రూవ్‌మెంట్ రూ.305.70 కోట్లు, గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ లైనింగ్‌కు రూ.1,457 కోట్లు, అవుకు రిజర్వాయర్-గండికోట రిజర్వాయర్ వరకు జీఎన్ఎస్ఎస్ కెనాల్ ఇంప్రూవ్‌మెంట్ రూ.633 కోట్లు, పులివెందులలో పీబీసీ, సీబీఆర్ రైట్ కెనాల్, జీఎల్ఐ మైక్రో ఇరిగేషన్ రూ.1,233 కోట్లు, యురేనియం బాధిత గ్రామాలకు తాగునీరు అందించే సీబీఆర్-ఎర్రబల్లి లిఫ్ట్‌కు రూ.1,113 కోట్లు, గండికోట నుంచి చిత్రావతి, పైడిపాలెం ఎత్తిపోతల పథకాల అప్‌గ్రేడ్ రూ.3,674 కోట్లు, జీఎన్ఎస్ఎస్-హంద్రీనీవా ఎత్తిపోతల పథకం రూ.5,030 కోట్లు, నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు ఫ్లడ్‌ఫ్లో కెనాల్స్‌కు రూ.951 కోట్లు, జీకేఎన్ కెనాల్‌కు రూ.655 కోట్లు కలిపి.. రూ.16,568 కోట్లు పీఎంకేఎస్‌వై గ్రాంట్ ఇవ్వాలని ప్రతిపాదించారు. సీఎం జగన్ గట్టిగా అడగకపోవడం, ప్రధాని కనికరించకపోవడంతో గ్రాంట్ మంజూరు కాలేదు.

రెండేళ్లలో 3.60 లక్షల మందికి నైపుణ్య శిక్షణ

»» 1.81 లక్షల మంది యువతకు ఉపాధి: సీఎస్



స్కిల్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎస్ జవహర్ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైపుణ్య శిక్షణాభివృద్ధి సంస్థ ద్వారా 2022-23, 2023-24లో 3 లక్షల 60 వేల మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి 1 లక్షా 81 వేల మందికి ఉపాధి కల్పించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి తెలిపారు. నైపుణ్య శిక్షణా సంస్థ ద్వారా చేపట్టిన శిక్షణా కార్యక్రమాలు, నిరుద్యోగ యువతకు కల్పించిన ఉపాధి అవకాశాలపై గురువారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఏపీ నైపుణ్య శిక్షణా సంస్థ, జీయూవీఐల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే My Ap-s-s-dc My Web-site ను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, ఓడ రేవుల నిర్మాణంపై సీఎస్ అధికారులతో సమీక్షించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ ఏడాదే అక్కడి నుంచి విమాన రాకపోకలు సాగే విధంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట ఓడరేవులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ ప్రగతిని సీఎస్ సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే వెలంపల్లి అనుచరుల హల్‌చల్

»» మద్యం తాగి మంగళగిరిలో ఆర్టీసీ డ్రైవర్‌పై జులుం

»» విచారించినా.. కేసు పెట్టని ఆర్టీసీ అధికారులు



ప్రమాదానికి కారణమైన కారు, డ్రైవర్‌కు వార్నింగ్ ఇస్తున్న కారులోని వ్యక్తి

విజయవాడ వన్ టౌన్, ఫిబ్రవరి 22: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అనుచరులు గురువారం మంగళగిరిలో మద్యం మత్తులో కారు నడిపి హల్‌చల్ చేశారు. మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ.. రోడ్డు మీద వెళుతున్న వారిని భయభ్రాంతులకు గురిచేశారు. మంగళగిరి నాలుగు రోడ్ల కూడలిలో ఆర్టీసీ బస్సును ఢీకొనబోగా.. బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కారులో ఉన్న యువకులు ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యానికి దిగారు. బస్సులోకి ఎక్కి ఇంజన్ తాళం తీసుకుని, మహిళా కండక్టర్‌ను అసభ్య పదజాలంతో దూషించారు. అయితే కారుపై ఎమ్మెల్యే వెలంపల్లి స్టిక్కర్ ఉండడంతో పోలీసులకు కూడా ఫిర్యాదు చేయలేదు. ఈ ఘటన సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది.

ఆకాశంలో అబ్బురం..!

»» మిలాన్-24లో మెరిసిన వైమానిక విన్యాసాలు

»» కన్నులపండువగా ఇంటర్నేషనల్ సిటీ పరేడ్





విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ సముద్ర తీరంలో భారత నౌకాదళం ప్రదర్శించిన వైమానిక విన్యాసాలు అబ్బురపరిచాయి. బహుపాక్షిక నౌకాదళ విన్యాసాలు 'మిలాన్-24'లో భాగంగా గురువారం సాయంత్రం 54 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో సాహస ప్రదర్శనలు చేశారు. ఆకాశంలో ఎనిమిది వేల అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ సాయంతో దూకి సురక్షితంగా కిందికి దిగిన మెరైన్ కమెండోల సాహసానికి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. హాక్ జెట్ ఫైటర్లు బాంబుల వర్షం కురిపిస్తూ గగనతలంలో దూసుకుపోయాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజస్ యుద్ధ విమానం తొలిసారిగా విశాఖలో దర్శనమిచ్చింది. కొత్తగా నేవీలో చేరిన సీ హాక్ హెలికాప్టర్లు కనువిందు చేశాయి. మిలాన్‌కు హాజరైన 51 దేశాలకు చెందిన నేవీ దళాలు జాతీయ పతాకాలు చేతపట్టి బీచ్‌రోడ్డులో చేసిన ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ హైలైట్‌గా నిలిచింది. నేవీ స్కూల్, కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు కనువిందు చేశాయి. విమానవాహక నౌకలు విక్రాంత్, విరాట్‌లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. కార్యక్రమానికి భారత రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, ఆయనకు భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ హరికుమార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరికుమారి, తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్ పాల్గొన్నారు.

సముద్ర భద్రత బలోపేతమే మిలాన్ లక్ష్యం: ఉపరాష్ట్రపతి

సముద్రాల్లోని సరిహద్దులు మ్యాపులో రేఖలు కావని.. ఆయా దేశాల జీవన రేఖలని, ఆర్థిక వ్యవస్థలను కలిపే వాణిజ్య మార్గాలని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ విశ్లేషించారు. సముద్రిక ఆడిటోరియంలో గురువారం 'అంతర్జాతీయ మేరిటైమ్ సదస్సు' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సముద్రంలో దోపిడీలను ఉపేక్షించమన్నారు.

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు జడ్-ప్లస్ భద్రత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు జడ్-ప్లస్ భద్రతను దేశవ్యాప్తంగా కల్పించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఖర్గేకు ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు ఈ నెల ప్రారంభంలోనే నిర్ణయం తీసుకున్నట్టు అధికారవర్గాలు గురువారం తెలిపాయి. ఈ నేపథ్యంలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన కమాండోలు ఖర్గేకు జడ్-ప్లస్ భద్రతను కల్పిస్తారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఎన్నికలప్పుడు ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడైన ఖర్గే దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించే అవకాశం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని భద్రతను పెంచాలని నిర్ణయించినట్లు ఆయావర్గాలు చెబుతున్నాయి. ఖర్గేకు మూడుషిఫ్ట్‌ల్లో దాదాపు 30 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు ఇరవైనాలుగ్గంటలు భద్రతను కల్పిస్తారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనం, పైలట్, ఎస్కార్ట్ వాహనాలు వంటివి భద్రతలో భాగంగా ఉంటాయి.

బైజూస్ రవీంద్రన్‌పై ఈడీ లుకౌట్ నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రముఖ ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో రవీంద్రన్‌కు మరిన్ని కష్టాలు వచ్చిపడ్డాయి. ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం లుకౌట్ నోటీసులు (ఎల్‌సీ) జారీ చేసింది. దేశం విడిచి వెళ్లకుండా చూడాలని సంబంధిత అధికార వర్గాలను ఆదేశించింది. విదేశీ మారక నిల్వల నిర్వహణ చట్టం (ఫెమా) కింద దర్యాప్తు చేపట్టిన ఈడీ.. గత ఏడాది బెంగళూరులోని బైజూస్ కార్యాలయాలతో పాటు రవీంద్రన్ నివాసంలో సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రవీంద్రన్‌పై 'ఆన్ ఇంటిమేషన్ లుకౌట్ సర్క్యులర్' అమల్లో ఉంది. అంటే ఆయన విదేశాలకు వెళ్లినప్పుడు ఇమిగ్రేషన్ అధికారులు ఈడీకి ముందుగానే సమాచారం అందజేయాల్సి ఉంటుంది. తాజాగా దాన్ని సవరించి, పూర్తిస్థాయి ఎల్‌సీ జారీ చేసింది. దీంతో ఇకపై రవీంద్రన్ ఈడీ అధికారుల అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లలేరు. ఇదిలా ఉండగా, రవీంద్రన్‌ను సీఈవో పదవి నుంచి తొలగించేందుకు కొంత మంది బైజూస్ వాటాదారులు శుక్రవారం అసాధారణ బోర్డు సమావేశాని(ఈజీఎం)కి పిలుపునిచ్చారు.

అయోధ్యకు నెల రోజుల్లో 50 లక్షల మంది

అయోధ్య, ఫిబ్రవరి 22: అయోధ్య కిటకిటలాడుతోంది. ఇప్పటికే దేశంలో ప్రముఖ దర్శనీయ పుణ్యక్షేత్రంగా మారింది. చాలా దూరం నడవాల్సి వస్తున్నా, పెద్ద పెద్ద క్యూ లైన్లలో నిల్చోవాల్సి వస్తున్నా ఎవరిలోనూ నిరుత్సాహం కనిపించడం లేదు. ప్రతి రోజూ సుమారు రెండు లక్షల మంది భక్తులు వస్తున్నారు. ప్రాణ ప్రతిష్ఠ జరిగిన అనంతరం 30 రోజుల్లో 50లక్షల మందికిపైగా భక్తులు వచ్చినట్లు అంచనా. కాగా, భక్తుల రాక భారీగా ఉండడంతో హోటళ్ల అద్దెలు విపరీతంగా పెరిగాయి. కొన్ని మంచి హోటళ్లు సగటున ఒక్క రాత్రికి రూ.6000 వరకు వసూలు చేస్తున్నాయి.

మహిళల హక్కులను హరించే వారికి బుద్ధి చెప్పండి

»» ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం థావలే

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు త్వరలో జరిగే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం థావలే పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకూ ఐద్వా అఖిల భారత సమావేశాలు జరగనున్న నేపథ్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించి, పాతజైలురోడ్డులో సభ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మరియం థావలే మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ దేశప్రజలకు ఐదు కిలోల బియ్యం ఇచ్చి పౌష్టికాహారం ఇస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో విమాన చార్జీలు, ఏసీ రైళ్ల చార్జీలను తగ్గించి, సాధారణ ప్రయాణికులు ప్రయాణించే రైలు, బస్ రవాణా చార్జీలు పెంచడం దారుణమన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వేతనాలను మాత్రం పెంచడం లేదన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ఇచ్చే నిధుల్లో కోతవేస్తున్నారని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర కోసం రైతులు ఉద్యమిస్తుంటే, ప్రధాని మోదీ వారిపై బుల్లెట్ల వర్షం కురిపించి అణచివేయాలని యత్నిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం మానేసి, అంబానీ, అదానీలకు రూ.15 లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేకమంది మహిళలు, బాలికలు కనిపించకుండా పోతున్నారని, దీనిని బట్టి మహిళ, శిశు సంక్షేమానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చునన్నారు. ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంటుతోపాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ఉద్యమాలతోనే రక్షించుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంటును అమ్మేస్తుంటే వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు చోద్యం చూస్తున్నాయన్నారు. దేశంలో మనువాదం కాదు...మన వాదం కావాలని పిలుపునిచ్చారు.

టీడీపీ ఎమ్మెల్యే అనగానిపై అసత్య ప్రచారం

»» నీచ రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ

»» ఫేక్ ప్రచారం చేస్తున్న వాళ్లను గుర్తించి, శిక్షించాలి

»» రేపల్లె పోలీస్ స్టేషన్‌లో టీడీపీ శ్రేణుల ఫిర్యాదు

రేపల్లె, ఫిబ్రవరి 22: ఓటమి భయంతో వైసీపీ నీచ రాజకీయాలకు, అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని రేపల్లె నియోజకవర్గం టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. రేపల్లె టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వైసీపీ నుంచి పోటీ చేస్తున్నారంటూ వైసీపీ సోషల్ మీడియా హోరెత్తించింది. నియోజకవర్గంలో పలువురికి అదే సమాచారంతో ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. దీనిపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులు గురువారం రేపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరాయి. రేపల్లె నియోజకవర్గంలోని ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు 8038461556 నంబరుతో ఫోన్ వస్తోందని, ట్రూ కాలర్‌లో ఆ నంబరు సీహెచ్ సత్యప్రసాద్ పేరుతో కనిపిస్తోందని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, గురువారం ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఎక్స్ సామాజిక మాధ్యమంలో దీనిపై స్పందించారు. 'వైసీపీ చిల్లర ఆడియో కాల్స్‌కు కంగారు పడకండి.. ఆ కాల్ నాకు కూడా వచ్చింది. విని కడుపుబ్బా నవ్వుకున్నాను. మీరు కూడా విని నవ్వుకుని వదిలేయండి. రేపల్లెలో పసుపు జెండా ఎగరటం ఖాయం... మనం హ్యాట్రిక్ కొట్టటం ఖాయం..!' అని పేర్కొన్నారు. తన పోస్టుకు 'వైసీపీ చీప్ ట్రిక్స్', 'అనగాని ఫర్ రేపల్లె', 'ఫరెవర్ విత్ టీడీపీ'... హ్యాష్ ట్యాగ్స్‌ని జత చేశారు. దీనిపై ఎమ్మెల్యే అనగాని మాట్లాడుతూ, '8038461556 నంబర్ నుంచి నాకూ ఐవీఆర్ఎస్ కాల్ వచ్చింది. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ వైసీపీ నుంచి పోటీ చేస్తున్నారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారు... అంటూ వినిపించిన వాయిస్ కాల్‌తో ముందు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యా' అని అన్నారు.

ప్రేమను నిరాకరించాడని ట్యూటర్‌పై యువతి కక్ష

ఆయన భార్య, కూతురి ఫొటోలు అభ్యంతరకరంగా మార్చి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వైనం... నిందితురాలి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల శిక్షణ కేంద్రంలోని అధ్యాపకుడు, తన ప్రేమను నిరాకరించడానే కోపంతో ఓ యువతి దుర్మార్గంగా ప్రవర్తించింది. ఆయన భార్య, 11 ఏళ్ల కూతురు ఫొటోలను మార్ఫింగ్‌తో అభ్యంతరకర స్థితిలోకి మార్చి ఫేక్ ఐడీలతో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసింది. నిందితురాలు ఏపీలోని అనంతపురానికి చెందిన 24 ఏళ్ల యువతి! ఆమె గ్రూప్-1 శిక్షణ నిమిత్తం హిమాయత్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో చేరింది.. అక్కడ ఓ అధ్యాపకుడికి లవ్ ప్రపోజ్ చేసింది. తనకు అప్పటికే పెళ్లయిందని ఆయన చెప్పినా, ప్రేమ పేరిట వేధింపులకు గురిచేసింది.


చివరికి తన ప్రేమను తిరస్కరించాడని కక్ష పెంచుకొని.. ఆ అధ్యాపకుడి కుటుంబీకుల సమాచారం సేకరించింది. ఆయన భార్య, 11 ఏళ్ల కుమార్తె ఫొటోలు సేకరించి వాటిని మార్ఫింగ్ చేసి.. పలు కోచింగ్ సెంటర్లకు సంబంధించిన ఇన్‌స్టా పేజీలపై అప్‌లోడ్ చేసింది. దీనిపై బాధితుడు ఈనెల 2న సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సాంకేతిక వివరాలను ఆధారంగా చేసుకొని నిందితురాలిని అరెస్టు చేశారు. ఆమె నుంచి రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోక్సో యాక్ట్‌తో పాటు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 23 ఫిబ్రవరి 2024

టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ ప్రొఫెషనల్ కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, నర్సింగ్ తదితర గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



కోర్సులు

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

అర్హత: అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ నిర్వహించే డిప్లొమా ఎగ్జామ్ ఉత్తీర్ణులు/రాసేవారు దరఖాస్తు చేసుకోవచ్చు. బైపీసీ అభ్యర్థులు బయోటెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు ఎగ్జామ్ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి.

- బీఎస్సీ (నర్సింగ్/ఫారెస్ట్రీ)లో ప్రవేశానికి ఇంటర్ స్థాయిలో బైపీసీ/ఎంబైపీసీ చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశానికి అగ్రికల్చర్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. ఫిషరీ సైన్సెస్‌లో ఒకేషనల్ కోర్సు పూర్తిచేసినవారు బీఎఫ్ఎస్సీకి అప్లయ్ చేసుకోవచ్చు.

వయసు: ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో చేరేవారికి 2024 డిసెంబరు 31 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. ఫార్మా-డీ కోర్సులో ప్రవేశానికి 17 ఏళ్లు నిండి ఉండాలి. మిగిలిన కోర్సుల్లో చేరాలంటే 17 నుంచి 22 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు

- ఎంపీసీ గ్రూప్ అభ్యర్థులు 'ఇ' కోడ్ దరఖాస్తు ఫారాన్ని; బైపీసీ గ్రూప్ అభ్యర్థులు 'ఏపీ' కోడ్ దరఖాస్తు ఫారాన్ని సబ్మిట్ చేయాలి.
- బీఈ/బీటెక్/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ / డెయిరీ టెక్నాలజీ/ ఫుడ్ టెక్నాలజీ)/బీఫార్మసీ(ఎంపీసీ)/ఫార్మా-డీ(ఎంపీసీ) కోర్సులకు ఇంజనీరింగ్ (ఇ) కేటగిరీ కింద; బీఎస్సీ/ బీఎస్సీ ఆనర్స్/ బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ/బీఫార్మసీ (బైపీసీ)/ ఫార్మా-డీ(బైపీసీ)/బీటెక్ (ఎఫ్‌టీ/ బయోటెక్నాలజీ) (బైపీసీ) కోర్సులకు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవాలి.

టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 8 నుంచి 12 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 1 నుంచి
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in



టోపీ వర్తకుడు- కోతులు

ఒక ఊరిలో ఓ టోపీల వ్యాపారి ఉండేవాడు. అతడు ఇంట్లోనూ టోపీలు అమ్మేవాడు. రంగు రంగుల టోపీలుండేవి. పిల్లల నుంచి పెద్దల వరకూ ఇంట్లోనే కుట్టించి అమ్మేవాడు. అయితే అతనికి బయట గ్రామాలకు వెళ్లి టోపీలు అమ్ముకోవటానికి ఇష్టపడేవాడు. దీంతో ఒక రోజు తన మిత్రులను చూసినట్లుంటుందని దగ్గరి గ్రామానికి వెళ్లాడు. వెళ్తూ టోపీల బుట్టనూ తీసుకెళ్లాడు. టోపీలు పెద్దగా అమ్ముడవ్వలేదు. వాటినన్నింటినీ మూటగట్టి గంపలో పెట్టుకుని తన గ్రామానికి పయనం అయ్యాడు.

అసలే ఎండాకాలం.. కొంత దూరం వెళ్తానే అలసట వచ్చింది. కాస్త తీసుకొచ్చిన సద్దిని తిని తల వాల్చాడంతే. చల్లగాలి.. చెట్టు కింద నీడకు వెంటనే నిద్రపోయాడు. నిద్రపోయి చూస్తే టోపీలు మాయమయ్యాయి. అయ్యో.. నా టోపీలంటూ గట్టిగా అరిచాడు. ఎవరూ పలకరే. అనవసరంగా ఇంత దూరం వచ్చాను. ఇంట్లో అమ్ముకుంటేనే బావుండేది. ఇలా ఊరికే వచ్చానే.. అనుకుంటూ బాధపడసాగాడు. ఆ తర్వాత కింద కూర్చుని పైకి చూస్తే పదుల కోతులు టోపీలు తల మీద పెట్టుకుని కనిపించాయి. ఇది కలయా? నిజమా? అనుకున్నాడు.



టోపీలు ఇవ్వకుంటే చంపేస్తాని బెదిరించాడు. చేత్తో రాయి విసిరినట్లు కోప్పడ్డాడు. అచ్చు అలానే కోతులన్నీ కోప్పడ్డాయి. కాలితో తంతానంటూ అరిచాడు. ఆ కోతులు కూడా చెట్టుమీద కాళ్లను గట్టిగా విసిరినట్లు అన్నాయి. ఈ వ్యాపారి ఏమి చేసినా కోతులు అనుకరిస్తున్నాయి. వెంటనే కుడిచేత్తో ఎడమచేతిమీద గట్టిగా కొట్టాడు. కోతులూ అంతే విధంగా అనుకరించాయి. దీంతో కోపం వచ్చింది. ఓ ఆలోచన కూడా వచ్చింది.

తన తల మీద ఒక టోపీ ఉంది. దాన్ని తల మీద నుంచి తీసి మళ్లీ పెట్టుకున్నాడు. కోతులన్నీ మాట్లాడుకున్నట్లు జాగ్రత్తగా టోపీలను వాటి తలమీద నుంచి తీసిన తర్వాత మళ్లీ తలమీదనే పెట్టుకున్నాయి. వెంటనే తన తలమీద టోపీని కిందకి విసిరేసాడు. వెంటనే కోతులన్నీ టోపీలను కిందకి విసిరేసాయి. క్షణాల్లో ఆ టోపీలను ఏరుకుని ఓ గుడ్డలో కట్టుకుని పోలోమని ఇంటికి బయలుదేరాడు. దారిలో కోతులూ.. మనుషుల్లానే అని గొణుక్కుంటూ ఇంటి దారి పట్టాడు. ఆ తర్వాత మరెన్నడూ వ్యాపారం చేయటానికి ఆ వర్తకుడు ఇతర గ్రామాలకు వెళ్లలేదు.

10 తేడాలను గుర్తించండి



5 తేడాలను గుర్తించండి







డైలీ సుడోకు - 237

		6			4	9		3
					6		7	
		5	2		7	8	4	
			4					
9		7				3		2
					2			
	6	3	8		9	7		
	7		3					
1		2	7			4		

సుడోకు - 236 సమాధానం

3	4	9	8	2	1	5	6	7
6	5	7	9	3	4	8	1	2
1	2	8	7	5	6	4	9	3
4	3	1	6	8	9	2	7	5
8	9	6	2	7	5	1	3	4
2	7	5	4	1	3	9	8	6
5	6	4	1	9	7	3	2	8
7	1	2	3	4	8	6	5	9
9	8	3	5	6	2	7	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

బిట్ మెస్రాలో ఎంబీఏ

మెస్రాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో బేసిక్ మేనేజ్‌మెంట్ కోర్సులు; చివరి రెండు సెమిస్టర్లలో స్పెషలైజేషన్ కోర్సులు ఉంటాయి. మూడో సెమిస్టర్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. మెస్రా సహా లాల్‌పూర్, నోయిడా, పట్నా క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది.

స్పెషలైజేషన్‌లు: ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్సెస్, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆపరేషన్స్, బిజినెస్ అనలిటిక్స్



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల షీట్లు సబ్మిట్ చేయాలి. క్యాట్/ఎక్స్ఏటీ/సీమ్యాట్/మ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మార్చి 15 నుంచి 17 వరకు
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మార్చి 19
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.bitmesra.ac.in

ఇమ్యూనాలజీలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ 2024-25 మాన్‌సూన్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్/జేజీఈఈబీఐఎల్ఎస్ 2024 స్కోర్, ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయిల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 26
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 8 నుంచి
- **ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** ఏప్రిల్ 28
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6న
- **మొదటి రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 4, 6
- **రెండో రౌండ్ ఇంటర్వ్యూలు:** జూన్ 10, 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nii.res.in

కొమెడ్‌కె యూజీఈటీ

రిమైండర్

కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్ అండ్ డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్ణాటక(కొమెడ్‌కె)- ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(యూజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 400 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ని నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. సింగిల్ విండో సిస్టమ్‌ను అనుసరిస్తారు. కొమెడ్‌కెలో సభ్యత్వమున్న 190 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఈ/బీటెక్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 20,000 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగాలు, పార్టిసిపేటింగ్ కళాశాలల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. బీఆర్క్ ప్రోగ్రామ్‌ను ఈ ఎగ్జామ్ నుంచి మినహాయించారు. దీనికి సంబంధించి విడిగా ప్రకటన విడుదల చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టులలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. కెమిస్ట్రీకి బదులుగా బయోటెక్నాలజీ/బయాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ చదివినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. లేటరల్ ఎంట్రీ అడ్మిషన్స్ ఉండవు.

కొమెడ్‌కె యూజీఈటీ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). ఇందులో మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 60 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన సీబీఎస్ఈ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం మూడు గంటలు. విద్యార్థుల సౌలభ్యం కోసం సంస్థ 11 విభిన్న మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తోంది. వీటికోసం విడిగా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 15 నుంచి ఈ టెస్ట్‌లు అందుబాటులో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 12 నుంచి 16 వరకు
- **టెస్ట్ అడ్మిషన్ టికెట్(టీఏటీ) డౌన్‌లోడింగ్:** మే 6 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, భీమవరం, చీరాల, చిత్తూరు, గుత్తి, గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, పుట్టపర్తి, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడిపత్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్.
- **కొమెడ్‌కె యూజీఈటీ 2024 తేదీ:** మే 12
- **ఫైనల్ కీ విడుదల:** మే 21
- **స్కోర్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 24 నుంచి
- **వెబ్‌సైట్:** www. comedk.org

ఏఆర్‌వో సికింద్రాబాద్ పరిధిలో అగ్నివీరుల నియామకాలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్...'అగ్నిపథ్' కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఈ జిల్లాల అభ్యర్థులు అర్హులు: ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జగిత్యాల, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, మహబూబాబాద్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, ములుగు, నారాయణపేట.

కేటగిరీలు

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత)(ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 1 మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్, సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీల్లో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ.ఉండాలి. **పరీక్ష ఫీజు:** రూ.250

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్/ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్), వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22
ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22
వెబ్‌సైట్: joinindianarmy.nic.in/

రైల్వేలో టెక్నీషియన్స్

మొత్తం ఖాళీలు: 9000

దేశవ్యాప్తంగా అన్ని రైల్వే రీజియన్లలో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. రీజియన్ల వారీగా ఖాళీలు, విద్యార్హతలు, రాత పరీక్ష, సిలబస్ తదితర పూర్తి వివరాలను త్వరలోనే రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటిస్తుంది.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ కశ్మీర్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

పోస్టుల వివరాలు:

1. టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: **1,100 పోస్టులు**
2. టెక్నీషియన్ గ్రేడ్-3: **7,900 పోస్టులు**

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు 18-36 ఏళ్లు; టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: ఫస్ట్ స్టేజ్ సీబీటీ-1, సెకండ్ స్టేజ్ సీబీటీ-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: మార్చి 9
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8
వెబ్‌సైట్: indianrailways.gov.in/

